Downloaded from Playstore - Todays Newspaper Telugu

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 3-6-2019 సోమవారం సిటీ సంపుటి 45 . సంచిక 294

రూ. 6-50 పేజీలు 14+20

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

వీసా కావాలంటే..

సామాజిక మాధ్యమాల వివరాలు ఇవ్వాల్సిందే

- అమెరికా కొత్త నిబంధన

వాషింగ్టన్

వీసా మంజూరు విషయంలో అమెరికా కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఇకముందు దరఖాస్తుదారులు తాము అనుసరిస్తున్న సామాజిక మాధ్యమాల వివరాలను పొందుపరచాల్సి ఉంటుంది. అమెరికాలోకి ప్రవేశించే విదేశీయుల పూర్తి వివరాలు తెలుసుకొనేందుకు తాజాగా ఈ నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. తాత్కాలిక పర్యాటకులు సహా అందరూ ఈ వివరాలను డ్రాప్ డౌన్ మెనూ రూపంలో పొందుపరచవలసి ఉంటుంది. ఒకవేళ సామాజిక మాధ్యమాలను ఉపయోగించకపోతే దరఖాస్తులో ఆ విషయాన్ని ప్రస్తావించాలి. తప్పుడు సమాచారం ఇస్తే కఠిన చర్యలు ఉంటాయని అమెరికా విదేశీ వ్యవహారాల అధికారి ఒకరు తెలిపారు. ఉగ్రవాద కార్యకలాపాలకు సామాజిక మాధ్యమాలు ప్రధాన వేదికగా మారిన నేపథ్యంలో ఈ వివరాలను సేకరించాల్సి వస్తోందని చెప్పారు. వీటన్నింటినీ పరిశీలించిన తరువాతే వీసాలు మంజూరు చేస్తారు. ముస్తుందు దరఖాస్తుదారుడు అంతవరకు చేసిన ప్రయాణ వివరాలను కూడా పేర్కొనాల్సి ఉంటుంది.

ఏపీ భవనాలు తెలంగాణకు

- గవర్నర్ నరసింహన్ ఉత్తర్వులు
- ఇరు రాష్ట్రాల సీఎంల ఆమోదం
- ఆ భవనాల పన్ను బకాయిల రద్దు?
- ఆంధ్రప్రదేశ్‌కు 2 భవనాల కేటాయింపు

ఈనాడు - హైదరాబాద్

హైదరాబాద్ నగరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు కేటాయించిన భవనాలను తెలంగాణకు అప్పగిస్తూ గవర్నర్ నరసింహన్ ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ మంత్రి మండలి వినతి మేరకు ఆది వారం ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్‌మోహన్‌రెడ్డి దీనికి అంగీకరించారని తెలిసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు తమ కార్యాలయాలు నిర్వహించుకునేందుకు వీలుగా హైదరాబాద్‌లోని భవనాలను కేటాయించాలని నిర్ణయించారు. ఇందుకుగానూ కేంద్ర ప్రభుత్వం గవర్నర్ ఛైర్మన్‌గా కమిటీని నియమించింది. ఆయన ఆధ్వర్యంలో ఇరు రాష్ట్రాల సీఎంలు, ప్రధాన కార్యదర్శులు సమావేశమై భవనాల విభజనపై నిర్ణయం తీసుకున్నారు. అందుకు అనుగుణంగా 2014 మే నెలలో గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అధ్యక్షతన గల కమిటీ భవనాల కేటాయింపులు జరిపింది. జనాభా ప్రాతిపదికన 58:42 నిష్పత్తిలో కార్యాలయాల స్థలాలూ కేటాయించారు. అందులో భాగంగా రాష్ట్ర సచివాలయంలో జె, కె, ఎల్, హెచ్ బ్లాక్‌లను ఏపీకి ఇచ్చారు. అలాగే శాసనసభలో పాత భవనాన్ని, జూబ్లీ హాలును కేటాయించారు. లేక్‌వ్యూ అతిథి గృహాన్ని ఏపీ సీఎం క్యాంపు కార్యాలయంగా వినియోగించుకునేందుకు ఇచ్చారు. దీంతోపాటు బూర్గుల రామకృష్ణారావు భవనంలోని దాదాపు 145కుపైగా శాఖాధిపతుల కార్యాలయాలు, టీఎస్ఐఐసీ, సంక్షేమ భవనం, రాష్ట్ర ఆర్థిక సంస్థ, 89 కార్పొరేషన్ల భవనాలు, మంత్రుల నివాస ప్రాంగణాలు, ఎమ్మెల్యేల గృహ సముదాయాలు, వివిధ కార్యాలయాల భవనాలను ఏపీకి బదలాయించారు. (మిగతా 2లో)

రాష్ట్రానికి కేటాయించే భవనాలు?

గతంలో ఏపీకి కేటాయించిన డీజీపీ కార్యాలయాన్ని యథావిధిగా ఏపీ పోలీసు విభాగానికి, ఇతర కార్యకలాపాల కోసం లేక్‌వ్యూ అతిథి గృహాన్ని లేదా మరో భవనాన్ని ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చే అవకాశాలు ఉన్నట్టు సమాచారం.

7న వైకాపా శాసనసభాపక్ష భేటీ

- అసెంబ్లీ సమావేశాల్లో వ్యూహం, మంత్రివర్గం కూర్పుపై చర్చ

ఈనాడు, అమరావతి: వైకాపా శాసనసభాపక్షం ఈ నెల ఏడున సమావేశం కానుంది. ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నారు. 8న రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో.. మంత్రిమండలిలోకి ఎవరిని, ఎందుకు తీసుకుంటున్నామన్న వివరాలను జగన్ అక్కడ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వివరించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. అదే రోజు కొత్త మంత్రుల జాబితానూ ప్రకటించవచ్చని అంటున్నారు. మరోవైపు ఈ నెల 12 నుంచి అసెంబ్లీ సమావేశాలను నిర్వహించే అవకాశం ఉందని వైకాపా వర్గాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా సభాపతి, ఉప సభాపతి ఎన్నిక ఉంటుంది. ఆ పదవులకు ఎవరైతే బాగుంటుందన్న అంశమూ శాసనసభాపక్ష భేటీలో చర్చకు రావచ్చంటున్నారు. (మిగతా 2లో)

మన్యంలో కరెంటు కాటు

ఐదుగురు గిరిజనుల దుర్మరణం

- ఏడాది బాలుడు సహా ఆరుగురికి తీవ్రగాయాలు
- విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టిన ఆటో
- తీగలు తెగి వాహనంపై పడడంతో ప్రమాదం
- విశాఖ ఏజెన్సీ చింతపల్లిలో ఘోరం

చింతపల్లి, న్యూస్‌టుడే- ఈనాడు డిజిటల్, అమరావతి: సంతలో సరకులు కొనుక్కుని ఆటోలో సంతోషంగా ఇంటి బాట పట్టిన ఆ గిరిజనులు లిప్తపాటులో విగత జీవులయ్యారు. ఐదు నిండు ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి. ఏడాది వయసు బాలుడు సహా మరో ఆరుగురు తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. విశాఖపట్నం మన్యంలో ఆదివారం జరిగిన ఆటో ప్రమాదం మిగిల్చిన విషాదం ఇది. ఆటో.. కరెంటు స్తంభాన్ని ఢీకొంటే.. మహా అయితే బోల్తాపడి ప్రయాణికులకు గాయాలవుతాయి. ఇక్కడ విద్యుత్తు తీగలు తెగి.. ఆటోపై పడడంతో ప్రయాణికులందరికీ విద్యుదాఘాతం కావడంతో ఇంత ఘోరం జరిగింది. ఒడిశా సరిహద్దుకు ఆనుకొని ఉండే చింతపల్లి మండలం బలపంచాయతీలో జరిగిన ఈ ఘటన.. ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. మండలంలోని కోరుకొండలో ఆదివారం వారపు సంతకు వచ్చిన పలు గ్రామాలకు చెందిన 12 మంది తిరుగు ప్రయాణంలో చెరువూరు వెళ్లే ఆటో ఎక్కారు. (మిగతా 2లో)

కరెంటు స్తంభాన్ని ఢీకొని ప్రమాదానికి గురైన ఆటో



'తప్పు'టడుగులు

- లోపభూయిష్టంగా ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణ
- తెలుగులో అనువాదం తప్పులపై ఆందోళన
- న్యాయం చేయాలని కోరుతున్న అభ్యర్థులు
- ఆచరణలోకి రాని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ విభాగం

ఈనాడు - అమరావతి

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో పరీక్షల నిర్వహణ లోపభూయిష్టంగా మారింది. దీని వల్ల అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరీక్షల్లో తరచూ వస్తున్న తప్పులతో ముఖ్యంగా గ్రామీణ నేపథ్యం కలిగిన అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. (మిగతా 2లో)

ఇదీసంగతి!

ట్రంప్ నుంచి సార్, మొన్న ఇరాన్ నుంచి చమురు కొనవద్దన్నాడు. నిన్న రష్యా నుంచి క్షిపణులు కొంటే ఖబడ్దార్ అన్నాడు. ఇవాళ కిరాణా దుకాణంలో బియ్యం కొనవద్దంటున్నాడు.

కూలి డబ్బు అడిగారని.. ట్రాక్టర్‌తో తొక్కించాడు

- చిత్తూరు జిల్లాలో దారుణం
- ఇద్దరి దుర్మరణం 2లో

నీతీశ్ మంత్రివర్గ విస్తరణ

- కమలానికి దక్కని చోటు
- కొత్త మంత్రులు 8 మంది జేడీయూ వారే 2లో



Eenadu epaper

Downloaded from Playstore: Todays NewsPaper Telugu

తిరుక్షేత్రం భక్తజన సంద్రం

తిరుమల దివ్యక్షేత్రం భక్తకోటితో కిటకిటలాడుతోంది. వేసవి సెలవులు త్వరలో సమాప్తం కానున్నాయి. ఈలోపు తిరుమలేశుని దర్శించుకుని ఆశీస్సులు పొందాలనే సంకల్పంతో నిత్యం లక్ష మందికిపైగా తరలివస్తున్నారు. ప్రస్తుతం స్వామివారి దర్శనభాగ్యానికి 30 గంటలకుపైగా భక్తులు నిరీక్షించాల్సి వస్తోంది. దీంతో క్యూలైన్లలో గంటలతరబడి నిలుచోలేక కొంతమంది స్వామివారిని దర్శించుకోకుండానే తిరుగు ప్రయాణం అవుతున్నారు. ఈ క్రమంలో అఖిలాండం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకుని కొందరు వెళ్లిపోతుండగా.. మరికొందరు శ్రీవారి ఆలయం ఎదుట ఖాళీ ప్రాంతంలో నిద్ర చేసి వెళుతున్నారు. ఆలయం ఎదుట నిద్రచేసి మొక్కులు చెల్లించుకునే భక్తులు ఆదివారం వేకువజామున ఇలా భారీ సంఖ్యలో కనిపించారు. – న్యూస్‌టుడే, తిరుమల

ఏపీ భవనాలు తెలంగాణకు

(మొదటి పేజీ తరువాయి)

సచివాలయంలో ఏపీ సీఎం, మంత్రులు దాదాపు రెండేళ్లపాటు కొనసాగారు. దీంతో కార్యాలయాల వినియోగం పూర్తిస్థాయిలో జరిగింది. ఆ తర్వాత ఏపీ రాజధాని అమరావతికి తరలిపోగా.. వెనువెంటనే కార్యాలయాలు కూడా అక్కడికి తరలిపోయాయి. ఆ తర్వాత హైదరాబాద్‌లోని భవనాలు నిరుపయోగంగా మారాయి. వాటి తాలూకు ఆస్తిపన్ను, నీటి, విద్యుత్ బకాయిలు రూ.5 కోట్ల మేర పేరుకుపోయాయి. మరోవైపు తెలంగాణకు భవనాల కొరత ఏర్పడింది. ప్రధానంగా సచివాలయంలో మంత్రులంతా ఒకటే బ్లాక్ (డి)లో సర్దుబాటు కావాల్సి వచ్చింది. శాసనసభలో ఒక్కో గదిలో ఇద్దరేసి మంత్రులకు కార్యాలయాలు ఇవ్వాల్సిన పరిస్థితి. శాసన సభ కమిటీ హాళ్లలో రెండు తెలంగాణకు, ఏపీకి మూడు వెళ్లడంతో అక్కడా ఇబ్బందులు ఏర్పడ్డాయి. జూబ్లీహాలు ఏపీకి ఇవ్వడంవల్ల శాసన మండలి నిర్వహణకు మొదట్లో ఇబ్బంది(ఇటీవలే దాన్ని ఏపీ ప్రభుత్వం తెలంగాణకు ఇచ్చింది) ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం వద్ద విభజన సమస్యలపై సమావేశం జరిపినప్పుడల్లా భవనాల అప్పగింత విషయమే చర్చకు వచ్చేది.

ఇరు రాష్ట్రాల సీఎంల చర్చ

ఏపీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత తెలంగాణ సీఎం కేసీఆర్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. తెలంగాణ సీఎంతో జగన్ భేటీ సందర్భంలో, శనివారం గవర్నర్ ఇఫ్తార్ విందుకు ఏపీ సీఎం హాజరైన సమయంలో జరిగిన సమావేశంలోనూ ఈ అంశం చర్చకు వచ్చింది. ఈ నేపథ్యంలో భవనాల సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎంలు ఇద్దరూ నిర్ణయించారు.

మంత్రిమండలి తీర్మానంతో

నిబంధనలను అనుసరించి తెలంగాణ మంత్రిమండలి ద్వారా దీనిపై తీర్మానం చేశారు. సర్క్యులేషన్ ప్రాతిపదికన మంత్రులతో సంతకాలు చేయించి ఆమోదం తీసుకున్నారు. దీని ప్రకారం హైదరాబాద్‌లో ఏపీ ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భవనాలన్నింటినీ తెలంగాణకు అప్పగించాలని మంత్రిమండలి గవర్నర్‌ను కోరింది. ఏపీ ప్రభుత్వ ఉపయోగంలో లేని, వారు వినియోగించుకోని వాటిని తమకు అప్పగించాలని విన్నవించింది. అలాగే ఆంధ్రప్రదేశ్ పోలీస్ విభాగానికి ఒకటి, ఇతర కార్యాలయాలు నిర్వహించుకోవడానికి మరొకటి చొప్పున రెండు భవనాలు ఆ ప్రభుత్వానికి కేటాయించాలని కూడా అభ్యర్థించింది. ఆ విజ్ఞప్తిపై గవర్నర్ నరసింహన్ సానుకూలంగా స్పందించి హైదరాబాద్‌లోని ప్రభుత్వ కార్యాలయాలన్నింటినీ తెలంగాణ ప్రభుత్వానికి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర విభజన చట్టంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో తనకు నిర్దేశించిన అధికారాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అదే విధంగా ఏపీ పోలీస్ విభాగానికి ఒక భవనం, ఇతర కార్యాలయాలకు మరొక భవనం కేటాయించనున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. గతంలో ఏపీకి కేటాయించిన డీజీపీ కార్యాలయాన్ని యథావిధిగా ఏపీ పోలీసు విభాగానికి, ఇతర శాఖ కార్యకలాపాల కోసం లేక్‌వ్యూ అతిథి గృహాన్ని లేదా మరో భవనాన్ని ఏపీకే ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

స్వాగతించిన కేసీఆర్

భవనాల అప్పగింతపై సీఎం కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. గవర్నర్ ఉత్తర్వులను ఆయన స్వాగతించారు. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రజా ప్రయోజనాలే పరమావధిగా, స్నేహ భావంతో ముందడుగు వేయడం శుభపరిణామన్నారు. మరోవైపు, ఆదివారం సాయంత్రం ఆయన రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. ఏపీతో సామరస్యంగా వ్యవహరించి, అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈసందర్భంగా తెలిపారు.

పన్ను బకాయిలు రద్దు చేయండి: గవర్నర్

ప్రస్తుతం ఏపీ నుంచి తెలంగాణకు బదలాయించిన భవనాల తాలూకు ఆస్తిపన్ను, విద్యుత్, ఇతర ప్రజోపయోగ సేవల బకాయిలను రద్దు చేయాలని గవర్నర్ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు.

'తప్పు'టడుగులు

(మొదటి పేజీ తరువాయి)

ఏటా దాదాపు 30వరకూ నోటిఫికేషన్లు ఇవ్వడం, హడావుడిగా పరీక్షలు నిర్వహించడం, ప్రశ్నపత్రాల రూపకల్పన, వాటిని తెలుగులోకి తర్జుమా చేయడం వంటి అంశాలపై పకడ్బందీ వ్యవస్థ లేకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సాధారణంగా కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ విభాగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తే చాలా వరకూ మేలు జరిగేది. పరీక్షలు నిర్వహించిన తర్వాత ఎప్పటికప్పుడు తప్పులను సరిదిద్దుకోవడానికి, అభ్యర్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించడానికి, ఇతరత్రా దీనికి సంబంధించిన అన్ని విషయాలపై సమగ్ర అధ్యయనం చేయడానికి, పర్యవేక్షణకు అవకాశం ఉండేది. గత రెండేళ్లుగా ఈ ప్రతిపాదన కాగితాల దశలోనే మూలుగుతోంది. ప్రస్తుతం కమిషన్ కార్యకలాపాలు కార్యదర్శి స్థాయిలో జరుగుతున్నాయి. గత నెల 26న జరిగిన గ్రూపు-1 స్క్రీనింగ్ టెస్ట్‌లో 36 ప్రశ్నల్లో అస్పష్టత, గందరగోళం, తికమకగా ఉన్నాయని, కొన్నింటికీ అర్థాలు మారాయని పలువురు అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేసిన విషయం విదితమే. ప్రధానంగా ఆంగ్ల ప్రశ్నలను తెలుగులోకి అనువాదం చేయడంలో ఈ తప్పులు దొర్లాయి. రహస్య పద్ధతిలో జరిగే ఈ ప్రక్రియపై తాము దృష్టి సారించలేకపోతున్నామని కమిషన్ వర్గాలు చెబుతున్నాయి. మరో పక్క ఇతర శాఖల ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే వృత్తి విద్య ప్రవేశపరీక్షలు, డీఎస్సీ, ఇతర ఉద్యోగ నియామక పరీక్షల్లో దొర్లుతున్న తప్పులు తక్కువగా ఉంటున్నాయి. దీనిపై 'ఈనాడు' సమగ్ర విశ్లేషణ కథనం.

వారే ఆధారం!

కమిషన్ ప్రశ్నపత్రాలను పొరుగు రాష్ట్రాల్లో ఉన్న సీనియర్ ఆచార్యుల ద్వారా నాలుగైదు 'సెట్ల' రూపంలో తయారు చేయిస్తోంది. వాటిని రాష్ట్ర పరిధిలోని కొందరు ఆచార్యుల ద్వారా తెలుగులోకి అనువాదం చేయిస్తోంది. అదీ కూడా సంబంధిత సబ్జెక్టుతో సంబంధం లేని వారితో చేయించడం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అనువాదం చేసినందుకు ఇచ్చే పారితోషికం తక్కువగా ఉండడం, ఎక్కువ సమయాన్ని కేటాయించాల్సి వస్తుందన్న ఉద్దేశంతో ఆచార్యుల్లో కొందరు ఆసక్తి కనబరచడం లేదు. వృత్తిపరమైన సంతృప్తి కోసం ఆలోచించే వారు మాత్రమే ముందుకువస్తున్నారు. అటు ప్రశ్నపత్రాల్లో ఇటు తెలుగు అనువాదంలో తప్పులు జరిగినా సంబంధిత ఆచార్యులపై చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. విశ్వవిద్యాలయాల పరిధిలో పనిచేసే ప్రొఫెసర్లలో ప్రతిభ కలిగిన వారిని గుర్తించి...సంప్రదింపులు జరిపిన అనంతరం ఎంపిక చేస్తున్నామని కమిషన్ వర్గాలు పేర్కొంటున్నాయి.

తమిళనాడులో ఇలా...

తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో కార్యదర్శి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా ఐ.ఎ.ఎస్.లు ఉన్నారు. ఏపీపీఎస్సీలో అధికారిక కార్యకలాపాలు అన్నీ కార్యదర్శి ద్వారా జరుగుతున్నాయి. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కూడా ఈ పోస్టుల్లో నియమితులవుతున్నారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ విభాగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామని, పరీక్షల నిర్వహణ అనంతరం సమీక్షలు జరిపి, గమనించిన అంశాలకు అనుగుణంగా చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు కమిషన్ చెబుతున్నా ఇంతవరకు అది జరగలేదు.

అనువాదం ఎలా ఉందంటే...

ఆంగ్లం నుంచి తెలుగులో తర్జుమా చేసినప్పుడు ...'కరెంట్ అకౌంట్ సర్‌ప్లస్‌ను అధిక విద్యుత్తు సరఫరాగా, ఇంటర్ స్టేట్ కౌన్సిల్- రాష్ట్రాల మధ్య కౌన్సిల్, డైరెక్టివ్ ప్రిన్సిపల్ ఆఫ్ స్టేట్ పాలసీ- రాష్ట్ర పాలసీకి సంబంధించిన డైరెక్టివ్ ప్రిన్సిపల్, నేషనల్ ఇంటిగ్రేషన్ కమిషన్-దేశీయ అనుసంధాన కమిషన్, అడ్జర్న్‌మెంట్ సైన్ డై-వాయిదా సైన్ డే, మని బిల్-డబ్బుకు సంబంధించిన బిల్, సౌత్ పోల్-యూత్ పోల్, ఫెడరల్ ఫ్యూచర్స్-ఫెడరల్ లక్షణాలు, శాంక్షన్-సాంక్షను, ఎల్లోస్టోన్ నేషనల్ పార్క్-పసుపురాతి నేషనల్ పార్క్, నెర్ఫ్ ఆఫ్ సిగ్నవర్స్ ఆఫ్ లైఫ్ అని ఆంగ్లంలో ఉండగా తెలుగులో మానవ జీవిత రేఖలను తెలుసుకోవడం...'అని అనువాదం చేసి ఇచ్చారు. గ్రూపు-3లోనూ ఇలాగే తెలుగు అనువాదంలో తప్పులు దొర్లాయి.

అధ్యయనంపై కమిషన్ దృష్టి

గ్రూపు-1 స్క్రీనింగ్ టెస్ట్‌లో భారీగా దొర్లిన తెలుగు అనువాద తప్పుల నేపథ్యంలో భవిష్యత్తులో వాటిని తగ్గించేందుకు ఉన్న మార్గాలపై కమిషన్ ప్రస్తుతం దృష్టి పెట్టింది. ఇతర పబ్లిక్ సర్వీస్ కమిషన్ల స్థానిక మాధ్యమంలో అనువాదానికి వ్యవహరిస్తున్న విధానాలు, ఇతర అంశాలపై పరిశీలించాలని కమిషన్ వర్గాలు భావిస్తున్నాయి. రాష్ట్రంలో వృత్తి విద్య ప్రవేశ పరీక్షల్లో, ఉపాధ్యాయులు, పోలీసు ఉద్యోగ నియామకాల సందర్భంగా ప్రశ్నపత్రాల రూపకల్పనలో అనుసరిస్తున్న విధానాలను కూడా పరిశీలిస్తామని కమిషన్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఉద్యోగ నోటిఫికేషన్లు ఎప్పుడు అంటే అప్పుడు ఇస్తుండడం, వెంటనే పరీక్షలు పెట్టాల్సి వస్తున్నందున ప్రశ్నపత్రాలు పకడ్బందీగా తయారు చేయడానికి తగిన సమయం ఉండడంలేదని చెబుతున్నాయి.

36 ప్రశ్నల్లో అస్పష్టత.. న్యాయం చేయాల్సిందే...!

గ్రూపు-1 స్క్రీనింగ్ టెస్టులో దొర్లిన తప్పుల వల్ల తాము తీవ్రంగా నష్టపోయామని పలువురు అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆంగ్లం నుంచి తెలుగులోకి గూగుల్ ద్వారా అనువాదం చేసినందున 36 ప్రశ్నల్లో అస్పష్టత, గందరగోళం నెలకొందని, అర్థాలు మారాయని వారు పేర్కొంటున్నారు. కమిషన్ ఇందుకు నైతిక బాధ్యత వహించి తమకు న్యాయం చేయాలని అభ్యర్థిస్తున్నారు. ప్రధాన పరీక్షకు ఒక్కో పోస్టుకు 50 మందిని కాకుండా 12 లేదా 15 మందిని ఎంపిక చేస్తే వెనుకబడిపోతామని వాపోతున్నారు. 'కీ'ను ఖరారు చేసే సమయంలో అభ్యర్థుల విజ్ఞప్తులను పరిగణనలోనికి తీసుకుంటాం. తెలుగులో ఇచ్చిన ప్రశ్నలు పూర్తిగా అర్థం మారి, అభ్యర్థులకు నష్టపోయినట్లు తేలితే తప్పకుండా న్యాయం చేస్తామని కమిషన్ వర్గాలు వెల్లడించాయి.

7న వైకాపా శాసనసభాపక్ష భేటీ

(మొదటి పేజీ తరువాయి)

అలాగే సభలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపైనా చర్చించనున్నారు. విషయ పరంగా, ప్రతిపక్ష దాడిని ఎదుర్కొనేందుకు వివిధ అంశాలపై ఏ బృందంలో ఏ ఎమ్మెల్యే ఉండాలన్న దానిపైనా చర్చ జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. పూర్తి ఎజెండా సోమవారం ఖరారు చేయనున్నట్లు తెలిసింది.

5న కేరళకు నైరుతి

ఈనాడు, విశాఖపట్నం: నైరుతి రుతుపవనాలు ఈనెల 5వ తేదీన కేరళ రాష్ట్రాన్ని తాకే అవకాశాలు కనిపిస్తున్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఆ తర్వాత అవి అక్కడ రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తాయని అంచనా వేస్తున్నారు.ఈ నెల రెండో వారంలో ఆంధ్రప్రదేశ్‌ను తాకే అవకాశాలు కనిపిస్తున్నాయి.

6, 7న కోస్తాలో వడగాలులు

ఉత్తరాంధ్ర జిల్లాల మీదుగా ఈ నెల 6, 7వ తేదీల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఉత్తరాంధ్రతోపాటూ యానాంలో కూడా ఈ తరహా ప్రభావం కనిపిస్తుందని వారు వెల్లడించారు. మరోవైపు సోమవారం రాష్ట్రంలో కొన్నిచోట్ల ఉరుములు మెరుపులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు.కొన్ని చోట్ల పిడుగులు పడతాయని, ఈదురుగాలులు గంటకు 30-40 కి.మీ వేగంతో వీస్తాయని వారు వివరించారు.

ఏడాది చివరిలో శ్రీలంక అధ్యక్ష ఎన్నికలు

నవంబర్ 15, డిసెంబర్ 7 మధ్య నిర్వహిస్తాం: ఈసీ

కొలంబో: శ్రీలంక అధ్యక్ష ఎన్నికలు ఈ ఏడాది చివరిలో నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం అధ్యక్షుడు మహేంద్ర దేశప్రియ చెప్పారు. ప్రస్తుత అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన ఐదేళ్ల పదవీకాలం 2020 జనవరి 5కి ముగుస్తుంది. నిబంధనల ప్రకారం దీనికి నెల రోజుల ముందే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అందువల్ల నవంబర్ 15 నుంచి డిసెంబర్ 7 మధ్య అనువైన రోజున అధ్యక్ష ఎన్నికలు నిర్వహిస్తామని దేశప్రియ వెల్లడించారు. గత ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షమైన యునైటెడ్ నేషనల్ పార్టీ.. మైత్రిపాల సిరిసేనను ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా అప్పటి అధ్యక్షుడు మహింద్ర రాజపక్సెపై పోటీకి నిలిపింది. 2015 జనవరి 8న ఆయన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

సుష్మా బాటలోనే జయ్ శంకర్

దిల్లీ: విదేశీ వ్యవహారాల మాజీ మంత్రి సుష్మా స్వరాజ్ మాదిరిగానే ప్రస్తుత మంత్రి జయ్‌శంకర్ కూడా సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరువవుతున్నారు. ట్విట్టర్ వేదికగా ఆయన సమస్యలకు పరిష్కారాలను చూపుతున్నారు. ఇటలీలో తమ కుటుంబ సభ్యుల పాస్‌పోర్టులు పోయాయని ఆదివారం మహాలక్ష్మి అనే మహిళ ట్విట్టర్ ద్వారా ఫిర్యాదు చేయగా, రోమ్‌లోని రాయబార కార్యాలయం, మ్యూనిక్‌లోని కాన్సుల్ జనరల్ అన్ని విధాలుగా సహాయం చేస్తారని ధైర్యం చెప్పారు. కోర్టు సమన్లు పట్టించుకోకుండా తన భర్త కువైట్‌లో కాలంగడుపుతున్నారంటూ ఇంకో మహిళ ట్వీట్ చేశారు. ఇందుకు సమాధానం ఇస్తూ కువైట్‌లోని రాయబార కార్యాలయం అధికారులు ఆయనను రప్పించే పనిలో ఉన్నారని తెలిపారు.

నీతీశ్ మంత్రివర్గ విస్తరణ

- 8 మందికి చోటు.. భాజపాకు దక్కని స్థానం

పట్నా: బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ఆదివారం 8 మందితో తన మంత్రివర్గాన్ని విస్తరించారు. అయితే అందులో భాగస్వామ్యపక్షాలైన భాజపా, ఎల్జేపీలకు చోటు కల్పించలేదు. నీతీశ్ మంత్రివర్గంలో ముగ్గురు లోక్‌సభకు ఎన్నికవడంతో ఆ స్థానాలు ఖాళీ అయ్యాయి. వాటిని భర్తీ చేయడంతోపాటు కొత్తగా మరికొందరితో క్యాబినెట్‌ను విస్తరించారు. తాజాగా మంత్రి పదవులు పొందినవారంతా జేడీ (యూ) వారే కావడం గమనార్హం. కేంద్ర మంత్రివర్గంలో ఒక్క స్థానమే ఇస్తామని భాజపా చెప్పడంతో జేడీ(యూ) మోదీ క్యాబినెట్‌లో చేరలేదు. దీంతో భాజపాతో జేడీ(యూ)కు పొరపొచ్చాలు వచ్చాయన్న వార్తలు వెలువడ్డాయి. అదేమీ లేదని నీతీశ్ చెబుతున్నా తాజాగా రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో భాజపాకు చోటు కల్పించకపోవడం చర్చనీయాంశమయింది. నీతీశ్ భాజపాకు ఒక మంత్రి పదవి ఇస్తామన్నారని, భవిష్యత్తులో దాన్ని తీసుకుంటామని ఆ పార్టీ సీనియర్ నేత, ఉప ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోదీ చెప్పారు.

మంత్రిగా ప్రమాణం చేసిన అనంతరం సీఎం నీతీశ్‌కుమార్‌కు పాదాభివందనం చేస్తున్న విమా భారతి

ఇఫ్తార్ విందును భగ్నం చేస్తారా?

పాకిస్థాన్‌పై నిరసన వ్యక్తం చేసిన భారత్

దిల్లీ/ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో భారత రాయబారి ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందును భగ్నం చేసేందుకు ఆ దేశం చేసిన ప్రయత్నాలను భారత్ తీవ్రంగా ఖండించింది. నాగరిక ప్రవర్తన భావనలన్నింటినీ పాకిస్థాన్ ఉల్లంఘించిందని మండిపడింది. భారత హైకమిషనర్ అజయ్ బిసారియా ఇస్లామాబాద్‌లోని సెరెనా హోటల్లో శనివారం ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. దీనికి హాజరైన 300 మంది అతిథులను భద్రతా సిబ్బంది ఆపేశారు. దౌత్యవేత్తలు, రాయబార కార్యాలయ అధికారులను నిరోధించడం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీయడమేనని భారత రాయబార కార్యాలయం ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఖండించింది. భద్రతా సిబ్బంది రోడ్డుమీద నిలబడి అతిథులను, దౌత్యసిబ్బందిని భయపెట్టారని రాయబార కార్యాలయం తెలిపింది. కొందరు అధికారులను తోసేసి.. తిట్టి, బెదిరించారని, వారివద్ద ఉన్న చరవాణులను కూడా లాక్కున్నారని చెప్పారు. ఈ కార్యక్రమానికి వచ్చేవాళ్లకు ముందుగా ఫోన్లు చేసి రావొద్దని చెప్పారన్నారు. హోటల్లోకి వెళ్లేవారిపై పోలీసులు, ఉగ్రవాద నిరోధక బృందాల సభ్యులు అసభ్యంగా ప్రవర్తించారని మెహ్రీన్ జహ్రా-మాలిక్ అనే పాత్రికేయురాలు ట్వీట్ చేశారు. పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ సీనియర్ నాయకుడు ఫర్హాతుల్లా బాబర్ కూడా దీన్ని విమర్శించారు. కొందరు అతిథులు రాలేకపోయినందుకు, వచ్చినవారు కూడా ఇబ్బంది పడినందుకు భారత హైకమిషనర్ అజయ్ బిసారియా క్షమాపణలు చెప్పారు. కొందరు లాహోర్, కరాచీ నుంచి కూడా ఈ కార్యక్రమానికి వచ్చారంటూ వారికి ధన్యవాదాలు తెలిపారు.

రామ మందిర నిర్మాణానికి భూమిని కేటాయించండి

మోదీకి లేఖ రాసిన సుబ్రమణ్య స్వామి

దిల్లీ: అయోధ్యలోని రామ మందిరం నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని భాజపా ఎంపీ సుబ్రమణ్య స్వామి ప్రధానిని కోరారు. రామ సేతును జాతీయ వారసత్వ నిర్మాణంగా ప్రకటించాలని కూడా అభ్యర్థించారు. ఈ మేరకు ప్రధానికి ఒక లేఖ రాశారు. అయోధ్య భూమిని 1993లో పి.వి.నరసింహారావు ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని, అందువల్ల దాన్ని మందిరం కోసం కేటాయించే అంశంలో సుప్రీం కోర్టు నుంచి అనుమతి అవసరంలేదని తెలిపారు. అయోధ్య స్థల వివాదం సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. వివాదాస్పద భూమికి చుట్టు పక్కల ఉన్న 67 ఎకరాలను దాని అసలు యజమాని అయిన 'రామజన్మభూమి న్యాస్'కు అప్పగించేందుకు అనుమతించాలంటూ ఈ ఏడాది జనవరిలో మోదీ ప్రభుత్వం సుప్రీం కోర్టులో ఒక దరఖాస్తును దాఖలు చేసింది. నిజానికి ఈఅంశంలో సర్వోన్నత న్యాయస్థాన అనుమతి అవసరంలేదని, భూమి ప్రభుత్వ అధీనంలోనే ఉందని స్వామి పేర్కొన్నారు.

మన్యంలో కరెంటు కాటు

(మొదటి పేజీ తరువాయి)

వంచుర్ల గంగరాజు మృతదేహం

దారిలో అదుపు తప్పిన ఆటో రహదారి పక్కనున్న విద్యుత్తు స్తంభాన్ని బలంగా ఢీకొంది. స్తంభంపైనున్న తీగలు తెగి ఆటోపై పడటంతో వారంతా విద్యుదాఘాతానికి గురయ్యారు. వంచుర్ల గంగరాజు (37), లోత బొంజిబాబు (30), ఆటో డ్రైవర్ వంతల కృష్ణారావు (25), జనుగురు ప్రసాద్ (20) అక్కడికక్కడే మృతిచెందగా.. వంచుర్ల చిట్టిబాబు (40) లోతుగెడ్డ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. వండలం రామ్మూర్తి, వంచుర్ల చిన్నబ్బాయి, లోత వరలక్ష్మి, పాతును జానుబాబు, వెచ్చంగి దావీదు, ఏడాది వయసున్న జనుగురు వివేక్ తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా మృత్యువుతో పోరాడుతున్నారు. మృతుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు, క్షతగ్రాతుల హాహాకారాలతో లోతుగెడ్డ ఆసుపత్రి పరిసరాలు హృదయ విదారకంగా మారాయి. మృతులు, క్షతగాత్రులంతా చెరువూరు, చీకుపనస, సబ్బంపల్లి గ్రామాలకు చెందినవారు. ఆటో ప్రమాదంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారుల్ని ఆదేశించారు. ప్రమాదంపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. బాధిత కుటుంబాలకు నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించాలని స్పష్టం చేశారు.

1869 - 2019 మహాత్ముడి 150వ జయంతి వేడుకలు

అంతరించిపోయేవాళ్లం కాదూ!

మానవాళిని నడిపించేదీ, శాసించేదీ
ప్రేమ సూత్రమేగానీ మరోటి కాదు.
మనల్ని నడిపించేది స్పర్ధ,
హింసే గనక అయితే మానవ జాతి
ఎప్పుడో అంతరించిపోయి ఉండేది. ఆ
విషయం గుర్తించకుండా, మనం గొప్పగా
చెప్పుకొనే నాగరిక సమాజాలు, దేశాలన్నీ
ఇప్పుడు కూడా మన సమాజానికి
హింసే మూలాధారం అన్నట్టు
ప్రవర్తిసుండటం పెద్ద విషాదం!

– మహాత్మా గాంధీ

గ్రహం అనుగ్రహం

3-6-2019 సోమవారం

శ్రీ వికారి నామ సంవత్సరం॥ ఉత్తరాయణం
వసంత రుతువు; వైశాఖ మాసం; బహుళ పక్షం
అమావాస్య: మ. 3-38 తదుపరి
శుక్లపక్ష పాడ్యమి
రోహిణి నక్షత్రం: రా.12-46 తదుపరి మృగశిర
అమృత ఘడియలు: రా. 9-33 నుంచి 11-09 వరకు
వర్జ్యం: సా. 4-44 నుంచి 6-20 వరకు
దుర్ముహూర్తం: మ. 12-22 నుంచి 1-14 వరకు
తిరిగి 2-57 నుంచి 3-49 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.5-28; సూర్యాస్తమయం: సా.6.24

ఎండా కాలం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
తిరుపతి	43.9	29.8
నెల్లూరు	43.0	30.0
హైదరాబాద్	42.7	28.9
కర్నూలు	42.5	31.2
రాజమహేంద్రవరం	42.5	29.5
విజయవాడ	41.8	28.8
ఒంగోలు	41.3	30.6
కడప	41.0	29.0
గుంటూరు	40.9	30.2
అనంతపురం	40.8	26.6
తాడేపల్లిగూడెం	40.0	28.0
విశాఖపట్నం	37.2	29.5
శ్రీకాకుళం	36.0	29.0
నరసాపురం	35.4	29.9

కూలి డబ్బు అడిగారని ట్రాక్టర్‌తో తొక్కించాడు

మదనపల్లె (నేరవార్తలు), న్యూస్‌టుడే: కూలీల మీదకు ట్రాక్టర్‌ను నడిపిన అర్థం లేని ఆవేశం ఒకవైపు.. అవమానానికి ప్రతీకారం తీర్చుకోవాలన్న ఆవేదనతో ప్రాణాలకు తెగించిన సోదరుల మొండితనం మరోవైపు.. వివాదం చిన్నదే అయినా.. అది రగిల్చిన ఆవేశకావేశాలు రెండు నిండు ప్రాణాలను ఆహుతి చేశాయి. కూలి డబ్బుల వివాదం చిత్తూరు జిల్లాలో రెండు ప్రాణాలను బలిగొంది. మదనపల్లె గ్రామీణ మండలంలో ఆదివారం ఈ ఘటన వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. మదనపల్లె మండలం బసినికొండకు చెందిన చంద్రానాయక్‌కు ట్రాక్టర్ ఉంది. వలసపల్లె పంచాయతీ ములకలదిన్నె గ్రామానికి చెందిన హరికుమార్ (32).. ఆయన వద్ద రెండు వారాలు డ్రైవర్‌గా పనిచేసి మానేశాడు. కూలి డబ్బు తీసుకునేందుకు తన చిన్నాన్న కుమారుడు నాగభూషణాన్ని (18) తీసుకుని ఆదివారం ఉదయం పుంగనూరు మండలం ఎల్ఆర్ బైలు సమీప చెరువు నుంచి ఇసుక తరలిస్తున్న చంద్రానాయక్ వద్దకు వెళ్లాడు. కూలి డబ్బు విషయమై అడగ్గా.. పనికి సక్రమంగా రాకుండా డబ్బు అడుగుతున్నావా అంటూ చంద్రానాయక్ దాడి చేసి కొట్టాడు. దీంతో హరికుమార్ తన గ్రామంలోని స్నేహితులకు, కుటుంబ సభ్యులకు విషయాన్ని చెప్పి.. చెరువు వద్దకు రావాలని కోరాడు. ఈలోపు చంద్రానాయక్ ట్రాక్టర్ తీసుకుని వెళ్లే ప్రయత్నం చేయగా.. హరికుమార్, నాగభూషణం ట్రాక్టర్‌కు అడ్డుగా నిలబడ్డారు. తప్పుకోకుంటే తొక్కించేస్తానని చంద్రానాయక్ బెదిరించాడు. అయినా వారు తప్పుకోకపోవడంతో ఆవేశంలో ట్రాక్టర్‌ను వారిద్దరిపైకి పోనిచ్చాడు. ఇద్దరూ ట్రాక్టర్ కింద పడిపోయినా పట్టించుకోకుండా ముందుకు వెళ్లిపోయాడు. ఇదే సమయంలో గ్రామం నుంచి వచ్చిన హరికుమార్ కుటుంబ సభ్యులు, స్నేహితులు రోడ్డుపై తీవ్ర గాయాలతో పడి ఉన్న వారిని గుర్తించి 108కు సమాచారం అందించారు. వాహన సిబ్బంది వచ్చి పరీక్షించి అప్పటికే ఇద్దరూ మృతి చెందినట్లు తెలపడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చంద్రానాయక్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హరికుమార్‌కు భార్

Downloaded from Playstore: Todays NewsPaper Telugu

డివిజన్లు పెరుగుతున్నాయ్!

- నాలుగు నగరాల్లో అదనంగా 32
- ప్రభుత్వ ఆమోదానికి ప్రతిపాదనలు
- నెల్లూరు, కడపలో సరిహద్దులే సవరణ

విశాఖ నగరపాలక సంస్థ కార్యాలయం

ఈనాడు - అమరావతి

రాష్ట్రంలో వివిధ నగరపాలక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న డివిజన్లు పెరగనున్నాయి. ఇప్పటికే ఉన్న, కొత్తగా ఏర్పడనున్న వాటిల్లో కొన్ని చోట్ల ప్రజాభిప్రాయాన్ని పూర్తి చేసి ప్రభుత్వ ఆమోదానికి ప్రతిపాదనలు పంపారు. ఇంకొన్నిచోట్ల పునర్విభజన ప్రక్రియ వివిధ దశల్లో ఉంది. ఈ ప్రతిపాదనలను సర్కారు ఆమోదిస్తే పెరిగిన డివిజన్ల మేరకు నగరపాలక సంస్థల్లో ఎన్నికలకు వెళ్లనున్నారు. మూడు దశల్లో పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నద్ధమవుతున్న విషయం తెలిసిందే. తొమ్మిది నగరపాలక సంస్థల్లోని 460 డివిజన్లలో ఇటీవలే ఓటర్ల తుది జాబితాలను అధికారులు విడుదల చేశారు. మరో ఆరింటిలో పునర్విభజన చేపట్టారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక జాబితాలు ప్రకటించి బీసీ, ఎస్సీ, ఎస్టీల గణన ప్రారంభిస్తారు.

- స్పెషల్ గ్రేడ్ పురపాలక సంఘంగా ఉన్న విజయనగరానికి 2015లో నగరపాలక సంస్థగా ఉన్నత స్థాయి కల్పించారు. కొన్ని సాంకేతిక సమస్యలతో ఈనెల 20తో పాలకవర్గ పదవీ కాలం ముగిశాక దీనిని నగరపాలక సంస్థగా గుర్తించనున్నారు. వెంటనే ఎన్నికలు నిర్వహించేలా ప్రక్రియను పూర్తి చేశారు. 40 నుంచి 50కి డివిజన్లను పెంచుతూ ప్రతిపాదనలను పంపారు.
- మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ)లో 2014లో భీమునిపట్నం మండలంలోని ఐదు పంచాయతీలు జీవీఎంసీలో విలీనాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు హైకోర్టుకు వెళ్లడంతో వీటిని మినహాయించి భీమునిపట్నం, అనకాపల్లి పురపాలక సంఘాలతో పాటు అనకాపల్లి మండలంలోని ఐదు పంచాయతీలను కలిపి పునర్విభజించారు. వీటిపై ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేసి డివిజన్ల సంఖ్యని 72 నుంచి 81కి పెంచారు.
- మచిలీపట్నం నగరపాలక సంస్థలో ఈ సంఖ్య 42 నుంచి 50కి పెరిగింది. 2015లో దీనిని నగరపాలక సంస్థగా ప్రకటించారు. పాలకవర్గ పదవీకాలం ముగిసేలోగా ప్రక్రియ పూర్తి చేయాలన్న ఆదేశాలతో అధికారులు ఇప్పుడున్న నగర విస్తీర్ణ పరిధిలోనే ఎనిమిది డివిజన్లను అదనంగా పెంచారు. కొత్త ప్రాంతాల విలీన ప్రతిపాదనలు ఉన్నా వాటి జోలికి పోలేదు.
- గుంటూరు నగరపాలక సంస్థలో 2012లో పది గ్రామాల విలీనంపై నాయుడిపేట గ్రామస్థులు వ్యతిరేకిస్తూ హైకోర్టుకి వెళ్లారు. పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఆదేశాలపై ఆ గ్రామాన్ని మినహాయించి మిగతా ప్రాంతాలతో ప్రక్రియను పూర్తి చేయాలి. కొత్త ప్రభుత్వ తాజా ఆదేశాలపై అధికారులు తదుపరి చర్యలు తీసుకోనున్నారు. ఇక్కడ డివిజన్ల సంఖ్య 52 నుంచి 57కి పెరిగే అవకాశాలున్నాయి.
- నెల్లూరు నగరపాలక సంస్థలో ఇంకా స్పష్టత రావాలి. ఉన్న 54 డివిజన్లలో జనాభా, విస్తీర్ణం ఒకేలా ఉండేలా చర్యలు తీసుకోవాలి. కొన్నింటిలో విస్తీర్ణం, జనాభా ఎక్కువ ఉంటే, ఇంకొన్ని చోట్ల తక్కువగా ఉంది. లోపాలను సరి చేయాలన్న ప్రతిపాదనలపై అధికారులు దృష్టి పెట్టాలి. పొట్టిపాలెం గ్రామ విలీనంపై హైకోర్టు తీర్పు ఉన్నందున 38వ డివిజన్ నుంచి దానిని మినహాయించి ప్రక్రియను పూర్తి చేయాలి.
- హైకోర్టు ఆదేశాలపై కడప నగరపాలక సంస్థలో 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. ఇప్పుడున్న 50 డివిజన్ల సంఖ్య పెరగకపోయినా జనాభా, విస్తీర్ణం, సరిహద్దులు మారే అవకాశాలు ఉన్నాయి. దీనిని సాధ్యమైనంత వేగంగా పూర్తి చేసి ఓటర్ల తుది జాబితాలను విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు.

వివిధ నగరపాలక సంస్థల్లో ప్రస్తుత వార్డులు పెంచుతూ పంపించిన ప్రతిపాదనల వివరాలిలా..

నగరపాలక సంస్థ	ప్రస్తుత డివిజన్లు	పెరిగేవి	మొత్తం
విశాఖపట్నం	72	9	81
విజయనగరం	40	10	50
మచిలీపట్నం	42	8	50
గుంటూరు	52	5	57

సదస్సుకు హాజరైన వారితో గోక్షేత్రంలో పర్యటిస్తున్న విజయరామ్

భూగర్భజల పరిరక్షణ అందరి బాధ్యత

ప్రకృతి వ్యవసాయ సదస్సులో విజయరామ్

మచిలీపట్నం (కలెక్టరేట్), న్యూస్‌టుడే: భూగర్భజలాల పరిరక్షణ విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సేవ్ సంస్థ అధ్యక్షుడు మేకపోతుల విజయరామ్ కోరారు. ప్రకృతి వ్యవసాయ సదస్సులో భాగంగా కృష్ణా జిల్లా గూడూరు మండలం పినగూడూరులంకలో ఆదివారం (రెండోరోజు) భూగర్భ జలాల సంరక్షణపై విస్తృతంగా చర్చించారు. అధిక దిగుబడులే లక్ష్యంగా విచక్షణారహితంగా రసాయనిక ఎరువులు, పురుగు మందులు విని యోగిస్తూ చేస్తున్న వ్యవసాయ విధానం వల్ల ఆరోగ్యపరంగా, ప్రకృతి పరంగా అపారనష్టం జరుగుతోందంటూ విజయరామ్ ఆవేదన వ్యక్తం చేశారు. సహజ సిద్ధమైన పద్ధతుల్లో భూమిని సారవంతం చేయకుండా రసాయనిక పదార్థాలతో పుడమికి చేటు చేసే హక్కు ఎవరికీ లేదన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారానే ఆరోగ్యకరమైన ఉత్పత్తులతోపాటు పర్యావరణాన్ని కాపాడుకోగలమని అభిప్రాయపడ్డారు. దేశీయ విత్తన ఉత్పత్తులతో కూడిన ఆహారం ద్వారా శరీరానికి అవసరమైన అన్ని పోషకాలు లభ్యమవుతాయన్నారు. ప్రకృతి వ్యవసాయ సాగులో దేశీయ విత్తనాలనే వినియోగించాలని, దీనిద్వారా నీటి పొదుపు సాధ్యపడుతుందనీ తెలిపారు. ఈ విషయాల్లో ఎవరికి ఎటువంటి అనుమానాలున్నా తమ సంస్థపరంగా నివృత్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

నేడు గుంటూరులో ప్రభుత్వ ఇఫ్తార్ విందు

ఈనాడు, గుంటూరు: రంజాన్‌ను పురస్కరించుకుని ముస్లిం సోదరులకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా సోమవారం గుంటూరులో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో సాయంత్రం 5 గంటలకు ఇఫ్తార్ విందు ప్రారంభమవుతుంది. రాష్ట్రం నలుమూలల నుంచి ముస్లిం మత పెద్దలు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించిన నేపథ్యంలో 500 మంది వీఐపీలు, 4 వేల మందికి సరిపడా ఏర్పాట్లు చేస్తున్నారు. పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి తొలిసారిగా గుంటూరుకు రానుండటంతో జిల్లా యంత్రాంగం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేపట్టింది. కార్యక్రమం ప్రారంభానికి ముందు తొలుత ముస్లిం మత పెద్దలతో కలిసి ముఖ్యమంత్రి జగన్ ప్రార్థనలు చేస్తారని అధికార వర్గాలు తెలిపాయి. ఆ తర్వాత అక్కడి నుంచి బయలుదేరి తాడేపల్లిలోని నివాసానికి ముఖ్యమంత్రి తిరిగి వెళ్తారు. సంబంధిత ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం ఉదయం వైకాపా శాసనమండలి నాయకుడు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ముస్తాఫాతో కలిసి పరిశీలించారు.

విజయవాడలో తెదేపా ఇఫ్తార్ విందు నేడు

ఈనాడు, అమరావతి: తెదేపా సోమవారం ఇఫ్తార్ విందు నిర్వహించనుంది. విజయవాడలోని ఏ1 కన్వెన్షన్ సెంటర్‌లో సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. తెదేపా అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆదివారం మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెదేపా ఆవిర్భావం నుంచి మత సామరస్యం కోసం ముస్లింలకు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నగరవ్యాప్తంగా ఉన్న ముస్లిం సోదరులు పాల్గొనాలని కోరారు.

మన అంగన్‌వాడీ పిలుస్తోంది

విద్యార్థుల ప్రవేశాలకు ప్రత్యేక కార్యక్రమాలు

ఈనాడు, అమరావతి: పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులను చేర్పించేందుకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ మన అంగన్‌వాడీ కార్యక్రమాన్ని చేపట్టింది. పూర్వ ప్రాథమిక విద్య అభ్యసన కోసం 3 నుంచి 5 ఏళ్లలోపు బాల, బాలికలను గుర్తించేందుకు సర్వే చేయాలని ఆ శాఖ రాష్ట్ర ప్రత్యేక కమిషనర్ అరుణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 15 వరకు ఈ కార్యక్రమం జరగనుంది. రాష్ట్రంలో 55వేల అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. పూర్వ ప్రాథమిక విద్య నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ, తరగతుల్లో ప్రవేశాలు కల్పించి విద్యాబోధన అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా చెప్పిస్తున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, కిశోర బాలికలు, ఎస్‌హెచ్‌జీ మహిళలు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, యువజన సంఘాలు, ఎన్జీవోలు, బాల, బాలికల తల్లిదండ్రులు ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ర్యాలీలు నిర్వహించి ప్రవేశాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో 3- 5 ఏళ్ల బాలలను అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యకు ప్రవేశాలు కల్పిస్తారు. ఆరేళ్ల పిల్లలను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పిస్తారు. 15న గ్రామ పంచాయతీ స్థాయిలో బాలలకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించాలని అరుణ్‌కుమార్ వివరించారు.

అఖిలభారత దళిత హక్కుల ఫోరం కార్యవర్గం ఎన్నిక

గాంధీనగర్(విజయవాడ), న్యూస్‌టుడే: అఖిలభారత దళిత హక్కుల ఫోరం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం విజయవాడలోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా రేవులగడ్డ మణిసింగ్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బేతాళ సుదర్శనం, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ జి.మోహన్ అంబేద్కర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా డాక్టర్ గిరిబాబు, సభ్యులుగా డాక్టర్ షీతల్, డాక్టర్ బాలకృష్ణ ఎన్నికయ్యారు. అనంతరం సంఘం జాతీయ అధ్యక్షుడు కందుల ఆనందరావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను కొత్త ప్రభుత్వం పునఃసమీక్షించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

గ్రామ సచివాలయాల బలోపేతానికి పూర్తి సహకారం

పంచాయతీరాజ్ సర్వీసెస్ అసోసియేషన్ తీర్మానం

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన విధంగా గ్రామ సచివాలయాల బలోపేతానికి పూర్తి సహకారాన్ని అందించి ప్రజలకు మెరుగైన సేవలు లభించేలా కృషి చేయాలని పంచాయతీరాజ్ సర్వీసెస్ అసోసియేషన్ తీర్మానించింది. విజయవాడలో ఆదివారం ప్రధాన కార్యదర్శి టీఎన్‌బీ బుచ్చిరాజు అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో అనేక అంశాలపై ప్రతినిధులు చర్చించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో పంచాయతీరాజ్ వ్యవస్థ అభివృద్ధికి అనేక చర్యలు తీసుకున్నారని, అదే విధంగా జగన్ కూడా పంచాయతీలకు తగినన్ని నిధులు కేటాయించాలని కోరారు. పంచాయతీరాజ్‌లో పని చేస్తున్న తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, 27శాతం ఐఆర్ గడువులోగా విడుదల చేయాలని, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జిల్లా జలయాజమాన్య సంస్థలను పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోకి తీసుకొచ్చేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని సమావేశం కోరింది. పంచాయతీరాజ్‌లో నిధుల మళ్లింపుపై సమీక్ష నిర్వహించాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కేపీ సారధి, సహాధ్యక్షుడు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న థర్డ్ ఏసీ ప్రయాణికులు

ఈనాడు, హైదరాబాద్: రైళ్లలో ఏసీ ప్రయాణం చేయాలనుకునేవారి సంఖ్య ఏటికేడాది పెరుగుతోందని, ఈ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఏసీ బోగీలను పెంచేందుకు ప్రయత్నం చేస్తున్నామని దక్షిణ మధ్య రైల్వే ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. గడిచిన రెండేళ్లలో 30 సాధారణ రైళ్లకు 46 ఏసీ బోగీలను జత చేశామని పేర్కొంది. అందులో అత్యధికంగా త్రీటైర్ 29, 15 ఏసీ టైర్‌కార్, 2 టూటైర్ ఏసీ బోగీలు ఉన్నాయి. త్రీ టైర్ ప్రయాణికులు సగటున ప్రతి ఏటా 15 శాతం పెరుగుతున్నారు. ఏసీ టైర్‌కార్‌లో ఈ వృద్ధి 20 శాతంగా ఉందని ద.మ.రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ వెల్లడించారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రైళ్ల నడుపుతున్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. 2017-18లో 1647 ప్రత్యేక రైళ్ల నడిపితే.. 2018-19 నాటికి ఈ సంఖ్య 2341కి పెరిగిందని పేర్కొన్నాయి.

ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి

రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశంలో సీపీఎం

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలో నాలుగు లక్షల మంది గ్రామ వాలంటీర్ల నియామకం ద్వారా సంక్షేమ పథకాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్న సీఎం జగన్ లక్ష్యం మంచిదేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గం అభిప్రాయపడింది. గ్రామ సచివాలయాల్లో సిబ్బందితో పాటు పంచాయతీలకు నిధులు, అధికారాలను బదిలీ చేయాలని సూచించింది. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసం, రాజధాని రైతులు, కూలీల సమస్యలు, ప్రత్యేకహోదా సాధన, ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధి వంటి అంశాలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొంది. విజయవాడలో మే 31, జూన్ 1వ తేదీల్లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సమావేశం ఆ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ అధ్యక్షతన జరిగింది. ఎన్నికల ఫలితాలపై సమీక్షించిన పార్టీ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. "రద్దు చేసిన నీటిపారుదల ప్రాజెక్టులను ప్రభుత్వం పునఃప్రారంభించాలి. ఖరీఫ్ వ్యవసాయ ప్రణాళిక, వార్షిక రుణ ప్రణాళిక విడుదల చేసి కౌలు రైతులు, కార్మికులకు కనీస వేతనాలను సవరించాలి. ఎన్డీయే ప్రభుత్వ విధానాలు రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి, అభివృద్ధికి ప్రతిబంధకంగా మారాయి. ఈ నేపథ్యంలో ఏపీ ప్రయోజనాల పరిరక్షణ, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం, లౌకిక విలువల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా నిలబడాలి" అని పేర్కొంది. ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్యబద్ధంగా చేపట్టిన ఉద్యమాలపై గత ప్రభుత్వం నిరంకుశ వైఖరి అనుసరించి అక్రమ కేసులు బనాయించిందని, వీటిని ఎత్తివేయాలని డిమాండ్ చేసింది.

గ్రామాల్లో సమరోత్సాహం

- మొదలైన ఆశావహుల కోలాహలం
- 'స్థానిక' పోరులోనూ సత్తా చాటే యోచనలో వైకాపా
- వ్యక్తిగత ప్రతిష్ఠతో విజయ సాధనకు తెదేపా శ్రేణుల ఆలోచన

ఈనాడు - అమరావతి

గ్రామాల్లో అప్పుడే పంచాయతీ ఎన్నికల కోలాహలం మొదలైంది. సర్పంచి, ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులుగా పోటీ చేయాలనుకునే ఆశావహులు ఇప్పటి నుంచే ఏర్పాట్లలో నిమగ్నమవుతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన వైకాపా నేతలు 'స్థానిక' సమరంలోనూ సత్తా చాటాలని భావిస్తున్నారు. ఈ ఎన్నికల్లో గెలిచి విజయం సొంతం చేసుకోవాలని తెదేపా నాయకులు యోచిస్తున్నారు. రాష్ట్రంలోని 12,918 పంచాయతీల్లో పాలకవర్గ పదవీ కాలం 2018 ఆగస్టు ఒకటితో ముగిసింది. గిరిజన ప్రాంతాల్లో కొత్తగా మరో 142 పంచాయతీల ఏర్పాటుతో వీటి సంఖ్య ప్రస్తుతం 13,060కి చేరింది. వీటిలో 13,053 పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు వీలుగా ఇప్పటికే ఓటర్ల తుది జాబితాలు విడుదల చేసి వీటిలో నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీలను ప్రస్తుతం గుర్తిస్తున్నారు.

వైకాపాలో పోటాపోటీ...

సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు ఊపుతో వైకాపాలోని గ్రామస్థాయి నాయకుల్లో అత్యధికులు సర్పంచి, ఎంపీటీసీ అభ్యర్థులుగా బరిలో దిగేందుకు పోటీ పడుతున్నారు. ఒక్కో పంచాయతీ నుంచి ముగ్గురు నుంచి నలుగురు ఈ మేరకు ప్రయత్నాల్లో ఉన్నారు. రిజర్వేషన్లు ఖరారయ్యాక ఆశావహుల మధ్య పోటీ మరింత తీవ్రమయ్యే అవకాశాలున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషిచేసిన వారిని అభ్యర్థులుగా బరిలో దింపే బాధ్యతను అధికార వైకాపా ఎమ్మెల్యేలు తీసుకోనున్నారు. దీంతో ఔత్సాహికులంతా ఎమ్మెల్యేల ఆశీస్సుల కోసం ప్రయత్నిస్తున్నారు. ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో సర్పంచిగా పోటీ చేసేందుకు వైకాపా నుంచి అత్యధికులు పోటీపడుతున్నారు.

తెదేపాలో సిద్ధమవుతున్న మాజీలు...

సర్పంచిగా, ఎంపీటీసీ, జడ్పీటీసీగా ఇప్పటికే సేవలు అందించిన తెదేపా గ్రామస్థాయి నాయకులు మరోసారి పోటీకి సిద్ధమవుతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ ఓటమిపాలైనా పార్టీలకు అతీతంగా నిర్వహించేది పంచాయతీ పోరు. అందులో వ్యక్తిగత ప్రతిష్ఠతో మరోసారి విజయం అందుకునే ప్రయత్నంలో వీరంతా ఉన్నారు. ఈ మేరకు ఇప్పటికే బరిలో దిగేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. స్థానిక ఎన్నికల్లో విజయం కోసం దృష్టి సారించాలని ఇప్పటికే పార్టీ అధినేత చంద్రబాబు సూచించడంతో నియోజకవర్గ స్థాయి నేతలు సమాయత్తమవుతున్నారు. గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో సర్పంచిగా బరిలో నిలిచేందుకు ఎక్కువ మంది పోటీ పడుతున్నారు.

18న ఓటర్ల జాబితాలు

పంచాయతీల వారీ ఓటర్ల జాబితాల్లోంచి ఎస్సీ, ఎస్టీ, బీసీల గుర్తింపు ప్రక్రియను పూర్తిచేసి ఈనెల 18న తుది జాబితాలు ఖరారు చేయనున్నారు. కులాల గుర్తింపుతో పాటు వీటిపై ప్రజల నుంచి అభ్యంతరాలు కూడా సిబ్బంది ప్రస్తుతం స్వీకరిస్తున్నారు. వీటిని సవరించి పంచాయతీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఎంత శాతం ఉన్నారో వివరిస్తూ జాబితాలు రూపొందిస్తారు. వీటిని జిల్లా పంచాయతీ అధికారులు ఆమోదించి ప్రభుత్వ పరిశీలనకు పంపనున్నారు.

విద్య, పారిశ్రామిక అనుసంధానత తప్పనిసరి

- ఆ రూపేణా దేశ నిర్మాణంలో విప్లవాత్మక మార్పులు సాధ్యమే
- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఈనాడు - విశాఖపట్నం

సదస్సులో మాట్లాడుతున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, చిత్రంలో ఏపీపీసీబీ ఛైర్మన్ బీఎన్ఎస్ ప్రసాద్, సీఐఐ ఛైర్మన్ కేవీవీ రాజు, ఐఐఎం డైరెక్టర్ చంద్రశేఖర్, పెట్రోలియం వర్సిటీ డైరెక్టర్ వీఎస్ఆర్‌కే ప్రసాద్, ఏయూ ఉపకులపతి ఆచార్య నాగేశ్వరరావు, ఏపీ సీసీఐఎఫ్ ఛైర్మన్ సాంబశివరావు, సదస్సు కన్వీనర్ పులిపాటి కింగ్

'విద్యా, పారిశ్రామిక రంగాల అనుసంధానత, పరస్పర అవగాహనతో దేశ నిర్మాణంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చు. విద్యాలయాల్లో పరిశ్రమలకు అనుగుణమైన మార్పులతో నిరుద్యోగ సమస్యను తగ్గించుకోవచ్చు. సమాజ సమస్యల పరిష్కారం రూపేణా యువత నైపుణ్యాలు పెంచుకోవాలి. విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు లక్ష్యాలను అప్పగించి మార్పునకు శ్రీకారం చుట్టాలి. పరిశ్రమలతో మమేకమై పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలి' అంటూ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు విద్యా, పారిశ్రామికవేత్తలకు ఉద్బోధించారు. విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆదివారం నిర్వహించిన 'నాణ్యమైన విద్య కోసం పారిశ్రామిక, విద్యావేత్తల పరస్పర అవగాహన' కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి మాట్లాడారు. ప్రస్తుతం దేశంలోని నిరుద్యోగ యువతలో ఉద్యోగ నైపుణ్యం కొరవడుతున్నందున పరిశ్రమలు ఈ సమస్యకు పరిష్కారం చూపాలని ఆయన కోరారు. ప్రపంచీకరణ నేపథ్యంలో సాంకేతిక పరిజ్ఞానం విస్తృతిలో సరికొత్త మార్గాలను ఎంచుకోవాలని, తదనుగుణంగా అత్యున్నత పరిశోధనలు జరిగేలా పరిశ్రమలు సహకరించాలని ఉపరాష్ట్రపతి అన్నారు. విద్యార్థులు పరిశ్రమలను సందర్శించడం తప్పనిసరి చేయాలని ఆయన సూచించారు. వివిధ స్థాయిల్లోని పరిశ్రమలు, కార్పొరేట్ సంస్థలు సమీప విద్యాలయాలతో కలసి పనిచేయాలన్నారు. కొన్ని ప్రముఖ సంస్థలు జాతీయ విద్యాసంస్థలతో కలిసి పనిచేస్తూ ఆధునిక పరిశోధనలకు ఊతమిస్తున్నట్లు చెప్పారు. కేంద్రం కొత్త విద్యావిధానాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచడం మంచిదని, మేధావులు, విద్యార్థులు, రచయితలు, విమర్శకులు అందులోని అంశాలను ఆకళింపు చేసుకొని తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య నాగేశ్వరరావు, సదస్సు కన్వీనర్ పులిపాటి కింగ్, పెట్రోలియం వర్సిటీ డైరెక్టర్ వి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగన్, కేసీఆర్ ప్రయత్నాలు హర్షణీయం

ట్విటర్‌లో ఉపరాష్ట్రపతి

తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సోదర భావంతో చర్చించుకోవడం హర్షించదగ్గ పరిణామమని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. గత రెండురోజులుగా విశాఖపట్నంలో ఉన్న ఆయన ట్విటర్ ద్వారా తన అభిప్రాయం వెల్లడించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు కలిసి మాట్లాడుకోవడం స్వాగతించాల్సిన విషయమని చెప్పారు. అయిదేళ్ల నుంచి ఎటూ తేలని వివాదాల విషయంలో పరస్పర చర్చలద్వారా సత్వర పరిష్కారం కోసం ప్రయత్నించడం అభినందించాల్సిన అంశమన్నారు. కేంద్రం జోక్యం అవసరం లేకుండా పరిష్కరించుకుంటే ఇంకా మంచిదనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇరు రాష్ట్రాల సమస్యల పరిష్కారం కోసం కేసీఆర్, జగన్ ప్రయత్నాలు సఫలంకావాలని ఆకాంక్షించారు. అయిదేళ్లలో ఇదే కోరానని, కారణం ఏదైనా అది కార్యరూపం దాల్చలేదన్నారు. పాలన సౌలభ్యం, సత్వర అభివృద్ధికోసం రాష్ట్రాలు విడిపోయినా తెలుగు ప్రజలంతా కలిసి ఉండాలని ఆశిస్తున్నట్లు తెలిపారు.

మండలిలో పెరగనున్న వైకాపా బలం

- ఖాళీ అవుతున్న ఐదు ఎమ్మెల్సీ స్థానాలు
- వాటిలో మెజారిటీ స్థానాలు వైకాపావే

ఈనాడు, అమరావతి: రాష్ట్ర శాసనమండలిలో ఐదు స్థానాలు ఖాళీ అవుతున్నాయి. వీటిలో మెజారిటీ స్థానాలు వైకాపా ఖాతాలోకి వెళ్లనున్నాయి. ఇప్పటికే మాగుంట శ్రీనివాసులురెడ్డి రాజీనామాతో ఒక స్థానం ఖాళీగా ఉండగా, త్వరలో మరో నాలుగు స్థానాలు ఖాళీ కానున్నాయి. ఇటీవల లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన ఎమ్మెల్సీల్లో ఐదుగురు గెలుపొందారు. వారిలో మాగుంట ముందే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి ఒంగోలు ఎంపీగా పోటీ చేసి గెలిచారు. తెదేపానుంచి పయ్యావుల కేశవ్, కరణం బలరామకృష్ణమూర్తి శాసనసభకు ఎన్నికవగా.. ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని), కోలగట్ల వీరభద్రస్వామి వైకాపా తరపున పోటీ చేసి గెలిచారు. ఈ నలుగురూ ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేసి ఎమ్మెల్యేలుగా కొనసాగనున్నారు. వారు సోమవారం రాజీనామా పత్రాలు అందజేసే అవకాశముంది.

శాసనమండలిలో ఖాళీ అవుతున్న ఐదు స్థానాల్లో మూడు ఎమ్మెల్యేల కోటాకు, రెండు స్థానిక సంస్థల కోటాకు చెందినవి. కరణం బలరామకృష్ణమూర్తి, ఆళ్ల నాని, కోలగట్ల వీరభద్రస్వామి ఎమ్మెల్యేల కోటాలో శాసనమండలికి ఎన్నికయ్యారు. వారిలో మొదటి ఇద్దరి పదవీ కాలం 2022 మార్చి 29తోను, కోలగట్ల పదవీ కాలం 2021 మార్చి 29తోను ముగియాల్సి ఉంది. వీరు ముగ్గురూ రాజీనామా చేశాక వారి స్థానాల్లో శాసనమండలికి ఎన్నికయ్యేవారు మిగతా గడువు ఎంత మిగిలి ఉందో అంతకాలమే పదవుల్లో ఉంటారు. శాసనసభలో ప్రస్తుతం వైకాపాకు 151 మంది స

Downloaded from Playstore: Todays NewsPaper Telugu

ఈనాడు
చదువుల ప్రక్షాళన

'విద్యా ప్రణాళికలకు ఏవో కొద్దిపాటి మార్పులు సూచించడం కాదు; దేశీయంగా పరిస్థితులు పరిణామాలను దృష్టిలో ఉంచుకొని విద్యా వ్యవస్థను పునాదుల స్థాయినుంచి ప్రక్షాళన చెయ్యాలి'- ఏనాడో 1948నాటి అఖిల భారత విద్యా సదస్సులో తొలి ప్రధాని పండిత్ నెహ్రూ మార్గ నిర్దేశమది. ఏడు దశాబ్దాలుగా ఆ మంచి మాటకు మన్నన కొరవడి 'ప్రాథమికం'నుంచి 'స్నాతకోత్తరం'దాకా భారత విద్యావ్యవస్థ పెను సంక్షోభాల ఊబిలో దిగబడిపోయింది. అంతర్జాతీయ ఉత్కృష్ట విద్యా ప్రమాణాల్ని సాధించడానికి ఇండియా మరో ఆరు తరాల పాటు చెమటోడ్చాల్సిందేనన్న అసోచామ్ (భారత వాణిజ్య, పారిశ్రామిక సంఘాల సమాఖ్య) నివేదిక నిస్పృహ రగిలిస్తున్నా- వడివడిగా సాగాల్సిన సమూల క్షాళనకు మార్గదర్శిగా జాతీయ విద్యావిధాన ముసాయిదాను కస్తూరి రంగన్ సారథ్యంలోని కమిటీ కేంద్రానికి అందించింది. మోదీ సర్కారు మలి దఫా పాలన మొదటి రోజే మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి చేతికందిన నివేదిక- ఉన్నత ప్రమాణాల విద్యను అందరికీ అందించడం ద్వారా గతిశీల విజ్ఞాన ఆధారిత సమాజ నిర్మాణాన్ని లక్ష్యిస్తోంది. కేంద్ర క్యాబినెట్ మాజీ కార్యదర్శి టీఎస్ఆర్ సుబ్రమణియన్ 2016 మే నెలలో సమర్పించిన నివేదికను, కేంద్రం అందించిన మరికొంత సమాచారాన్ని వడబోసి కస్తూరి రంగన్ కమిటీ ప్రతిపాదించిన 19 మార్పులు- దేశీయ విద్యా వ్యవస్థ రూపు రేఖా విలాసాల్ని గణనీయంగా ప్రభావితం చేసేవే. 2030నాటికి విద్యారంగంపై వ్యయం 20శాతానికి చేరేలా క్రమంగా పెట్టుబడుల్ని పెంచుకొంటూ పోవాలన్న కమిటీ కీలక సూచన- విద్యారంగ సముద్ధరణ పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చిత్తశుద్ధికి తార్కాణంగా నిలిచేదే! నేలబారు ప్రమాణాలతో నెట్టుకొస్తున్న బోధన కళాశాలలకు టోకున చాప చుట్టి, ఉపాధ్యాయ విద్యా కార్యక్రమాలన్నింటినీ విశ్వవిద్యాలయాలకు బదలాయించాలన్న కస్తూరి రంగన్ కమిటీ ప్రతిపాదన- అవ్యవస్థ క్షాళనలో కీలకమైన తొలిమెట్టు. కాలం చెల్లిన చదువులు, స్ఫూర్తి రహిత గురువులు, నేతిబీర చందంగా ప్రమాణాలు, పరీక్షల ఒత్తిళ్లు, కొరగాని పట్టాలు- వీటినుంచి భావితరానికి విముక్తి కలిగించే క్రమంలో మరే మాత్రం ముందు వెనకలాడరాదు!

దేశ స్వాతంత్ర్యానికి పదేళ్ల ముందే వార్ధా వేదికగా జరిగిన జాతీయ విద్యా సదస్సులో కొత్త అభ్యసన (నయీ తాలిమ్) విధానాన్ని ప్రతిపాదించారు మహాత్మాగాంధీ. వృత్తిపరమైన ఒడుపులను నేర్పే చదువుల ఆవశ్యకతను నయీతాలిమ్ ప్రబోధించింది. దానికి మన్నన దక్కలేదు సరికదా- దాదాపు రెండున్నర కోట్లమంది బాలలు అజ్ఞానంలో కొట్టుమిట్టాడే దురవస్థకు దోహదపడుతున్నారంటూ బ్రిటిష్ పాలకులపై కాలుదువ్విన దాదాభాయ్ నౌరోజీ ఆత్మ మరింత క్షోభిల్లేలా విద్యా వ్యవస్థను దేశీయ పాలకులు నీరుగార్చారు! ప్రాథమిక స్థాయిలో చదువులు ఎంతగా చట్టుబండలైందీ ఏటా 'అసర్' నివేదికలు కళ్లకు కడుతుంటే, ఎంత ఉన్నత విద్యకు అంత నిరుద్యోగిత చందంగా వ్యవస్థ ఆసాంతం పుచ్చిపోయింది. 2030నాటికి ప్రపంచవ్యాప్తంగా 80 కోట్లమందికిపైగా యువజనం ఉద్యోగార్హ నైపుణ్యాలు లేక నిస్పృహలో కూరుకుపోతారని, అందులో మెజారిటీ వాటా భారతీయులదేనని అధ్యయనాలు భవిష్యద్దర్శనం చేస్తున్నాయి. అక్షరాలా కోమాలో ఉన్న దేశీయ విద్యా రంగాన్ని తిరిగి గాడిన పెట్టాలంటే గరళ వైద్యం తప్పనిసరి. 1986 నుంచి అమలులో ఉండి 1992లో పునస్సమీక్షకు నోచుకొన్న ప్రస్తుత విద్యా విధానాన్ని కస్తూరి రంగన్ కమిటీ ఏకమొత్తంగా తోసిపుచ్చుతోంది. తెలుసుకోవాలన్న జిజ్ఞాస పుట్టినప్పటినుంచే ప్రతి బిడ్డకూ ఉంటుందంటూ- మూడో ఏటనుంచి అయిదేళ్ల పాటు పునాది స్థాయి చదువును పరిపుష్టం చెయ్యాల్సిన అవసరాన్ని కమిటీ ప్రబోధించింది. ప్రస్తుతం ఉన్న 10+2+3 విద్యా వ్యవస్థను 5+3+3+4 సంవత్సరాలుగా రూపాంతరీకరించి, విద్యాహక్కు చట్టం పరిధినీ విస్తరించి, దేశ భావి అవసరాలకు దీటైన మెరికల్ని సృష్టించే విధాన ముసాయిదా ఇప్పటికి సిద్ధమైంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటిలోగా ఏమేమి చెయ్యాలో విపుల కార్యాచరణ ప్రణాళిక సైతం సిద్ధంగా ఉన్న నేపథ్యంలో దిద్దుబాట్లు సత్వరం పట్టాలకెక్కాలి!

భావి భారత భాగ్య విధాతలుగా రేపటి పౌరులు రాణించేలా వారిలోని సహజ సిద్ధ ప్రతిభా పాటవాలకు సానపట్టే మహా క్రతువు ప్రాథమిక పాఠశాలల్లోనే నిష్ఠగా జరగాలి. ఈ విషయంలో అమెరికాలాంటి దిగ్గజ దేశాల్ని వెనక్కి నెట్టి, ఏ మాత్రం ఒత్తిడి లేని చదువులతో నిజ జీవితానికి అన్వయించుకోగల పరిజ్ఞానాన్ని చిన్నారుల్లో పెంపొందించేలా ఫిన్లాండ్ ఇస్తున్న ఉపాధ్యాయ శిక్షణ సంస్తుతి పాత్రమైనది. 'దేశ భవిష్యత్తు తయారయ్యేది తరగతి గదుల్లోనే' అన్న స్పృహ కలిగిన దేశాలన్నీ కాలంతో పోటీపడి మరీ విద్యారంగ సంస్కరణల్లో కొత్త పుంతలు తొక్కుతున్నాయి. అందుకు పూర్తి భిన్నంగా స్వరైన శిక్షణ కొరవడిన 11 లక్షలమంది గురువుల బోధనతో దేశీయంగా ప్రమాణాలు గుల్లబారుతున్నాయి. మూడేళ్ల ముందస్తు బడినుంచి పన్నెండో తరగతి దాకా ఉచిత నిర్బంధ విద్య అందించాల్సిందేనంటున్న కమిటీ- నిపుణ టీచర్ల కొరత అధిగమించడానికి సామాజిక బాధ్యతగా చదువుకున్నవారు కదిలిరావాలంటోంది! పరిమిత వనరుల్ని పాఠశాలలు పరస్పర ప్రయోజనదాయకంగా పంచుకొని వినియోగించుకొనే కొత్త సంస్కృతి పాదుకొనాలని కమిటీ అభిలషిస్తోంది. కేవలం దాని ద్వారానే కొరతల కోమానుంచి బడులు బయటపడతాయా అన్నది చూడాలి! 2030నాటికి 'మిషన్ నలందా' ద్వారా పరిశోధనల్లో తలమునకలయ్యే విశ్వవిద్యాలయాలు వంద, ఉన్నత ప్రమాణాలతో అలరారేవి అయిదు వందలు ఉండాలన్న లక్ష్యం వీనుల విందుగానే ఉన్నా- అది సాధ్యమా అన్న సందేహం పీడిస్తోంది. వ్యర్థ వివాదాలతో పొద్దుపుచ్చడం అక్షరాలా జాతి ద్రోహమేనన్న తెలివిడితో, విద్యారంగ సమూల క్షాళనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం సంసిద్ధం కావాలి!

సిక్కిం రాజధాని గ్యాంగ్‌టక్‌లో సేంద్రియ కూరగాయలను పరిశీలిస్తున్న ప్రధాని మోదీ (పాత చిత్రం)

సేంద్రియ సేద్యంతో సిరులు

పెరుగుతున్న జనాభాకు తగ్గ ఆహారోత్పత్తిని సాధించాలంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో రెట్టింపు ఉత్పత్తి జరగాలి. 2050 నాటికి ప్రపంచ జనాభా వెయ్యి కోట్లకు చేరుతుందని అంచనా. అప్పటి జనాభాకు కావలసిన ఆహారాన్ని ఉత్పత్తి చేయడానికి మన నేలలు సంసిద్ధంగా ఉన్నాయా అన్నది ప్రశ్నార్థకమే. క్రమేపీ క్షీణిస్తున్న భూసారంతో నేలలు ముమ్ముందు పంటలకు పనికిరాకుండా పోతాయన్న భయాలే ఇందుకు కారణం. అందుకే రానున్న సవాళ్లను అధిగమించాలంటే మానవారోగ్యాన్ని, నేలల ఆరోగ్యాన్ని ఇప్పటినుంచే కాపాడుకోవాల్సిన అవసరముంది. రసాయనాలకు స్వస్తి చెప్పి సేంద్రియ వ్యవసాయ విధానాలను అనుసరించడమే దీనికి పరిష్కారం. ప్రపంచంలోని మొత్తం సేంద్రియ ఉత్పత్తిదారుల్లో 30 శాతం భారత్‌లోనే ఉన్నారు. మొత్తం ప్రపంచ సేంద్రియ సాగు విస్తీర్ణంలో అది 2.59 శాతం మాత్రమే. ప్రపంచ వ్యాప్తంగా 57.8 మిలియన్ హెక్టార్లలో ధ్రువీకరించిన సేంద్రియ వ్యవసాయం సాగుతుండగా భారత్‌లో అది 15 లక్షల హెక్టార్లుగా ఉంది. దేశంలో నూరు శాతం సేంద్రియ సేద్యం చేస్తున్న తొలి రాష్ట్రంగా సిక్కిం నిలిచిందని సెంటర్‌ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ అధ్యయనం పేర్కొంది. ఈ రాష్ట్రంలో పండించిన సేంద్రియ కూరగాయలను ఇటీవల ప్రధాని మోదీ పరిశీలించారు.

రసాయనాల వాడకంతో నేల నిర్వీర్యం

హరిత విప్లవానికి ముందు రైతులు సేంద్రియ వ్యవసాయాన్నే చేశారు. అధిక దిగుబడులు వస్తాయని, ఆకర్షణీయమైన రంగు వస్తుందని, త్వరితంగా పక్వానికి వస్తుందని, చీడపీడల్ని నివారించొచ్చని ఇష్టానుసారంగా రసాయన ఎరువులు, పురుగుమందుల్ని వాడేస్తున్నారు. అదే సమయంలో సేంద్రియ సేద్యాన్ని పూర్తిగా విస్మరించారు. విచ్చలవిడి రసాయనాలు, క్రిమిసంహారకాల వాడకంతో నేల, నీరు, గాలి కలుషితమవుతున్నాయి. నేలలోని సేంద్రియ పదార్థం హరించుకుపోతోంది. మన నేలల్లో సేంద్రియ కర్బనం శాతం 0.5 శాతానికి పడిపోయిందని 'ఇక్రిశాట్' పరిశోధనల్లో తేలింది. నేలలో 1.5 నుంచి రెండు శాతం వరకు సేంద్రియ కర్బనం ఉంటేనే భూమిలో సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి. ఫలితంగా నేల నుంచి సిద్ధంగా పోషకాలు మొక్కలకు అందాల్సిన పరిస్థితి లేక రైతులు రసాయనాలు, క్రిమిసంహారకాలను వాడాల్సి వస్తోంది. వీటి వాడకంతో నేలలోని సూక్ష్మజీవుల సంతతి వానపాములు వంటి మిత్ర జీవులు తుడిచిపెట్టుకుపోతున్నాయి. ఎకరం భూమిలో ఉండే కర్బనాన్ని ఒక్క శాతం పెంచగలిగితే అది నేలలో 20 వేల గ్యాలన్ల నీటిని ఇంకించే శక్తిని సంతరించుకుంటుందని అమెరికా వ్యవసాయశాఖ అధ్యయనం పేర్కొంది. దీన్ని బట్టి నేలలో కర్బనాన్ని ఇంకింపజేసే యత్నాలకు ఊతమివ్వాలి.

ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రసాయన అవశేషాలుండే ఆహారోత్పత్తుల్ని పలు దేశాలు అనుమతించడం లేదు. రసాయన అవశేషాల కారణంగా ఐరోపా సమాఖ్య, అమెరికా తదితర దేశాలకు వెళ్లే మన ఉత్పత్తులు కొన్ని తిరస్కరణకు గురవుతున్నాయి. భారత్ నుంచి మిర్చి, ద్రాక్ష వంటి పలు పంటలను ఎగుమతి చేసే రైతులకు ఈ ఇబ్బందులు బాగా తెలుసు. ఎన్నో సందర్భాల్లో రసాయన అవశేషాల కారణంగా వారి ఎగుమతులు తిరస్కరణకు గురయ్యాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ పరిధిలో విధిగా అనుమతించాల్సిన ఉత్పత్తులనూ పలు సంపన్న దేశాలు దిగుమతి చేసుకోకుండా ఈ అవశేషాలనే కారణంగా చూపుతూ తిరస్కరిస్తున్నాయి. కోడెక్స్ నిబంధనల ప్రకారం పరిమితికి మించిన అవశేషాలు ఉన్నాయంటూ పేద దేశాలు పండించిన ఆహార ఉత్పత్తుల్ని అవి తిప్పికొడుతున్నాయి. ముఖ్యంగా అమెరికా, ఐరోపా దేశాలు సేంద్రియ ఆహారోత్పత్తుల విషయంలో పాటిస్తున్న ప్రమాణాలు అధికంగా ఉండటం వల్ల ప్రపంచ విపణిలో అభివృద్ధి చెందుతున్న దేశాల ఎగుమతులకు స్థానం తక్కువగా ఉంటోంది. రసాయనాలు వాడటం వల్ల భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల రైతులు, ప్రజలకు తీవ్ర హాని జరుగుతోందన్న సంగతి అర్థమవుతోంది. అటు ఉత్పత్తుల్ని ఎగుమతి చేయలేక ఇటు ప్రజారోగ్యం దెబ్బతిని రెండు విధాల నష్టపోవాల్సి వస్తోంది.

పెరిగే జనాభాకు తగ్గట్టు అధికోత్పత్తిని సాధించాల్సిన తరుణంలో అందరూ సేంద్రియ వ్యవసాయాన్ని అనుసరిస్తే దిగుబడులు పెరగాల్సింది పోయి తగ్గుతాయనే భయాలను కొందరు వ్యక్తం చేస్తున్నారు. సాధారణ సేద్యం నుంచి సేంద్రియ సేద్యానికి మారినప్పుడు ఉత్పాదకత కొంత తగ్గవచ్చని భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) పేర్కొంది. ఈ తగ్గుదల 30 శాతంగా ఉండొచ్చని చాలా మంది రైతులు భయపడుతున్నారు. ఈ సమయంలో ప్రభుత్వం రైతులకు అండగా ఉండి సేంద్రియ ఉత్పత్తులకు మంచి ధరలు అందించగలిగితే ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఉత్పత్తి తగ్గినా ధరలు బాగుంటే రైతులు సేంద్రియ సేద్యాన్ని అనుసరిస్తారు. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ విధానాలను అనుసరించడం వల్ల నేలలో జీవ పదార్థం పెరుగుతుంది. మొక్కలు పెరగడానికి అవసరమైన పోషకాలన్నీ నేలలోనే ఉన్నాయి కాబట్టి నేలలో అందుబాటులో లేని పోషకాలను పైరుకు లభ్యమయ్యేలా చేయవచ్చు. అటు దిగుబడులు, ఇటు మానవారోగ్యాన్నీ పెంపొందించుకోవచ్చు. అలానే సేంద్రియ సేద్యంలో రాశి కంటే వాసి అధికం. దిగుబడి పెరుగుదల కంటే ఉత్పత్తి నాణ్యత బాగుంటుంది కాబట్టి ఆ మేరకు ఉత్పత్తులకు ప్రత్యేక ధరలను ప్రకటించాల్సిన అవసరముంది. ప్రత్యేక మార్కెట్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. సేంద్రియ సేద్యంలో ఉత్పత్తి స్వల్పంగా తగ్గినా ఇతర ప్రయోజనాలెన్నో దక్కుతాయి. ఉదాహరణకు పరిలో రసాయనాలతో పండించినప్పుడు 35 బస్తాల దిగుబడి వచ్చిందనుకుందాం. అదే సేంద్రియ పద్ధతుల్లో పండిస్తే 28 బస్తాలే వచ్చినప్పుడు ధరను అధికంగా ఇవ్వడం ద్వారా ఆ వ్యత్యాసాన్ని భర్తీ చేసి తద్వారా రైతులకు వాటిల్లే నష్టాన్ని నివారించవచ్చు. పైగా నాణ్యమైన ఆహారోత్పత్తుల కారణంగా ప్రజల ఆరోగ్యం బాగుండి, రోగాలకు కోతపడి వినియోగదారులకు ఇతరత్రా ఖర్చులు కూడా తగ్గుతాయి. చిల్లర సేంద్రియ ఉత్పత్తుల మార్కెట్లో అధిక ధరలు ఉంటున్నా వాటిని పండించే రైతులకు మాత్రం అవి దక్కడం లేదు. ఈ పోకడల్ని నియంత్రించాల్సిన అవసరముంది.

సమగ్ర కార్యాచరణ కీలకం

మార్కెటింగే పెద్ద సమస్య

సేంద్రియ వ్యవసాయం చేస్తున్న వారికి మార్కెటింగ్ పెద్ద సమస్యగా మారింది. పండించిన ఉత్పత్తులకు మంచి ధరలు లభించక వాటిని సాధారణ ఉత్పత్తుల్లా విక్రయించుకోవాల్సి రావడం దయనీయం. ఎరువులేసి పండించిన పంటలు కాదు కాబట్టి తమ ఉత్పత్తిని వినియోగదారులకు నచ్చజెప్పి అమ్ముకునే మార్కెట్ నైపుణ్యాన్ని రైతులు అలవరచుకోవాలి. నమ్మకం కుదర్చగలిగితే వినియోగదారులే రైతుల దగ్గరకు వచ్చే అవకాశముంది. సేంద్రియ సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నామంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటికి ప్రత్యేక ధరలు ప్రకటించేందుకు చొరవ చూపాల్సి ఉంది. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న కొందరు రైతులు చొరవ చూపి తమ ఉత్పత్తులకు మంచి ధర సాధించేందుకు గో ఆధారిత వ్యవసాయదారుల సహకార సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. సేంద్రియ రైతుల మార్కెటింగ్ సమస్యను తీర్చేందుకు వీరు తోటి రైతులకు సాయపడుతున్నారు. సేంద్రియ ఉత్పత్తిదారులు ఈ తరహాలో సంఘాలుగా ఏర్పడితే సత్ఫలితాలు సమకూరుతాయి. మరికొందరు రైతులు ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయిస్తూ లాభపడుతున్నారు. ఎక్కువమంది రైతులకు ఇది సాధ్యపడదు కాబట్టి సేంద్రియ ఉత్పత్తులకు మద్దతు ధరలు అధికంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. ప్రత్యేకంగా మార్కెట్లను ఏర్పాటు చేయడం, ప్రత్యేక ధరలను ప్రకటించడంతో పాటు అటు వినియోగదారులు ఇటు రైతులు లాభపడేలా ధరలపై నియంత్రణ ఉండాలి. తసేంద్రియ వ్యవసాయం దిశగా రైతుల్ని కదిలించేందుకు యుద్ధ ప్రాతిపదికన సమగ్ర కార్యాచరణను అమలు చేయాల్సి ఉంది!

– అమిర్నేని హరికృష్ణ

ప్రోత్సహిస్తున్న ఏపీ, తెలంగాణ

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా తెలుగు రాష్ట్రాలతోపాటు దేశంలో చర్యలు వేగవంతమయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో 2016 ఖరీఫ్ నుంచి దీన్ని ప్రోత్సహిస్తున్నారు. 2021 నాటికి అయిదు లక్షల మంది రైతులు దాదాపు అయిదు లక్షల హెక్టార్లలో సేంద్రియ వ్యవసాయాన్ని అమలు చేయాలన్న లక్ష్యంతో వ్యవసాయశాఖ కృషి చేస్తోంది. ఈ మేరకు ప్రకృతి వ్యవసాయ నిపుణుడు సుభాష్ పాలేకర్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

సేంద్రియ వ్యవసాయ విస్తీర్ణం, ఎగుమతులు క్రమంగా పెరుగుతున్నాయి. 2017-18లో భారత్‌నుంచి 4.58 లక్షల టన్నుల సేంద్రియ ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. వీటి విలువ 51.5 కోట్ల డాలర్లు. 2016-17లో ఇది 37 కోట్ల డాలర్లు మాత్రమే. ఇది 39 శాతం అధికం. సేంద్రియ వ్యవసాయంతో పాటు వాటి వినియోగంలోనూ గణనీయమైన పురోగతి కనిపిస్తోంది. ప్రజల ఆహార అలవాట్లలో వస్తున్న మార్పుల కారణంగా సేంద్రియ ఉత్పత్తుల వాడకం అనూహ్యంగా పుంజుకుంటోంది. ఇదే సమయంలో వినియోగదారులను దోచుకోవడమూ పెరిగింది. ప్రస్తుతం దేశంలో సేంద్రియ విప్లవం దిశగా సాగుతున్న పయనంలో ఇలాంటి కొన్ని అపసవ్య ధోరణులు చూడాల్సి వస్తోంది. రసాయన ఉత్పత్తులనూ సేంద్రియ ఉత్పత్తులని చెప్పి విక్రయిస్తున్న పరిస్థితులతో వినియోగదారులు నష్టపోతున్నారు. వాస్తవానికి సేంద్రియం పేరిట పండిస్తున్న ఉత్పత్తులకు ధ్రువీకరణ పత్రం తీసుకోవడంలో అవగాహన లేమి కారణంగా సాగుదార్లకు నష్టాలు తప్పడం లేదు.

బహుముఖ స్నేహ చాలనం!

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఇప్పుడు కావలసింది కరచాలనమేగాని ఖడ్గచాలనం కాదని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ గొప్పగా చెప్పారు. రాజకీయాల్లో ఖడ్గచాలన దశలూ ఉంటాయి. కరచాలన దశలూ ఉంటాయి. తెలంగాణ ప్రజల చిర కాల కోరికైన ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరవాత ఖడ్గచాలన దశ ముగిసిందని ఇక కావలసింది ఆత్మీయ కరచాలనాలేనని తెలుగు ప్రజలందరూ ఎప్పటినుంచో కోరుకుంటున్నారు. ప్రజల మధ్య ఎప్పుడూ ఆత్మీయ ఆలింగనాలూ కరచాలనాలూ ఉంటూనే ఉన్నాయి. రాజకీయ అవసరాలు, ప్రజా అవసరాలు అన్ని సందర్భాల్లోనూ కలిసి ఉండవు. కరచాలనం ప్రాణావసరమైనా రాజకీయ అవసరాలు ఖడ్గచాలన చేయమంటాయి. దీనికి రెండు రాష్ట్రాల రాజకీయాలు మినహాయింపు కాదు. అందుకే ఇప్పుడు ఇరు రాష్ట్రాల రాజకీయ నాయకత్వాల్లో, శ్రేణుల్లో కరచాలన, స్నేహచాలన స్ఫూర్తి పాదుకోవాలి. కేసీఆర్ వ్యాఖ్య ప్రజల ఆకాంక్షకు అద్దం పట్టింది. నిజమైన ప్రజా ఆకాంక్షను ప్రతిబింబించే ప్రతి వ్యాఖ్యా ఒక ఆశను రేకెత్తిస్తుంది. ఆ ఆశ నెరవేరడానికి కావలసింది ఇరువైపులనుంచి రాజకీయ ఆచరణే!

పరిపాలనపరంగా రెండు రాష్ట్రాలైనా తెలుగు ప్రజల మధ్య ఎన్నో రంగాల్లో ఇచ్చిపుచ్చుకోవడాలు నిరాఘాటంగా కొనసాగుతూనే ఉన్నాయి. ఇకపైనా కొనసాగుతాయి. రాజకీయంగా విడిపోయినా తెలుగు భాషా బంధం చాలా దృఢమైనది. అందరూ తెలుగు వాళ్లమేనన్న భావన అంతరాంతరాల్లో సజీవ జలలా పారుతూనే ఉంటుంది. భాష ఒక్కటే అన్ని సందర్భాల్లో మనుషులను కలిపి ఉంచలేదని ఇటీవల చరిత్ర నేర్పిన పాఠాన్ని ఎవరూ మర్చిపోలేరు. ఇదెంత నిజమో అనేక సందర్భాల్లో అంతకు మించి లోతైనది భాషాబంధం. సంస్కృతుల పైపొరల్లో ఎన్ని తేడాలైనా ఉండవచ్చు. కొలిచే దేవుళ్లలో, నోచే నోముల్లో, పండగల్లో, పబ్బాల్లో, పాపపుణ్య వివేచనల్లో, ప్రాచీన సాంస్కృతిక వారసత్వం నుంచి ఉత్తేజం పొందే వివిధ రీతుల్లో... రెండు చోట్లా సారూప్యతలే ఎక్కువ. ఈ సారూప్యతలకు తోడు రెండు రాష్ట్రాల మధ్య వ్యాపార-సేవా బంధాలు ప్రభుత్వాలకు అతీతంగా బలంగా ఉన్నాయి. ఇకపైనా ఉంటాయి. ప్రజల మధ్య ఉన్న ఈ సజీవ సంబంధాలకు రాజకీయ అవసరార్థం అడ్డంకులు ఏర్పడకుండా ఉండటానికే ప్రభుత్వాధినేతల మధ్య నిరంతర ఆత్మీయ చాలనలు ఉండాలి.

రెండు రాష్ట్రాల మధ్య ప్రధాన సమస్య నీటి పంపకానికి సంబంధించిందే. కేసీఆర్ చెప్పినట్లు కృష్ణా నీళ్లకు ఎప్పుడూ కటకటే. గోదావరి నీళ్లు ఉభయ రాష్ట్రాల అవసరాలకు సరిపడినన్ని ఉన్నాయనడంలో మరో మాటలేదు. కృష్ణా నీటిని పునఃకేటాయించడానికి బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ కసరత్తు చేస్తోంది. తెలుగు రాష్ట్రాల నాయకత్వాలు వాస్తవిక అవసరాలు ప్రాతిపదికన ఒక అంగీకారానికి రాగలిగితే రాజకీయ ఖడ్గచాలనకు ఆస్కారం ఉండదు. గోదావరి జలాల విషయంలోనూ ఈ రాష్ట్రాలు సముచితరీతిలో పంపకానికి ఒక ఒప్పందానికి రావాలి. విభజన చట్టం నిర్దేశించిన రీతిలో ప్రాజెక్టుల అనుమతులు తీసుకోవడానికి ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు అడుగులు వేస్తే కొన్ని చిక్కుముడులైనా వీడుతాయి. ఆదరాబాదరాగా రూపొందించిన విభజన చట్టంవల్ల కొన్ని సమస్యలు ఉత్పన్నమవుతున్న విషయాన్ని అధికారులు, మేధావులు అంగీకరిస్తున్నా రాజకీయ నాయకత్వాలు ఇంకా ముందుకు రావడం లేదు. కేసీఆర్ చాలా సందర్భాల్లో చెప్పినట్లు 'మేం బతుకుతాం.. ఇతరులను బతకమంటాం' అన్న అభిప్రాయాన్ని జలవనరుల సముచిత పంపిణీకి నూటికి నూరుపాళ్లు వర్తింపజేసుకుంటే అందరికీ ఆనందమే. ఉద్యోగుల పంపిణీ వివాదం ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు కూర్చుంటే తేలికగా పరిష్కారం అవుతుంది. మూడో సమస్య ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లకు సంబంధించినది. ఇచ్చిపుచ్చుకునే రీతిలో వీటిపైనా అంగీకారానికి రావచ్చు. కీలకమైన కృష్ణా, గోదావరి జలవనరుల పంపిణీ, వినియోగం సమస్య పరిష్కారమైతే మిగతా సమస్యలన్నింటికీ తేలికగా పరిష్కారం దొరుకుతుంది.

తెలుగు రాష్ట్రాల మధ్య కావాల్సిందిదే!

రాజకీయ నేతలు ఆభిజాత్యాలకు అతీతం కాదు. అంగీకరించినా అంగీకరించకపోయినా గతంలో ఇది అనేక సందర్భాల్లో తొంగిచూసింది. ఇప్పుడైతే ఆ సమస్య లేదు. ఇక ముందూ రాకూడదని ఆశించడంలోనూ తప్పులేదు. వయస్సు రీత్యా కేసీఆర్, జగన్ మధ్య వ్యత్యాసం కలిసి వచ్చేదే. ఇచ్చిపుచ్చుకోవడానికి అనేక అంశాలు దోహదం చేస్తాయి. నేతల మధ్య నెలకొన్న భావ, ఉద్వేగ బంధుత్వమూ నిర్ణయాలను ప్రభావితం చేస్తుంది. కేంద్రంలోనూ ఇరు రాజకీయ నాయకత్వాలకు ఎంతో కొంత ఆమోదయోగ్యమైన ప్రభుత్వమే మళ్లీ ఘనంగా అధికారంలోకి వచ్చింది. రాష్ట్ర విభజన తరవాత ఇన్ని సానుకూలతలు ఒక సన్నివేశంగా మారడం బహుశా ఇది మొదటిసారి కావచ్చు! రెండు రాష్ట్రాల నేతలకు మరో రాష్ట్ర రాజకీయాలపై దృష్టిపెట్టే అవసరం లేకపోవడమూ చెప్పుకోదగ్గ సానుకూలతే! అందుకే ఇప్పుడు కావాలి బహుముఖ స్నేహచాలనం!

– ఎన్.రాహుల్ కుమార్

ఈనాడు లేఖలు

స్వయం ఉపాధికి చేయూత

పదిహేడో సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన నరేంద్రమోదీ నాయకత్వంలోని ప్రభుత్వంపై గురుతర బాధ్యతలు ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో అందరికీ ప్రభుత్వమే ఉద్యోగాలు కల్పించడం కష్టమైన పనే. అందువల్ల నిరుద్యోగ సమస్యతో సతమతమవుతున్న యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం తక్షణం దృష్టి పెట్టాలి. వారికి వృత్తి నైపుణ్యాలు కల్పించడం ముఖ్యం. చేతివృత్తులు, చిన్న తరహా కుటీర పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా కొంత మేరకు ఉపాధి కల్పించవచ్చు. వ్యవసాయాధారిత పరిశ్రమలు, ఖాదీ, గ్రామీణ పరిశ్రమల స్థాపన ద్వారా ఉపాధి అవకాశాలను విస్తృతం చేయవచ్చు. వీటికి పెద్దమొత్తంలో నిధులు సైతం అవసరం లేదు. ఈ దిశగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి పకడ్బందీగా అమలు చేస్తే సత్ఫలితాలు సాధించవచ్చు.

- కె. సాయికృష్ణ, ఉప్పల్, హైదరాబాద్

తాగునీటికి కటకట

రాష్ట్రంలో మంచినీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. నగరాలు, పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. పలు చోట్ల బోరుబావులు పని చేయడం లేదు. మరమ్మతులు లేక అవి అలంకారప్రాయంగా మిగిలిపోయాయి. కొన్ని పని చేస్తున్నా వాటి నుంచి అరకొరగా నీరు వస్తోంది. మంచినీటి కుళాయిల వద్ద మహిళలు బారులు తీరుతున్నారు. ఈ నీరు చాలక అప్పుడప్పుడు ఘర్షణ వాతావరణం ఏర్పడుతోంది. పురపాలక సంఘాలు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే తాగునీరు ప్రజల అవసరాలను తీర్చడం లేదు. పల్లెల్లో పరిస్థితి దయనీయంగా ఉంది. అధికార యంత్రాంగం తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది.

- గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా

కలిసి భోంచేద్దాం

మనుషుల మధ్య ఆత్మీయబంధాలు, కలిసిమెలిసి ఉండటం వల్లనే ఏర్పడతాయి. నేటి ఉరుకులు పరుగుల ప్రపంచంలో, చుట్టూ ఎంతమంది ఉన్నా ఎందరో మానసికంగా ఒంటరులై పోతున్నారు. దీనివల్ల అంతరాలు పెరుగుతూ, అగాధాలు ఏర్పడతాయి. విపరీత ధోరణులు పెచ్చరిల్లుతాయి. మానవబంధాల మాధుర్యం మాయమైపోతుంది.

మనుషుల మధ్య మాటలు కలిస్తే, మనసులు దగ్గరై ఆత్మీయబంధాలు పటిష్ఠమవుతాయి. మమతానురాగాలు చిగురిస్తాయి. ఆహారపానీయాలు భగవత్ ప్రసాదితాలు. వాటిని అనంతంగా ఇచ్చాడు సృష్టికర్త.

'నీవు ఇచ్చే మహాప్రసాదాన్ని స్వీకరించాలంటే చూడు నా చేతులెంత చిన్నవి! ఈ చిన్నిచేతులతో ఎలా తీసుకోగలను' అంటాడు గీతాంజలి రచనలో విశ్వకవి రవీంద్రుడు. ఒక్కడిగా తినకూడదు. నలుగురితో కలిసి పంచుకొని తినాలి. సమష్

Downloaded from Playstore: Todays NewsPaper Telugu

సివిల్స్ ప్రిలిమినరీ కఠినం

- ప్రశాంతంగా ముగిసిన పరీక్ష

ఈనాడు డిజిటల్ – అమరావతి

సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ప్రశ్నపత్రం కఠినంగా ఉన్నట్లు పలువురు అభ్యర్థులు అభిప్రాయపడ్డారు. పేపర్-1, పేపర్-2లో చాలా ప్రశ్నలకు జవాబులు గుర్తించడానికి ఎక్కువ సమయం పట్టిందన్నారు. విశ్లేషణాత్మకంగానూ ఉన్నట్లు పలువురు వివరించారు. దేశవ్యాప్తంగా సివిల్ సర్వీసెస్ పరీక్ష ఆదివారం జరిగింది. రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురంలో నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పేపర్-1 ప్రశ్నపత్రంలో 'స్టేట్‌మెంట్'లుగా ఇచ్చిన ప్రశ్నలకు చెందిన ఐచ్ఛికాల్లో చాలా దగ్గరగా.. పదాలు తికమకకు గురిచేసేలా ఉన్నాయని గుంటూరుకు చెందిన సాయిదీప్తి తెలిపారు. చాలా ప్రశ్నలకు సమాధానాలు తొలగింపు(ఎలిమినేషన్) విధానంలో గుర్తించేలా ఉన్నాయని పశ్చిమ గోదావరికి చెందిన శివరామారావు చెప్పారు. మూడేళ్లుగా వార్తా పత్రికలను నిశితంగా పరిశీలించిన వారు కరెంట్ అఫైర్స్‌కు సమాధానాలు గుర్తించవచ్చని తెనాలికి చెందిన నజీబ్ అభిప్రాయపడ్డారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీకి సంబంధించిన ప్రశ్నలు వచ్చినట్లు గుంటూరుకు చెందిన శ్రీకాంత్ తెలిపారు. రాజనీతిశాస్త్రం నుంచి లోతైన ప్రశ్నలు అడిగినట్లు వెల్లడించారు. ఆర్థికశాస్త్రానికి చెందిన ప్రశ్నలు కఠినంగా ఉన్నాయని విజయవాడకు చెందిన శ్రీలక్ష్మి తెలిపారు. చరిత్రకు సంబంధించిన ప్రశ్నలు కఠినంగా ఉన్నట్లు ఉయ్యూరుకు చెందిన హర్షిణి చెప్పారు. పేపర్-2 ప్రశ్నపత్రంలో ప్యాసేజ్ రూపంలోని ప్రశ్నలు సుదీర్ఘంగా ఉన్నాయని, సమాధానాన్ని గుర్తించడంలో సమయాన్ని తీసుకునేలా ఉన్నాయని ఉయ్యూరుకు చెందిన సుప్రియ తెలిపారు. బాగా సాధన చేసిన వారికి గణితం ప్రశ్నలు కొంత మేర సులువుగా ఉంటాయని పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన గీతాంజలి తెలిపారు.

పరీక్షకు హాజరైన వారి శాతం...

కేంద్రం	పేపర్-1	పేపర్-2
విశాఖపట్నం	48.76	47.54
విజయవాడ	47.40	48.42
తిరుపతి	53.91	53.24
అనంతపురం	56.96	56.18

విజయవాడలోని సిద్ధార్థ మహిళా కళాశాల కేంద్రంలో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

న్యాయపరమైన అంశాలకు ప్రాధాన్యం

ప్రశ్నలు కఠినతరంగా ఉన్నాయి. న్యాయపరమైన అంశాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపించింది. చట్టాలపై అభ్యర్థులకు ఎక్కువ అవగాహన ఉండేందుకే ఇలా ఇచ్చారని భావించవచ్చు. ఆర్థికశాస్త్రం, పర్యావరణ విభాగాల నుంచి ఎక్కువ ప్రశ్నలు అడిగారు. గతంతో పోలిస్తే సైన్స్ అండ్ టెక్నాలజీ నుంచి ఎక్కువ ప్రశ్నలు ఇచ్చారు. ప్రాథమిక అంచనా మేరకు కటాఫ్ మార్కులు జనరల్ అభ్యర్థులకు 100-105, ఈడబ్ల్యూఎస్ వారికి 98-100, ఓబీసీలకు 99-103, ఎస్సీ, ఎస్టీలకు 80-85 మధ్యగా ఉండవచ్చు. – గోపాలకృష్ణ, పోటీ రంగ నిపుణులు

ప్రాణవాయువుతో పరీక్షకు

- చక్రాల కుర్చీ, ఆక్సిజన్ సిలిండర్‌తో సివిల్స్‌కు
- తిరువనంతపురంలో ఓ మహిళా అభ్యర్థి పట్టుదల

తిరువనంతపురం: అరుదైన ఎముకల వ్యాధి (ఆస్టియోజెనెసిస్ ఇంపెర్ఫెక్టా)తో బాధపడుతున్న ఓ మహిళా అభ్యర్థి ఏకంగా ప్రాణవాయువు సిలిండర్‌తోనే సివిల్ సర్వీసెస్ పరీక్షకు హాజరయ్యారు. కేరళ రాష్ట్రం కొట్టాయం జిల్లాకు చెందిన 24 ఏళ్ల లతీషా అన్సారీ పుట్టినప్పటి నుంచి ఎముకలు పెళుసుబారిపోయే వ్యాధికి చికిత్స పొందుతున్నారు. దీనికితోడు ఏడాది కాలం నుంచి శ్వాసపరమైన ఇబ్బందులూ పెరిగిపోయాయి. ఫలితంగా ఆమె వెంట 24 గంటలూ ప్రాణవాయువు సిలిండర్ ఉండాల్సిన పరిస్థితి. ఆమెకు సివిల్స్ అంటే ప్రాణం. దీంతో ఆదివారం ఆమె చక్రాల కుర్చీలో ప్రాణవాయువు సిలిండర్‌తో తిరువనంతపురం పరీక్ష కేంద్రంలో సివిల్స్ పరీక్షకు హాజరయ్యారు. లతీషా దుస్థితి గురించి తెలుసుకున్న జిల్లా కలెక్టర్ పీఆర్ సుధీర్‌బాబు ప్రాణవాయువు సమకూర్చే చిన్నపాటి పరికరాన్ని పరీక్ష హాలులో ఏర్పాటుచేయించారు. ఇలాంటి పరికరాన్ని ఆమెకు ఉచితంగా అందజేస్తామని కూడా ఆయన హామీ ఇచ్చారు. ఏడాదిన్నర కాలంగా సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవుతున్నానని, తప్పక విజయం సాధిస్తానన్న నమ్మకం ఉందని లతీషా తెలిపారు. ఎంకామ్ చేసిన లతీషా మలయాళం ఐచ్ఛికంగా సివిల్స్‌కు సిద్ధమవుతున్నారు. మరోవైపు, అరుదైన వ్యాధుల బారిన పడిన చిన్నారులకు సేవలు అందించే అమృతవర్షిణి స్వచ్ఛంద సంస్థకు చెందిన లతా నాయర్ మాట్లాడుతూ.. లతీషా వంటి అభ్యర్థులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆమెకు వైద్య పరమైన ఖర్చుల నిమిత్తం నెలకు రూ.25,000 అవసరం అవుతాయని తెలిపారు.

తిరువనంతపురంలో పరీక్ష కేంద్రం వద్ద తండ్రి అన్సారీతో లతీషా. అంతరచిత్రంలో పరీక్ష గదిలో లతీషా

జగన్, కేసీఆర్ ఎన్డీయే కూటమిలో చేరాలి

కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే సూచన

ఈనాడు, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో ప్రజల అభివృద్ధి కోసం కేంద్రంలోని ఎన్డీయే సర్కారులో తెరాస, వైకాపా చేరాలని కేంద్ర సామాజిక న్యాయశాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలే కోరారు. ఎన్డీయేకు 353 సీట్లు, భాజపాకు 303 సీట్లు రావడంతో.. ఎవరి మద్దతు అవసరం లేదని, అయినా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని మరింతగా బలపరిచేందుకు కేసీఆర్, జగన్ ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్డీయే నుంచి బయటకు వెళ్లడం సరైన నిర్ణయం కాదని తెదేపా అధినేత చంద్రబాబుకు అప్పట్లోనే సూచించానని తెలిపారు. ప్రత్యేకహోదాకోసం ఏపీతో పాటు మరిన్ని రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయని, అయితే ఏపీ రాష్ట్ర అభివృద్ధికి మోదీ సర్కారు కట్టుబడి ఉందని అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 'ఏపీలో గెలుపొందిన జగన్‌మోహన్ రెడ్డికి శుభాకాంక్షలు. చంద్రబాబునాయుడు ఎన్డీయే నుంచి బయటకు వచ్చి మోదీపై తీవ్రంగా మాటలదాడి చేశారు. ఎన్డీయేకు వ్యతిరేకంగా దేశమంతా తిరిగినా మూడు సీట్లు మాత్రమే వచ్చాయి. ప్రజలు బాబుకు మద్దతు పలకకుండా జగన్‌ను గెలిపించారు. కేసీఆర్ నాకు వ్యక్తిగతంగా మంచి స్నేహితుడు. తెలంగాణ ప్రజల అభివృద్ధి కోసం ఎన్డీయేలో చేరాలని కోరుతున్నా. ఇది నా సలహా మాత్రమే. నిర్ణయంపై వారిద్దరూ ఆలోచించుకోవాలి' అని పేర్కొన్నారు.

తెలుగు రాష్ట్రాల ప్రజలకు ప్రధాని శుభాకాంక్షలు

ఈనాడు, దిల్లీ: తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాని మోదీ తెలుగు రాష్ట్రాల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 'ఆంధ్రప్రదేశ్‌లోని సోదరసోదరీమణులకు నా శుభాకాంక్షలు. సాంకేతిక నుంచి క్రీడల దాకా.. విద్య నుంచి పారిశ్రామికాభివృద్ధి వరకూ.. ఏపీ భాగస్వామ్యం అపారమైనది. రాబోయే రోజుల్లో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నా'' అని ట్వీట్ చేశారు.

తెలంగాణ ప్రజల ఆకాంక్షలు ఫలించాలి: చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరులకు నివాళులర్పిస్తున్నామన్నారు. వారి ఆకాంక్షలు ఫలించేలా అభివృద్ధి, సంక్షేమం తెలంగాణ ప్రజలకు చేరువ కావాలని కోరుకుంటున్నానని ట్విటర్ సందేశంలో పేర్కొన్నారు.

రాంచీలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

దిల్లీ: అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రధాన కార్యక్రమాన్ని ఈసారి ఝార్ఖండ్ రాజధాని రాంచీలో నిర్వహిస్తున్నారు. ఈనెల 21న జరిగే ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొంటారని అధికారవర్గాలు తెలిపాయి. రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత ఆయన పాల్గొంటున్న మొదటి అతి పెద్ద బహిరంగ కార్యక్రమం ఇదే. ఆయుష్ మంత్రిత్వశాఖ దిల్లీ, సిమ్లా, మైసూర్, అహ్మదాబాద్, రాంచీ నగరాలను ప్రాథమికంగా ఎంపికచేసి పీఎంవోకు పంపగా, చివరకు రాంచీని ఎంపిక చేశారు. కార్యక్రమ ఏర్పాట్లు ఇప్పటికే ప్రారంభించామని, దీన్ని భారీస్థాయిలో నిర్వహిస్తామని ఆయుష్ మంత్రిత్వశాఖ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. మరోవైపు మొరార్జీ దేశాయ్ జాతీయ యోగా సంస్థ దిల్లీలో రెండురోజుల పాటు యోగా మహోత్సవం నిర్వహిస్తోంది. దీనికి 10వేల మంది వరకు రావచ్చని భావిస్తున్నారు. 2014లో ఐక్యరాజ్యసమితి జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించింది.

ఉపాధ్యాయ విద్యలో సమూల మార్పులు

- ప్రతిభావంతులకే 'గురువు'లయ్యే అవకాశం
- పాఠశాల విద్యలో జాతీయ, మాతృభాషలకు పెద్దపీట
- జాతీయ నూతన విద్యావిధానం-2019లో పలు సంస్కరణలు

ఈనాడు, హైదరాబాద్: ఉపాధ్యాయ విద్యను సమూలంగా మార్చేందుకు నూతన విద్యావిధానం ముసాయిదా నివేదికలో పలు సంస్కరణలను పేర్కొన్నారు. ఉపాధ్యాయవిద్య పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా ఇబ్బడి ముబ్బడిగా వెలిసిన కళాశాలల్ని మూసివేయాలని నూతన విద్యావిధానంపై ఏర్పాటైన కమిటీ అభిప్రాయపడింది. 2030 నుంచి నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సులు అందుబాటులోకి తీసుకురావాలని, ఈ కోర్సులను డిగ్రీ, పీజీ కోర్సులు నిర్వహించే కళాశాలల్లోనే బోధించాలని పేర్కొంది. ఉపాధ్యాయ వృత్తిలోకి అత్యంత ప్రతిభావంతులైన వారికే ప్రవేశం కలిగేలా చర్యలు తీసుకోనుంది. గ్రామీణ విద్యార్థులను ప్రోత్సహించేందుకు భారీస్థాయిలో ఉపకారవేతనాలు అందించనుంది. మధ్యాహ్నభోజన పథకంలో భాగంగా అల్పాహారాన్ని అందించాలని నివేదిక అభిప్రాయపడింది. వైద్యవిద్యలో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశపరీక్ష (నీట్)ను నిర్వహిస్తున్నట్లు.. ఎంబీబీఎస్ కోర్సు పూర్తిచేసిన తరువాత కూడా 'ఎగ్జిట్ పరీక్ష'ను నిర్వహించాలని కమిటీ అభిప్రాయపడింది. జాతీయ నూతన విద్యావిధానంలో భాగంగా ఈ అంశాలను పేర్కొంది.

ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సు..

ఉపాధ్యాయ వృత్తి కోర్సు చేయాలంటే ఇక నుంచి తప్పనిసరి ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సు చేయాలి. రెండేళ్ల బీఈడీ కోర్సును ఏడాది కోర్సుగా మార్చి, నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులు చేసిన వారికి ప్రవేశాలు కల్పిస్తారు. ప్రస్తుతం ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో కేవలం రాతపరీక్ష మార్కులకే ప్రాధాన్యముంది. టెట్‌లో ప్రతి అభ్యర్థి 5 నుంచి ఏడు నిమిషాల ప్రత్యక్ష తరగతుల డెమోకు హాజరు కావాలని ప్రతిపాదన చేర్చింది. పాఠశాల విద్యలో హిందీకి అధిక ప్రాధాన్యత ఇవ్వనుంది. ఆరోతరగతి నుంచి పిల్లలు మూడు భాషలు నేర్చుకోవాల్సిందే. హిందీ మాట్లాడని రాష్ట్రాల్లో హిందీతో పాటు మాతృభాషను, హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో ఇతర భాషను నేర్చుకోవాల్సి ఉంటుంది. బోధనలో మాతృభాష, జాతీయ భాష హిందీకి ప్రాధాన్యత ఇస్తూ.. ఇంగ్లిష్ భాషకు తక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది. ఇక 'ప్రైవేటు పాఠశాల' అనే పదాన్ని ఉపయోగించకూడదు. 'ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ సహాయం పొందుతున్నవి' అని మాత్రమే వ్యవహరించాలి.

పబ్లిక్.. ప్రైవేటు యూనివర్సిటీలే..

దేశంలో భవిష్యత్తులో స్వయంప్రతిపత్తి, గుర్తింపు పొందిన, అనుబంధ యూనివర్సిటీలు అనేవి ఉండవు. యూనివర్సిటీలంటే కేవలం పబ్లిక్, ప్రైవేటు, ప్రైవేటు ఎయిడెడ్ మాత్రమే. విశ్వవిద్యాలయాలు ఎంఫిల్ కోర్సులు ఎత్తివేయాలి. పీహెచ్‌డీ చేయాలంటే నాలుగేళ్ల పరిశోధన డిగ్రీ లేదా పీజీ డిగ్రీ ఉన్నవారికే అవకాశమివ్వాలి. కేంద్రం రూ.20 వేల కోట్లతో జాతీయ పరిశోధన ఫౌండేషన్ (ఎన్ఆర్ఎఫ్) ఏర్పాటు చేస్తుంది. ఈ నిధిని పరిశోధనల కోసం ప్రభుత్వ విద్యాసంస్థలతో పాటు ప్రైవేటు విద్యాసంస్థలు వినియోగించుకునేందుకు కేంద్రం అవకాశం ఇస్తుంది.

బయోత్పాతం

ఆసుపత్రుల ఆవరణల్లో వాడేసిన సూదులు, మందులు, రక్తంతో కూడిన దూది, శస్త్రచికిత్సకు ఉపయోగించే వస్తువులు తదితర వ్యర్థాలను అక్కడే పడేస్తుండటం ఆందోళన కల్గించే అంశం. వీటిని ఏ రోజు కారోజు తరలించాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఒంగోలు రిమ్స్ ఆసుపత్రి ఆవరణ ఇలా పారేసిన బయో వ్యర్థాలతో నిండిపోతోంది. ఒక్కోసారి అక్కడే మంటపెట్టి వాటిని తగలబెట్టేస్తున్నారు. ఈ వాయువులను పీల్చడం కారణంగా ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదముంది. ఆసుపత్రికి వస్తే రోగాలు పోవడం మాట అటుంచి.. కొత్త జబ్బులొస్తాయేమోనని రోగులు వాపోతున్నారు.

– ఈనాడు, ఒంగోలు

ఎండలో పెడితే వండి పెడుతుంది!

- కాంతి పరావర్తన సూత్రంతో పనిచేసే సౌర కుక్కర్
- ఆహారం మాడిపోదు.. పోషకాలు పోవు
- ఆవిష్కరించిన విశాఖ ఉక్కు ఉద్యోగి
- గంటన్నరలో సిద్ధమవుతున్న వంటకం
- ఫలించిన పదేళ్ల పరిశోధన శ్రమ

ఈనాడు – విశాఖపట్నం

అపారంగా లభ్యమవుతున్న సౌరశక్తిని సౌర పలకాలు లేకుండానే వినియోగించుకోవచ్చని నిరూపించారు విశాఖలోని ఉక్కు కర్మాగారం ఏజీఎం కోటా ఆంజనేయశర్మ. తన ఇంజినీరింగ్ నైపుణ్యాన్ని ఉపయోగించి 'కాంపౌండ్ పారాబొలిక్ సౌర కుక్కర్'ను ఆవిష్కరించారు. దీని ద్వారా ఆహార పదార్థాలను వండొచ్చని, ఉడికించొచ్చని చేసి చూపించారు.

గంటన్నరలో ఆహారం సిద్ధం

- ఎండ తీవ్రతను బట్టి పారాబొలిక్ సోలార్ కుక్కర్‌లో ఉంచిన ఆహారం గంటన్నర నుంచి మూడు గంటల వ్యవధిలో పూర్తిగా ఉడికిపోతుంది. శర్మ తయారు చేసిన సోలార్‌కుక్కర్లో ఒకేసారి అర కిలో ఆహారపదార్థాల్ని ఉడికించవచ్చు. అన్నం, కూర తదితరాలన్నీ ఒకేసారి పూర్తి చేసుకోవచ్చు.
- ఒక్కోసారి ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులున్నపుడు సోలార్ కుక్కర్లో పదార్థాలు వేడి ఎక్కువై మాడిపోవడం జరగదు.
- గిన్నెలో పోసిన నీళ్లు పొంగిపోవడం, పోషకాలు పోవడం వంటి సమస్యలు తలెత్తవు. ఈ సోలార్ కుక్కర్లో వండిన ఆహారపదార్థాల పోషక విలువలు పదిశాతానికి మించి తగ్గడం లేదు.

ఉడికించిన ఆహారం గిన్నెతో శర్మ

పుణె విశ్వవిద్యాలయ ఆచార్యుల సంతృప్తి

కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల విభాగం అధికారులు పునరుత్పాదక ఇంధనాలను ఉపయోగించి తయారు చేసే వివిధ ఉత్పత్తుల నాణ్యతను పరిశీలించే బాధ్యతను కొన్ని సంస్థలకు అప్పగించారు. అందులో పుణెలోని సావిత్రీబాయి విశ్వవిద్యాలయం ఒకటి. ఆంజనేయశర్మ తన ఉత్పత్తిని ఆ పరిశీలికి పంపించారు. అక్కడి అధికారులు దాన్ని పరిశీలించి పనితీరు సంతృప్తికరంగా ఉందని నిర్ధరించారు.

ఒక్కసారి పెట్టుబడి చాలు

పారాబొలిక్ సోలార్ కుక్కర్లో ఆహారపదార్థాలు తయారు చేయడానికి తొలుత ఎక్కువ సమయం పట్టేది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆ సమయాన్ని గణనీయంగా తగ్గించేందుకు ప్రయత్నించా. ప్రస్తుతం గంటన్నర సమయంలోనే ఆహారపదార్థాలు పూర్తిగా ఉడికేలా, వేగేలా తయారు చేయగలిగాను. ఎలాంటి విద్యుత్తు, ఇతర నిర్వహణ ఛార్జీలు ఉండవు. పొగ రాదు. ఆరోగ్యానికి మంచిది. నా పదేళ్ల శ్రమ ఫలించింది.

– కోటా ఆంజనేయశర్మ, ఏజీఎం, విశాఖ ఉక్కు కర్మాగారం

ప్రయోగం ఇలా...

- ఎండలో అద్దాలను ఉంచి.. వాటి ద్వారా కాంతి కిరణాలు ఒక ప్రదేశంపైకి పరావర్తనం చెందేలా చేసి అధిక ఉష్ణోగ్రతను ఉత్పత్తి చేయాలన్నది శర్మ ఆలోచన.
- అద్దాలను వివిధ సైజుల్లో తీసుకున్నారు. వాటిని పుటాకార ఆకృతిలో ఉండేలా అతికించి ఎండలో ఉంచారు. ప్రతి అద్దంపైనా పడిన కాంతి కిరణాలన్నీ పరావర్తనం చెంది.. అత్యంత సమీపంలో ఒకచోట పడేలా చేయగలిగారు.
- ఇలా పలు అద్దాలపై పడిన కాంతి కిరణాల ఉష్ణోగ్రత మొత్తం ఒకచోట కేంద్రీకృతమైంది.
- అక్కడ ఒక తొట్టెలాంటి భాగాన్ని ఏర్పాటు చేశారు. అందులో ఓ గిన్నె ఉంచి ఆహార పదార్థాలను ఉడికించారు.
- 750 మిల్లీమీటర్ల పొడవు, అంతే వెడల్పున్న ఆ తొట్టె లోపలి భాగంలో ఎక్రిలిక్ సిలికాన్ కోటింగ్ వేశారు. ఆ తొట్టెపై పడిన ప్రతి కాంతి కిరణం కూడా పరావర్తనం చెంది అందులోని గిన్నెపైకి ప్రసరించేలా రూపొందించారు.

పారాబొలిక్ సోలార్ కుక్కర్

- తొట్టెలో ఉంచే ఆహారపదార్థాల గిన్నెపై కూడా ఎక్రిలిక్ సిలికాన్ కోటింగ్ వేశారు. ఫలితంగా కాంతికిరణాల తాలూకు ఉష్ణోగ్రతల తీవ్రత మొత్తం గిన్నెపైనే కేంద్రీకృతమైంది. దీనివల్ల పదార్థాలు చక్కగా ఉడికిపోతున్నాయి.
- దీనికి 'కాంపౌండ్ పారాబొలిక్ సోలార్ కుక్కర్' అని నామకరణం చేశారు.

పాణ్యం సమీపంలో జాతీయ రహదారిపై బోల్తాపడిన కంటైనర్ లారీలు

కర్నూలు జిల్లాలో ఈదురుగాలుల బీభత్సం

పాణ్యం, సున్నిపెంట, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. శ్రీశైలం, సున్నిపెంట, పాణ్యం, నందికొట్కూరు, పెద్దకడబూరు తదితర ప్రాంతాల్లో గాలులతో పాటు భారీ వర్షం కురిసింది. పాణ్యంలోని శాంతిరాం వైద్యశాల సమీపంలో జాతీయ రహదారిపై గాలులకు రెండు కంటైనర్ లారీలు బోల్తా పడ్డాయి. మహానంది మండలంలోని గోపవరం, బుక్కాపురంలో చెట్లపై పిడుగులు పడ్డాయి.

తెలంగాణ లాసెట్ ఫలితాల విడుదల

హైదరాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ లాసెట్-2019 ప్రవేశ పరీక్షా ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. ఈ మేరకు లాసెట్ కన్వీనర్ ప్రొ. జీబీ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది 80.80శాతం మంది విద్యార్థులు అర్హత సాధించారని తెలిపారు. అమ్మాయిల్లో 74.72, అబ్బాయిల్లో 83.57శాతం మంది ఉత్తీర్ణులైనట్లు వెల్లడించారు

INDIAN INSTITUTE OF PETROLEUM & ENERGY (IIPE)
(2nd Floor of Andhra University College of Engineering Administrative Block)
VISAKHAPATNAM 530003

ADMISSION NOTIFICATION 2019-20

Indian Institute of Petroleum & Energy, Visakhapatnam, Andhra Pradesh, an Institute of National Importance at par with IITs, IIMs under Ministry of Petroleum & Natural Gas, Govt of India calls for admissions for the academic year 2019-20 for 4-year B.Tech. (Petroleum Engineering) and B.Tech. (Chemical Engineering) Programs. Aspirant students who get Rank in JEE(Advanced)2019 can go through the admission notification in the web site of IIPE – www.iipe.ac.in for the admission criterion and other details from 13th June 2019 onwards for applying on line. DIRECTOR

Shop online @ paragonfootwear.com
Paragon®
CHOICE OF BEST SCHOOLS
Rates mentioned are MRP per pair (INR inclusive of all taxes. Data subject to change.
Canvas Shoes Clr: Blu, Brn, Wht, Blk
Model No.: 751 Clr: Wht, Blk, Brn
Model No.: 755 Clr: Blk, Wht, Brn
Model No.: 752 Clr: Blk, Brn
Model No.: 770 Clr: Blk, Wht
Paragon® SCHOOL WORLD JOY OF SCHOOLING

Downloaded from Playstore: Todays NewsPaper Telugu

భూగర్భం..గరళం..!

- విజయవాడలో ప్రమాద ఘంటికలు
- భూమిలోకి ఇంకిపోతున్న మురుగునీరు
- తాగితే ప్రమాదమంటున్న కేంద్ర భూగర్భ జలమండలి
- వాడుకోవచ్చంటున్న రాష్ట్ర భూగర్భ జలశాఖ
- కేంద్ర, రాష్ట్ర శాఖల మధ్య తేడాలు సుస్పష్టం

ఈనాడు – అమరావతి

నగరంలో ప్రవహించే సాగు, తాగునీటి కాలువలే భూగర్భ జలాలకు శత్రువుగా మారాయి. కాలువలు, వాగులు, వంకలు, డ్రైనేజీలలో కలుషిత నీరు భూమిలోకి ఇంక డంతో గరళంగా మారుతోంది. ఈ విష యాన్ని కేంద్ర భూగర్భ జల మండలి (సీజీ డబ్ల్యూబీ) రెండేళ్ల కిందటే చెప్పగా..రాష్ట్ర భూగర్భ జలశాఖ మాత్రం భూగర్భ జలాలు తాగేందుకు అనువుగా ఉన్నాయని నివేదికలు ఇస్తోంది.

అత్యంత జనసాంద్రత నివాస నగరంగా విజయవాడ దేశంలోనే మూడో స్థానంలో ఉంది. నివాస ప్రాంతాల్లో సాధారణంగా భూగర్భ జలాలనే ఎక్కువగా వినియోగి స్తారు. 2017-18లో సీజీడబ్ల్యూబీ ఆధ్వ ర్యంలో 102 ప్రాంతాల్లో నమూనాలు సేక రించి ప్రమాదకర రసాయనాలు ఉన్నట్లు గుర్తించారు. శివారు ప్రాంతాల్లో పరిస్థితి చెప్పనలవి కాదు.

కేంద్ర భూగర్భ జలమండలి ఏమంటుందంటే..

భూగర్భజలాల కాలుష్యంపై సీజీడబ్ల్యూబీ పరీక్షలు నిర్వహించింది. 5లక్షలు పైబడి ఉన్న నగరాల్లో అధ్యయనం చేయగా విజయవాడ భూగర్భ జలాల్లో ప్రమాదకర స్థాయిలో కాలుష్య కారకాలు ఉన్నట్లు గుర్తించింది.

- నగరంలోని భూగర్భ జలాల్లో ఉప్పునీటి గాఢత, కఠినత్వం, నైట్రేట్, ఫాస్ఫేట్, క్షారియం, కోలీఫాం లాంటివి ఉన్నాయని గుర్తించింది. మాంగనీసు, ఇనుము అధిక మోతాదులో ఉన్నట్లు వెల్లడించింది.

- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ నిబంధనల ప్రకారం టీడీఎస్(టోటల్ డిసాల్వ్‌డ్ సాలిడ్స్) శాతం 300 ఉండాల్సి ఉండగా 500 వరకు విజయవాడలో నమోదైంది.
- ప్రతినెలా 10 టన్నుల డిటర్జెంట్ భూమిలో కలు స్తోంది. బోరు నీటిని వినియోగించే వారికి ఆరోగ్య సమస్యలు ఎక్కువగా వస్తాయి.

> సీసం, పాదరసం, ఆర్సినిక్ నికిల్, కాడ్మియం లాంటి రసాయనాలు బోరు నీటిలో అధిక శాతం ఉంటున్నాయని గుర్తించింది. వీటి వాడకం వల్ల చర్మ సంబంధ వ్యాధులు ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉందని తేల్చింది.

డ్రైయిన్ల నుంచి నేరుగా సాగునీటి కాలువల్లోకి

నగరంలో రూ.271కోట్లతో భూగర్భ మురుగు నీటి వ్యవస్థను ఏర్పాటు చేశారు. కానీ ఇంటిం టికీ కనెక్షన్లు ఇవ్వలేదు. కేవలం 32వేల కనెక్షన్లు మాత్రమే ఉన్నాయి. మిగిలిన ఇళ్ల నుంచి డ్రైనేజీ నీరు నేరుగా సాగునీటి కాలువల్లోకి చేరుతోంది. మురుగు నీటిని శుద్ధి చేసే సీవ రేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు లేవు. దీంతో ఆ మురుగు నీరు బుడమేరు, కృష్ణా నదిలో, కాలువల్లో కలిపేస్తున్నారు. దీంతో మురుగునీరు 50మీటర్ల వరకు వెళ్లి భూగర్భంలో ఇంకడంతో జలాలు విషతుల్యమవుతున్నాయి.

నియంత్రణకు కఠిన చర్యలు..!

విజయవాడ నగరాన్ని శుద్ధి చేసే కార్యక్రమా నికి శ్రీకారం చుట్టాం. కాలువలను, నదిని ప్రక్షా ళన చేస్తున్నాం. దీనిపై అవగాహన ముఖ్యం. పెరుగుతున్న భూగర్భ గరళాన్ని నియంత్రించా ల్సిన ఆవశ్యకత ఉంది. యూజీడీ కనెక్షన్లు ఇవ్వా లని మీఎంసీని ఆదేశించాం. మురుగునీరు, సీవ రేజ్ నీరు కాలువల్లోకి వదిలిన వారిపై కఠినంగా వ్యవహరిస్తాం. దీనిపై నిపుణులతో సమీక్ష జరిపి నివారణ చర్యలు తీసుకుంటాం.

– ఏఎండీ ఇంతియాజ్, కలెక్టర్

రాష్ట్ర భూగర్భ జలశాఖ పరీక్షల్లో..!

రాష్ట్ర భూగర్భ జలశాఖ పరీక్షల్లో మాత్రం విజయవాడ నగ రంలో భూగర్భ జలాలు స్వచ్ఛతతో ఉన్నట్లు వెల్లడైంది. ఈ ఏడాది రుతుపవనాల తర్వాత నగరంలో 31 ప్రాంతాల్లో నీటి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించినట్లు డిప్యూటీ డైరెక్టర్ వరప్రసాదరావు 'ఈనాడు'కు వివరించారు. మొత్తం మీద విజయవాడలో నీటిని తాగడానికి, వాడకానికి వినియోగించవచ్చని ధ్రువీకరించారు.

- నీటి గాఢత పీహెచ్ 7.43 నుంచి 8.50 ఉంది. స్వచ్ఛమైన నీరు(7.50 పీహెచ్) ఎలాంటి ఆమ్ల, క్షార గుణం కలిగి ఉండ కూడదు. కానీ విజయవాడలో కొంత క్షార గుణం కలిగి ఉంది.
- కాల్షియం 100 పీపీఎంలకుగాను 75 ఉందని చెబుతున్నారు. మాంగనీసు కూడా అనుమ తించే పరిధిలో ఉందని అంటున్నారు. సల్ఫేట్, క్లోరిన్, నైట్రేట్ కారకాలు పరిమితికి లోబడే ఉన్నాయని నివేదించారు.
- సీజీడబ్ల్యూబీ నివేదికపై మాత్రం వారు స్పందించడం లేదు. భూగర్భ జలశాఖ అధికారులు.. మొత్తం మీద నీటిని రక్షిత నీటిగా పేర్కొంటున్నా.. ప్రజలు వాడేం దుకు ఇష్టపడటం లేదు.
- టీడీఎస్ (టోటల్ డిజాల్వ్‌డ్ సాలిడ్స్) అనుమతించేంత వరకు ఉంది. కానీ సీజీడబ్ల్యూబీ నివేదికలో 200 శాతం ఎక్కువ ఉన్నట్లు తేలింది. కొన్ని ప్రాంతాల్లో ఎక్కువ తక్కువలు ఉన్నట్లు జీడబ్ల్యూశాఖ చెబుతోంది.
- బోరు నీటిలో 75 అడుగుల లోపు ఎలాంటి నష్ట కారకాలు లేవని, 75 నుంచి 150 అడుగుల లోపు పరిమి తికి లోబడి ఉన్నాయని, 150 నుంచి 300 అడుగులలోపు నీటిలో కఠినత్వం ఉన్నా పరిమితికి లోబడే ఉన్నాయని, 300 నుంచి 600 అడుగులలోపు తీవ్ర కఠినత్వం ఉండే నీటిలోనూ అనుమతించదగ్గ కారకాలే ఉన్నాయని వరప్రసాద్ వివరించారు.

యనమలకుదురు పంచాయతీ.. కృష్ణమ్మ ఒడ్డునే ఉన్న గ్రామం.. అక్కడ బోరు నీరు నల్లగా మురుగు నీటిలా వస్తుంది.. పంచాయతీ అధ్వర్యంలోనూ బోరు నీటినే సరఫరా చేస్తున్నారు. వినియోగించేందుకు వీలు లేని పరిస్థితి..! కానూరు గ్రామం.. విజయవాడలో కలిసిపోయింది.. బోరు నీరు బకెట్‌లో అర్ధగంట సేపు ఉంచితే.. అడుగున ఒక పొరలా ఏర్పడుతోంది. ఆ నీటిని వినియోగించలేని దుస్థితి..!

చెంతనే కృష్ణమ్మ గలగలలు.. నగరంలో ప్రవహించే సాగునీటి కాలువలు.. చుట్టూ పచ్చని పంటపొలాలు.. నవ్యాంధ్ర రాజధానిగా గుర్తింపు.. ఇదీ విజయవాడ ప్రత్యేకత. నగరపాలక సంస్థ అందించే రక్షిత నీరు మినహా మిగిలిన నీటి వనరులు గరళంగా మారాయి. భూగర్భ జలాలను వినియోగించలేని పరిస్థితి నెల కొంది. ఇక్కడ భూమిలోకి ఇంకుతున్న కలుషితాలు భూగర్భ జలాన్ని విషతుల్యంగా మార్చేస్తున్నాయి.

నిద్రిస్తున్న చిన్నారిని నోట కరచుకెళ్లిన పులి!

బల్లార్ష, న్యూస్‌టుడే: ఓ ఇంటి ఆవరణలో తల్లితోసహా నిద్రిస్తున్న తొమ్మిది నెలల చిన్నారిని పులి నోటకరచుకెళ్లింది. చంపి ఊరిబయట పడేసింది. ఈ దారుణ ఘటన ఆదివారం వేకువజామున 3 గంటలకు మహారాష్ట్రలోని చంద్రపూర్‌జిల్లా సిందెవాహి తాలూకా గడబోరి గ్రామంలో చోటుచేసుకుంది. గడబోరిలో నివసించే సచిన్ గురునులే ఇంటి ఆవర ణలో సచిన్ భార్య, 9 నెలల కుమారుడు రాకేష్ ఓ మంచంపై నిద్రపో తున్నారు. వేకువజామున సచిన్ భార్యకు దాహం వేయడంతో నీరు తాగేందుకు ఇంట్లోకి వెళ్లింది. ఆ సమయంలో అక్కడికి వచ్చిన పులి రాకే ష్‌ను నోటకరచుకొని ఊరి బయటకు పరుగులు తీసింది. కుటుంబీకులంతా పులిని వెంబడించారు. అయినా ఫలితం లేకపోయింది. విషయాన్ని అటవీశాఖ అధికారులు, పోలీసులకు తెలియజేశారు. బాలుడి ఆచూకీ కోసం అన్వేషిస్తున్న క్రమంలో సమీపంలోని వాకల్ రహదారి పక్కనే గల చెరువు వద్ద వెదురు పొదలలో మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనతో గ్రామస్థులు అటవీ శాఖ అధికారులను నిలదీశారు.

వాగులోపడి ఇద్దరు చిన్నారుల మృత్యువాత

గుంటూరు జిల్లాలో విషాదం

నాదెండ్ల, న్యూస్‌టుడే: ఆడుకోవ డానికి వాగు వద్దకెళ్లిన చిన్నారులు అందులో పడి మృతి చెందారు. గుంటూరు జిల్లా నాదెండ్ల మండలం చిరుమామిళ్లకి చెందిన ఆరుద్ర వెంక టేశ్వరరావు, నాగలక్ష్మి దంపతుల కుమారుడు జస్వంత్(6), ఇదే గ్రామా నికి చెందిన మల్లా రామాంజనేయులు, కామాక్షి దంపతుల కుమారుడు లక్ష్మీమణికంఠ(7) ఇద్దరూ కలిసి నక్కవాగు వద్దకెళ్లారు. చేప పిల్లలను పట్టుకొనే క్రమంలో వాగు గోతుల్లో పడిపోయారు. మధ్యాహ్నమైనా పిల్లలు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు వాగు పరిసరాల్లో గాలిం చారు. వాగులో జస్వంత్ మృతదేహాన్ని గుర్తించారు. నీటి లోపల బుర దలో కూరుకుపోయిన మణికంఠ మృతదేహాన్ని బయటకు తీశారు.

లక్ష్మీమణికంఠ, జస్వంత్

పిడుగు పాటుకు తోటికోడళ్లు మృతి

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పిడుగు పాటుకు గురై ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా నారాయణపురం తాలూక బొరిగి పంచాయతీలో కిమిడి భద్ర గ్రామానికి చెందిన కొంత మంది గిరిజ నులు కొండపైకి పోడు వ్యవసాయానికి వెళ్లారు. సాయంత్రం దట్ట మైన మబ్బులు కమ్మేయడంతో తిరిగి ఇళ్లకు పయనమయ్యారు. గ్రామ సమీపానికి వచ్చేసరికి పిడుగు పడటంతో మర్రి రాధ (25), వెల్లక సునీత (23) అక్కడికక్కడే మృతిచెందారు. నాలుగు నెలల బాబు రోషన్ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో రాత్రి పార్వతీపురం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. మరో ఇద్దరు మహిళలు ఆప స్మారక స్థితిలో ఉన్నారు. సునీతది విజయనగరం జిల్లా పార్వతీపురం మండలం డోకిశీల పంచాయతీ గింజగూడ గ్రామం. మృతిచెందిన ఇద్దరు మహిళలు తోటి కోడళ్లు. ఒకే ఇంట్లో ఇద్దరు మృతిచెందడంతో బంధువులు కన్నీరుమున్నీరు అవుతున్నారు.

రెండోరోజూ కొనసాగిన సీబీఐ సోదాలు

ఎంపీ సుజనా చౌదరి ఇళ్లు, కార్యాలయాల్లో..

ఈనాడు, హైదరాబాద్: నిధుల మళ్లింపు వ్యవహారంలో రాజ్యసభ సభ్యుడు సుజనా చౌదరి ఇళ్లు, కార్యాలయాల్లో రెండోరోజూ సీబీఐ సోదాలు నిర్వహించింది. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని ఇతర సంస్థల్లోకి మళ్లిం చారన్న ఆరోపణలపై బెంగళూరులోని సీబీఐ బ్యాంకింగ్ ఫ్రాడ్ విభాగం ఇది వరకే కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు హైదరాబాద్, చెన్నై, దిల్లీలోని సుజనా చౌదరి ఇళ్లు, కార్యాలయాలలో శనివారం సోదాలు మొదలుపెట్టారు. మొత్తం 12 ప్రాంతాల్లో చేపట్టిన ఈ సోదాలు ఆదివారం కూడా కొనసాగాయి.

రూ.కోటి విలువైన సముద్రపు జలగలు స్వాధీనం

ఇద్దరిని అరెస్టు చేసిన తమిళనాడు పోలీసులు

చెన్నై, న్యూస్‌టుడే: విదేశాలకు అక్రమంగా తరలిస్తున్న రూ.కోటి విలువైన సముద్రపు జలగలను తమిళనాడు తీర ప్రాంత ప్రత్యేక నిఘా విభాగం అధికా రులు స్వాధీనం చేసుకు న్నారు. ఈ ఘటనలో ఇద్దరిని అరెస్టు చేశారు. సముద్రపు జలగలను అక్రమంగా విదేశాలకు తరలిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచా రంతో.. ప్రత్యేక నిఘా విభాగం సూపరింటెండెంట్ చిన్నస్వామి నేతృ త్వంలో పోలీసులు తమిళనాడులోని నాగపట్నం సాల్ట్ రోడ్డు ప్రాంతం లోని ఓ గోదాములో ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ పలు బస్తాల్లో సముద్రపు జలగలు ఉన్నట్లు గుర్తించారు. సుమారు 2,500 కిలోల బరువున్న వీటి విలువ రూ.కోటిగా అంచనా వేశామని అధి కారులు తెలిపారు. అక్రమ రవాణాకు ఉపయోగించిన మినీ లారీని స్వాధీనం చేసుకోవడంతో పాటు సాల్ట్ రోడ్డుకు చెందిన మురుగానందం, పులియూర్‌కు చెందిన రాజ్‌కుమార్‌లను వన్యప్రాణుల పరిరక్షణ చట్టం కింద అరెస్టు చేసినట్లు అధికారులు చెప్పారు.

సముద్రపు జలగలు, నిందితులతో పోలీసులు

ఇఫ్తార్ విందుకు రూ.1.07 కోట్లు

ఈనాడు డిజిటల్– అమరావతి: గుంటూరులో సోమవారం నిర్వహించ నున్న ఇఫ్తార్ విందు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1.07 కోట్లు విడుదల చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. విందు, నిర్వహణ, అతిథులకు ఏర్పాట్ల కోసం సంబంధిత నిధులను విడుదల చేస్తున్నట్లు అందులో పేర్కొంది.

సీలేరులో పడవ మునిగి చిన్నారి కన్నుమూత

- ఇద్దరు మహిళల గల్లంతు

చింతూరు, న్యూస్‌టుడే: సీలేరు నదిలో పడవ మునిగి ఓ చిన్నారి మృతిచెందగా, ఇద్దరు గిరిజన మహిళలు గల్లంతయ్యారు. తూర్పుగోదావరి జిల్లా వై.రామవరం మండలం మంగంపాడు సమీపంలోని పాలగెడ్డ వద్ద ఆదివారం రాత్రి ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఒడిశాలోని గుర్రలూరుకు చెందిన కొందరు గిరిజన మహిళలు విశాఖ జిల్లా సీలేరులో జరిగే వారపు సంతకు వెళ్లి తిరుగు ప్రయాణంలో పడవ ఎక్కారు. ప్రమాదవశాత్తూ సీలేరు నదిలో పడవ బోల్తా పడింది. ఆ సమయంలో పడవలో ఏడు గురు ఉండగా.. ఏడాది చిన్నారి మృత్యువాత పడింది. రూతూబాయి(25), బుల్లెమ్మ(65) గల్లంతయ్యారు. గాయపడిన ఓ మహిళను ఆసుపత్రికి తరలించారు. మిగతావారు ప్రాణాలతో బయటపడ్డారు.

మతిస్థిమితం లేని మహిళపై సామూహిక అత్యాచారం

ఆపై దాడి.. చికిత్స పొందుతూ మృతి

కామారెడ్డి, న్యూస్‌టుడే: దివ్యాంగురాలైన మతిస్థిమితం లేని అనాథ మహిళపై సామూహిక అత్యాచారా నికి పాల్పడడమే కాకుండా దాడి చేయడంతో ఆమె మృతి చెందిన సంఘటన ఇది. ఈ ఘటన ఆదివారం కామారెడ్డి జిల్లాలో చోటుచేసుకుంది. కామారెడ్డిలోని ఓ వెల్డింగ్ దుకాణంలో పనిచేసే మద్నూర్‌కు చెందిన శివాజీ పవార్, సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం పోసు పురం గ్రామానికి చెందిన అస్కుల అశోక్ అనే ఇద్దరు యువకులు మద్యం మత్తులో.. మతిస్థిమితం లేని మహిళ నిద్రిస్తుండగా ఆమెను వెల్డింగ్ దుకాణంలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి ఒడిగట్టారు. అనంతరం ఆమెపై ఇనుపరాడ్‌తో దాడిచేశారు. స్థానికులు గమనించి నింది తుల్లో ఒకడైన శివాజీ పవార్‌ను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. రెండో నిందితుడు సైతం పట్టుబడ్డాడు. బాధితురాలిని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ విషయంపై డీజీపీ కార్యాలయం నుంచి ఆరా తీయడంతో పోలీసులు విచారణను వేగవంతం చేశారు.

వడదెబ్బతో యువ రైతు..

లక్ష్మీపురం (పగిడ్యాల), న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా పగిడ్యాల మండలం లక్ష్మీపురంలో వడదెబ్బకు గురై యువరైతు మృతి చెందారు. గ్రామానికి చెందిన స్వాములు (28) ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఏకధాటిగా ట్రాక్టరు ద్వారా పొలా నికి ఎరువు తరలించారు. ఈ క్రమంలో ఎండతాకిడిని తట్టుకోలేక కుప్పకూలారు. అనంతరం కుటుంబ సభ్యులు వైద్యుడి వద్దకు తీసుకెళ్లేలోగా ఆయన ప్రాణాలు విడిచారు. ఇంజినీరింగ్ పట్టభద్రుడైన ఈ యువకుడికి మూడేళ్ల క్రితం వివాహమైంది.

ముంచుకొస్తున్న విత్తు ముప్పు!

- మొదలైన ఖరీఫ్ సీజన్
- సీమలో వేరుశెనగ సాగుకు సిద్ధమవుతున్న రైతులు
- ఇప్పటికి సగం కూడా సిద్ధంకాని విత్తనాలు

ఈనాడు, అనంతపురం: ఈ ఖరీఫ్‌లో రాయల సీమ రైతులకు విత్తు కష్టాలు తప్పేలా కనిపించడం లేదు. సాధారణంగా ఏటా జూన్ ఆరంభం నాటికి జిల్లాల్లో వేరుశెనగ విత్తు సిద్ధంగా ఉంచుతారు. అయితే ఈసారి ఎక్కడా 10-20 శాతం కూడా విత్తు సిద్ధం కాలేదు. రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో నైరుతి రుతుపవనాలతో కురిసే వర్షాలు, అంతకు ముందు ఆశించిన వర్షాలు కురిసినా సరే రైతులు వేరుశెనగ సాగుకు సిద్ధమవుతారు. ఈ జిల్లాల్లో వేరు శెనగే ప్రధాన పంట. ఈ ఏడాది ఒక్క అనంతపురం జిల్లాలోనే 5 లక్షల హెక్టార్లలో వేరుశెనగ సాగుచేస్తా రని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. ఈ మేరకు విత్తును సిద్ధంచేసి మండలాలకు పంపాల్సి ఉంది.

వేరుశెనగ విత్తును పరిశీలిస్తున్న అధికారులు

ఇప్పటి వరకు ఎన్నికల హడావిడితో అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోలేదు.

అన్ని జిల్లాల్లో అంతంతే..

సాధారణంగా నాలుగైదు ప్రభుత్వ సంస్థల ద్వారా విత్తు సేకరణ జరుపుతుంటారు. ఇందులో ప్రధా నంగా ఏపీ ఆయిల్‌ఫెడ్, ఏపీ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ(ఏపీ సీడ్స్)లే ఎక్కువ విత్తును సిద్ధం చేస్తాయి. ఈ సంస్థలు కూడా ముందుగానే విత్తు అందజేసే సరఫరాదారులతో ఒప్పందం చేసుకుంటాయి. ఆయా సరఫరాదారులు రైతుల నుంచి విత్తు సేకరించి, దానిని శుద్ధిచేసి (ప్రాసెసింగ్ చేసి), వాటి నాణ్యత పరిశీలించిన తర్వాత బ్యాగుల్లో నింపి, మండలాల వారీగా పంపిణీ చేసే గోదాములకు తరలిస్తారు. అయితే ప్రస్తుతం ఈ తంతు వేగంగా సాగడం లేదు. అనంతపురం జిల్లాలో 3 లక్షల క్వింటాళ్ల విత్తు అవ సరం కాగా ఇప్పటి వరకు 57 వేల క్వింటాళ్ల విత్తు మాత్రమే సిద్ధమైంది. కర్నూలులో 60 వేల క్వింటా ళ్లకు 10 వేలు, చిత్తూరులో 60 వేలకుగాను 17 వేలు, కడపలో 32 వేల క్వింటాళ్లకుగాను 5 వేల క్వింటాళ్ల విత్తు మాత్రమే సిద్ధం చేశారు. ఏటా జూన్ ఆరంభం లోనే విత్తు పంపిణీ మొదలయ్యేది. ఈ ఏడాది మాత్రం జాప్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ధర ఖరారు ఎప్పుడు?

సరఫరాదారులు అందజేసే విత్తు ధర క్వింటాకు రూ. 6,500 ఖరారు చేశారు. బయటి మార్కెట్‌లో శుద్ధి చేయని విత్తు ధర రూ.6,200 వరకు ఉంది. దీంతో సర ఫరాదారులు ఎక్కువ ధర కోరుతున్నారు. దీనిపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. మరోవైపు రైతులకు ఎంత మేర సబ్సిడీ ఇస్తారనేది కూడా నిర్ణయిం చాల్సి ఉంది. గతంలో 33 శాతం సబ్సిడీ ఇచ్చేవారు. గత ఏడాది మాత్రం 40 శాతం సబ్సిడీ ఇచ్చారు.

గంజాయి విజృంభణ!

- ఏటా రూ.7,200 కోట్ల విలువైన సరకు రవాణా!
- విశాఖ జిల్లాలో విస్తరిస్తున్న మాఫియా

ఈనాడు, విశాఖపట్నం: తెలుగు రాష్ట్రాల్లో భారీ మొత్తంలో ఎక్కడ గంజాయి పట్టుబడ్డా దాని మూలాలు విశాఖ జిల్లాలోనే ఉంటున్నాయి. ఇక్కడ నుంచి దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు యథేచ్ఛగా రవాణా అవుతున్నా అడ్డుకోవడానికి పకడ్బందీ వ్యవ స్థలు లేకపోవడం మాఫియాకు, స్మగ్లర్లకు అనుకూ లంగా మారింది. విశాఖ జిల్లా నుంచి ఏటా తరలు తున్న గంజాయి విలువ రూ.7,200 కోట్ల వరకూ ఉంటుందని తెలుస్తోంది.

- గంజాయి రవాణాను అడ్డుకోవడానికి ఎక్సైజ్‌శా ఖకు ప్రత్యేకంగా చెక్‌పోస్టులంటూ ఏమీ లేవు. కనీసం ఐదు చెక్‌పోస్టులన్నా ఉండాలన్న ప్రతిపాదన ఏళ్లతర బడి పెండింగులోనే ఉంది. కొద్దినెలల కిందట చెక్‌పోస్టుల నిర్మాణానికి రూ.25లక్షల నిధులు మంజూరయినా.. ఎక్కడ ఏర్పాటుచేయాలన్న అంశాన్ని ఇంకా ఖరారు చేయలేదు. అవసరమైన అద నపు పోస్టుల మంజూరు ప్రక్రియ చేపట్టలేదు.

ఆయుధాలున్నా ఉపయోగించలేక..

ప్రభుత్వం ఎక్సైజ్‌శాఖ అధికారులకు తుపాకులను అందజేసింది. ఉద్యోగులు శిక్షణ సమయంలో తప్ప వాటిని ఎప్పుడూ ఉపయోగిం చిన పరిస్థితి లేదు. వాటిని భద్రపరచడం కష్టతరంగా మారడంతో చాలావరకూ తుపాకులను పోలీసు శాఖకు అప్పగించేశారు. ఎక్సైజ్ అధికారులకు కూడా పోలీసు అధికారులకు ఇచ్చే పిస్టల్స్‌ను ఇవ్వాలన్న ప్రతిపాదన ఉన్నా..కార్యరూపం దాల్చలేదు.

- విశాఖ ఏజెన్సీలో 11 మండలాలు ఉండగా కేవలం నాలుగుచోట్లే ఎక్సైజ్ పోలీసుస్టేషన్లు ఉన్నాయి. ఆయా స్టేషన్లలో 50 మంది సిబ్బంది కూడా అందుబా టులో లేరు. వీరికి అదనంగా మరో నాలుగు మొబైల్ పార్టీలు వివిధ ప్రాంతాల్లో తిరుగుతున్నాయి. గంజా యిని తరలించడానికి 28 రహదారి మార్గాలను, 13 నద కదారులను స్మగ్లర్లు వినియోగిస్తున్నట్లు ఎక్సైజ్ అధి కారులు తేల్చారు. కానీ.. అరకొరగా ఉన్న సిబ్బంది ఏమార్గంలో కాపుకాశారన్న విషయాన్ని స్మగ్లర్లు ముందు గానే పసిగట్టి ఇతర మార్గాల్లో తరలిస్తున్నారు.

అక్రమ సాగు, రవాణాను అరికట్టాలంటే

- గ్రామ రెవెన్యూ వ్యవస్థను పటిష్ఠ పర చాలి. ఆయా గ్రామా లలో ఎవరైనా గంజాయి సాగు చేప డితే సంబంధిత గ్రామ అధికారులను బాధ్యు లను చేసేలా చర్యలు అవసరం.
- ఏజెన్సీ ప్రాంతంలో మండలానికి ఒక ఎక్సైజ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలి. తగినంత సిబ్బందిని సమకూర్చాలి.
- గంజాయి సాగవు తున్న భూములు ఎక్కువ అటవీశాఖ పరిధిలో ఉన్నా వారు చూసీచూడనట్లు వది లేస్తున్నారన్న ఆరోప ణలు ఉన్నాయి. ప్రభుత్వం ప్రధానంగా దీనిపై దృష్టి పెట్టాలి.
- కనీసం వందమం దితో కూడిన ప్రత్యేక టాస్క్‌ఫో ర్స్‌ను ఏర్పాటు చేసి..నిత్యం వారితో నిఘా పెట్టిస్తూ..ఆకస్మిక దాడులు చేసేలా చర్యలు తీసుకో వాలని నిపుణులు సూచిస్తున్నారు.

శీతలగిడ్డంగి కూలడంతో బయటకు కనిపిస్తున్న బస్తాలు

దుగ్గిరాలలో కూలిన శీతలగిడ్డంగి

దుగ్గిరాల, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా దుగ్గిరాలలో ఆదివారం జీవీఆర్ శీతలగిడ్డంగి (కోల్డ్‌స్టోరేజి) కుప్పకూలిపోయింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో కూలీలు బస్తాలు తీస్తున్న సమయంలో ఆరో అంతస్తు శ్లాబ్ కొంతమేరకు పెచ్చులుగా పడిపోయింది. మరికొంత శ్లాబు బస్తాలపై వాలిపోయింది. దీంతో అక్కడ పనిచేస్తున్న కూలీ లంతా అప్రమత్తమై బయటకు పరుగులు తీశారు. తిరిగి సాయంత్రం 4 గంటల సమయంలో ఆరో అంతస్తులోని ఇంకొంత భాగం కూలి పోయింది. ఇందులో పసుపు, మొక్కజొన్న బస్తాల నిల్వలు ఉన్నాయి. శీతలగిడ్డంగిలో మొత్తం 42 వేల బస్తాలను నిల్వచేశారు. ప్రస్తుతం కూలిన శ్లాబ్ కింద సుమారు 2000 బస్తాలు ఉన్నాయి. మిగిలినవి లాట్లుగానే ఉన్నాయని శీతలగిడ్డంగిని లీజుకు తీసుకున్న పోతిరెడ్డి చెప్పారు. కోల్డ్‌స్టోరేజి కూలిన ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం సంభ వించలేదన్నారు. సోమవారం నుంచి కోల్డ్ స్టోరేజీలో ఉంచిన సర కును సంబంధిత రైతులకు తిరిగి ఇచ్చేస్తామని ఆయన చెప్పారు.

Eenadu epaper

Downloaded from Play Store: Todays News Paper Telugu

విజయవాడ
ఆదివారం జూన్ 3, 2018

మా చిరునామా: వారెవ్వా! ఈనాడు
ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501 512

varevva@eenadu.in

వారెవ్వా!

ఈనాడు 7

చెప్పే గోడలు!

చరవాణిని ఎదురుగా ఉన్న బొమ్మపై పెడితే ఆ బొమ్మ గలగల మాట్లాడితే... కథలు చెబితే ఎంత ఆశ్చర్యం..? తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్యాత్మికతలో సాంకేతికతను మిళితం చేసి... భక్తజనాన్ని మధురానుభూతిలో ముంచేస్తోంది. "ఆగ్‌మెంటెడ్ రియాలిటీ టెక్నాలజీ" ద్వారా పద్మావతి శ్రీనివాస కల్యాణాన్ని భక్తులకు కళ్లకు కడుతోంది. దీనికి వేదిక తిరుచానూరు. ఓ దేవాలయంలో ఇలాంటి ప్రదర్శన ఏర్పాటుచేయడం దేశంలోనే తొలిసారి.

తిరుమల దర్శనానంతరం తిరుచానూరులో పద్మావతీ అమ్మవారిని దర్శించుకోకుండా వెనుదిరగరు భక్తులు. అలాంటి అమ్మ సన్నిధిలోని ప్లైడ్ గార్డెన్‌లో ఆగ్‌మెంటెడ్ రియాలిటీ టెక్నాలజీ ప్రదర్శనతో భక్తులను కట్టిపడేస్తోంది తితిదే. మొత్తం 31 వినైల్ బోర్డుల్లో పద్మావతి, శ్రీనివాస కల్యాణంలోని ప్రధాన ఘట్టాలను చూపిస్తున్నారు. దానికిందనే తెలుగులో ఆ బోర్డు చెప్పే అంశాన్ని పొందుపరిచారు.

ఏం చేయాలంటే...

గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి పద్మావతి పరిణయం అని టైపు చేస్తే ఓ యాప్ వస్తుంది. దాన్ని ఫోన్లో డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత 31 బోర్డుల్లోని మొదటి బోర్డు వద్దకు వెళ్లి... అక్కడున్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చాలు... ఇక బోర్డులు కథలు చెప్పడం మొదలుపెడతాయి. ఒక్కో బోర్డులో 20 నుంచి 40 సెకన్ల వరకు కథాంశం ఉంటుంది. దానికి ఎదురుగా 6 అడుగుల దూరం వరకు నిలబడి సెల్‌ఫోన్ చూపితే చాలు. వెంటనే అందులో ఉన్న క్యారెక్టర్లు మాట్లాడతాయి. అమ్మవారి జననం నుంచి కల్యాణం వరకు ప్రతి ఘట్టాన్నీ వివరిస్తాయి.

- ప్రాజెక్టుకు సుమారు రూ.15 లక్షల ఖర్చు అయింది. దిల్లీ, నెల్లూరుకు చెందిన ఇద్దరు దాతలు దీని బాధ్యతను తీసుకున్నారు. ఇక ఏ బోర్డులో ఏ ఘట్టం ఉండాలి. దేంతో ప్రారంభించాలి? దేంతో ముగించాలనే విషయాలకు జేఈవో లక్ష్మీకాంతం రూపకల్పన చేశారు. సరికొత్త సింట్రిల్లా సాంకేతికత సాయంతో హైదరాబాద్‌కు చెందిన సంస్థ దీన్ని రూపొందించింది. గత శుక్రవారం నుంచి ఈ ప్రదర్శన అందుబాటులోకి వచ్చింది.

- శివ మావూరి, తిరుపతి

మంచుకొండల్లో మేమున్నామని!

ఊరు గాని ఊరులో మనవాళ్లు తారసపడితే ఆనందం. మన కష్టాన్ని గుర్తించి ఆప్యాయంగా ఆదరిస్తే అంతకన్నా కావాల్సిందేముంది. ఇలాంటి అదృష్టం ఏ పొరుగూరులోనో కాకుండా.. అమర్‌నాథ్ యాత్రా మార్గంలో కలిగితే.. చిదానందం.. సదానందం..! అమర్‌నాథ్ యాత్రకు వెళ్తున్న తెలుగువారి కోసం తెలుగువాళ్లు ఓ మహత్కార్యం నిర్వహిస్తున్నారు. అమరనాథుడిని దర్శించడానికి వచ్చిన భక్తులకు తెలుగింటి వంటలు వండి, వడ్డిస్తున్నారు.

2010 అమర్‌నాథ్ యాత్రా సమయం. సిద్దిపేట నుంచి 45 కుటుంబాలు మంచుకొండలకు బయల్దేరాయి. సాఫీగా సాగుతున్న వారి యాత్రలో వాతావరణం అనూహ్య మార్పులు తీసుకొచ్చింది. ప్రతికూల పరిస్థితులతో యాత్రికులంతా వారం రోజుల పాటు బేస్ క్యాంప్‌లోనే ఉండాల్సి వచ్చింది. పరిసరాల్లో పండారాలు (ఉచిత భోజన కేంద్రాలు) ఎన్నో ఉన్నా.. వీరి ఆకలిని తీర్చలేకపోయాయి.

షడ్రసోపేతం.. 2011 నుంచి ఈ సమితి సేవలు ప్రారంభమయ్యాయి. నాటి నుంచి మంచు కొండల్లో మన భోజనం అందుబాటులోకి వచ్చింది. మొదటి ఏడాది బాల్తాల్ బేస్‌క్యాంప్‌లో ఉచిత అన్నదాన కేంద్రం ఏర్పాటు చేశారు. ఉచితం అనగానే.. పచ్చడి మెతుకులు, పచ్చిపులుసు అనుకునేరు! యాత్ర జరిగినన్ని రోజులూ షడ్రసోపేతమైన భోజనం అందిస్తారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నిర్విరామంగా అన్నదానం కొనసాగుతూనే ఉంటుంది. ఉదయం పాలు, టీతో పాటు ఇడ్లీ, ఊతప్పం, దోసె, ఉప్మా, పూరి వంటి ఘనమైన అల్పాహారం అందిస్తారు. మధ్యాహ్నం భోజనంలోకి ఆవకాయ, పప్పు, సాంబారు, పెరుగు, స్వీటు, అప్పడం వడ్డిస్తారు. నాణ్యత, రుచితో కూడిన భోజనం అందిస్తూ.. అందరి ఆకలి తీరుస్తున్నారు. 2013 నుంచి పహల్గామ్ దారిలోని పంచతరణి దగ్గర కూడా అన్నదాన కేంద్రం ఏర్పాటు చేశారు. బాల్తాల్ క్యాంప్‌లో 8వ లంగరు (భోజనశాల), పంచతరణి దగ్గర 2వ లంగరులో అన్నదానం చేస్తున్నారు.

ఉత్తరాది వంటకాలు జిహ్వకు రుచించలేదు కొందరికి. పడలేదు ఇంకొందరికి. ఏదోలా మంచు లింగాన్ని దర్శించుకొని తిరుగు ప్రయాణం అయ్యారు. యాత్రానుభవాన్ని తలచుకొని.. తమలా ఇంకెందరు ఇలా బాధపడుతున్నారో అనుకున్నారు. ఆ క్షణంలోనే అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు.

బృందసేవాగానం.. ఈ మహా క్రతువును నిర్వహించడానికి అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి బృందాలుగా ఏర్పడింది. యాత్ర మొదలైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు ఒక్కో బృందం 10-15 రోజుల వరకు అక్కడే ఉంటారు. ఆ బృందం వచ్చే సమయానికి మరో బృందం సేవకు బయల్దేరుతుంది. ఇలా యాత్ర జరిగినన్ని రోజులు.. తెలుగు యాత్రికులకు సేవలందిస్తుంటారు. ఇక్కడ భోజనానికి వచ్చిన యాత్రికులు కూడా.. కాసేపు వడ్డనలో భాగస్వాములు అవుతుంటారు.

- క్రాంతికుమార్ కొలిశెట్టి, సంగారెడ్డి

బొట్టు పట్టి సాధించారు!

ఎందుకంటే... ఆయనకు తెలుసు
భారతదేశంలో 33 కోట్ల మంది ప్రజలు నీటికోసం అలమటిస్తున్నారు.

ఎందుకంటే... ఆయనకు తెలుసు
తాను నివసించే ముంబయి నగరంలో 40 శాతం నీరు కేవలం నివాస గృహాల్లోనే వృథా అవుతోందని...

ఎందుకంటే... ఆయనకు తెలుసు
బొట్టుబొట్టుగా కారిపోతున్న జలానికి అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తు అంధకారమని, ఇళ్లలో ఉన్న పైపుల్లో, ఉపకరణాల్లో లీకులు లేకుండా చేస్తే ఏటా 20 లక్షల మంది దాహార్తిని తీర్చవచ్చని.

అందుకే ఆయన కంకణం కట్టుకున్నారు...
ప్రతి చుక్కకూ లెక్క కట్టాలని ప్రతి వారికీ ఈ లెక్కను నేర్పాలని...

ఒకటి, రెండు కాదు. 12 ఏళ్లుగా ఆయనకు ఇదే పని. తనతో కలిసి వచ్చే వాళ్లు వస్తున్నా, లేకున్నా ఆయన ఈ దారిలో ముందుకు సాగుతూనే ఉన్నారు. 2007లో ఈ జలోద్యమాన్ని ప్రారంభించిన ఏడాది కాలంలో 1666 గృహాలను సందర్శించారు... అక్కడ వృథా అవుతున్న 4 లక్షల లీటర్ల నీటిని సంరక్షించారు. అదే పుష్కరకాలంలో అక్షరాలా 2 కోట్ల లీటర్ల నీటి వృథాను అడ్డుకున్నారు.

అబిద్‌కిప్పుడు 84 ఏళ్లు. ఇప్పుడూ ఆయన తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నారు. అసలు మీకు ఈ పని ఎందుకు చేయాలనిపించిందంటే... తన చిన్ననాటి రోజులను గుర్తు చేసుకుంటారు. 'గుజరాత్‌లోని పవేరా మా ఊరు. అక్కడ మా అమ్మ బిందె నీళ్ల కోసం పడ్డ కష్టం గుర్తుంది. ఈ మహానగరంలో ఎందరో తల్లుల పోరాటం చూస్తున్నాను. వారి కోసం నా ఈ చిన్న ప్రయత్నం' అంటూ వివరిస్తారాయన.

ఇది పుష్కర కాలం నాటి మాట...

ముంబయి నగరంలో ఓ స్నేహితుడి ఇంట్లో కూర్చుని ఉన్నాడు 72 ఏళ్ల అబిద్ సూర్తి.

ఆయన ఉన్నదేమో హాల్‌లో...

అందరూ ఆహ్లాదంగా మాట్లాడుకుంటున్నారు. కానీ అబిద్ చెవులకు మాత్రం మరో శబ్దం వినిపిస్తోంది. టప్..టప్...మంటూ... ఎక్కడో నీరు లీకవుతోంది. అక్కడ నీరు కారుతోంది చుక్కలుగా... కానీ అబిద్‌కు మాత్రం ఆ చుక్క నీరు కింద పడ్డ శబ్దం తనను ఎవరో సుత్తితో మొదినట్లు అనిపిస్తోంది. ఆ కారిపోతున్న నీటిపై ఆయనకున్న అవగాహన ఆయనను క్షణం కూడా నిలబడనీయడం లేదు. వెంటనే తన స్నేహితులైన ఆ ఇంటి యజమానులతో చెప్పి ప్లంబర్‌ను పిలిపించి... పైపులు, లీకులు అన్నీ బాగు చేయించి... ఆ ఇంట్లో ఒక్క చుక్క నీరు కూడా వృథా కాలేదని నిర్ధరించుకున్న తర్వాత అక్కడి నుంచి బయలుదేరారు.

కానీ ఆయనను ఆలోచనలు మాత్రం వెంటాడుతున్నాయ్... ఇంత మహానగరంలో ఎన్ని ఇళ్లలో... ఎన్ని లక్షల లీటర్ల నీళ్లు వృథా అవుతున్నాయో... వాటికి అడ్డుకట్ట వేయడం ఎలా?

దీనికోసం తానేం చేయాలి...?

అక్కడే మొదలైందో బృహత్ ప్రయత్నం.

ఉన్నది చిన్న లీకేజీనే... సెకను ఒక బొట్టు కింద పడుతోంది.

దీని ఫలితమేంటో తెలుసా? నెలకు వెయ్యి లీటర్లు వృథా. దీంతో ఒక కుటుంబం నెల రోజుల పాటు హాయిగా గడపొచ్చు. సమస్య చిన్నదే కదా అని వదిలేస్తే అదే జటిలమవుతుంది. భవిష్యత్తులో అతి తీవ్ర సమస్యలకు కారణమవుతుంది.

ఈ విషయాన్ని ప్రజలందరికీ చెప్పాలి... వారికి అవగాహన కల్పించాలి.

దీనికోసం ఒంటరిగానే అడుగు ముందుకేశారు. తన కార్యక్రమాలకు ఓ వేదిక ఉండాలని భావించారు. డ్రాప్ డెడ్ ఫౌండేషన్ అంటూ పేరుపెట్టారు. సేవ్ డ్రాప్...ప్రతి చుక్కనూ రక్షించుకుందాం అంటూ ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పడం మొదలుపెట్టారు.

స్నేహితులు... వారి స్నేహితులు, బంధువులు... వారి ఆత్మీయులు... ఇలా తెలిసిన, తెలియని వారి ఇళ్లకూ వెళ్లేవారు. అలా వెళుతూ ఓ ప్లంబర్‌ను కూడా తీసుకెళ్లేవారు.

చుక్కలుగా కారిపోతున్న నీటిని ఒడిసి పట్టాలని చెప్పడం... అలా చేయకపోతే జరిగే నష్టాలను చెప్పి వారికి అవగాహన కల్పించడం. ఇల్లంతా వెదికి ఎక్కడైనా నీరు వృథా అవుతుంటే దాన్ని బాగుచేయించడం... ఇదీ అబిద్ రోజువారీ జీవితం.

మొదట్లో ఎవరింటికైనా వెళితే 'నీకెందుకింత బాధ అబిద్ భాయ్... ఏదో ఓ చుక్క పోతే ఏమవుతుంది?' అని అనేవాళ్లు.

అబిద్ వారిని నీటి సంరక్షణ ఫలితాన్ని వివరించేవారు. నొప్పించకుండానే వారిని ఒప్పించేవారు. వారి ఇంట్లో లీకేజీలను తన డబ్బుతో బాగు చేయించేవారు. ఫలితంగా ఆయన సందర్శించిన ప్రతిచోటా అవగాహన. ఓ జల చేతన. ఆయన అవగాహన కల్పించిన ప్రతి చోటా నీటిని బంగారంలా వాడుకుంటున్నారు. భద్రంగా కాపాడుకుంటున్నారు. అబిద్ మంచి పెయింటర్. రచయిత కూడా కావడంతో ఆసక్తికరమైన పోస్టర్లు, సందేహాలతో కట్టిపడేస్తున్నారు. మసీదుల్లో, గుళ్లలో, అపార్టుమెంట్లలో ఆయన పోస్టర్లు ఎంతో మందిని ఆలోచింపజేస్తుంటాయి. వాటికి స్పందించి నీటి వృథా చేయకుండా ఉన్నవారు వేల సంఖ్యలో ఉన్నారు.

వారధి కట్టిన రాముడు

ఎవరో రావాలని, ఏదో చేయాలని అనుకోలేదాయన. నేనెందుకు చేయకూడదని సంకల్పించుకున్నాడు. నలుగురినీ తన వెంట నడిచేలా చేశాడు. అందుబాటులో ఉన్న వనరులతో వారధి నిర్మించి ఔరా! అనిపించుకున్నాడు.

ఆదిలాబాద్ జిల్లా బేల మండలం మణియపూర్ గ్రామవాసి కడు గంగారాం. ఊరి పొలిమేరలోనే పదికరాల పొలం ఉంది. వాగు పక్కనున్న చేలు. నీటి వనరులున్న నేల కావడంతో బంగారం పండుతుంది. కనుచూపుమేరలో ఉన్న పొలానికి వెళ్లాలన్నా.. వెంటనే సాధ్యమయ్యేది కాదు. ఆరు కిలోమీటర్ల నడవాల్సిందే. మధ్యలో వాగు అడ్డుగా ఉండటంతో చుట్టూ తిరిగి చేలకు వెళ్లాల్సి వచ్చేది. ఈ సమస్య గంగారాం ఒక్కడిదే కాదు.. వాగుకు ఆవలి ఒడ్డునున్న రైతులందరిదీ.

వర్షాకాలం వచ్చిందంటే వాగులో ఆరునెలల పాటు నీరు ప్రవహిస్తుంటుంది. చెంతనే పెన్‌గంగా ఉండటంతో.. బ్యాక్‌వాటర్ వచ్చి వాగులో చేరుతుంటుంది. ఫలితంగా.. వాగు దాటడం కష్టంగా మారుతుంది. దీంతో రైతులు పొలాలకు వెళ్లాలంటే.. పక్క గ్రామంలో నుంచి వెళ్లాల్సి వచ్చేది. రహదారి సౌకర్యం లేకపోవడంతో.. బురదలో దిగబడుతూ ఇబ్బందులు పడేవారు. దశాబ్దాలుగా ఉన్న ఈ సమస్యను ఏడు పదుల వయసున్న గంగారాం పరిష్కరించాడు. దూరాభారాన్ని తగ్గించడానికి వాగుపై వారధి నిర్మించాలనుకున్నాడు.

తోటి రైతుల సాయంతో రంగంలోకి దిగాడు గంగారాం. వంతెన నిర్మించడానికి అందుబాటులో ఉన్న వనరులు సేకరించారు. వృథాగా ఉన్న విద్యుత్ తీగలను కొనుగోలు చేశారు. సిమెంట్ స్తంభాలు, ఇనుప రాడ్లు, దృఢమైన కర్రలు, ఇనుప రేకులను తీసుకున్నారు. తొలుత వంద మీటర్ల వెడల్పున్న వాగుకు ఇరువైపులా పిల్లర్లు ఏర్పాటు చేసి విద్యుత్ తీగలను లాగారు. తీగలకు ఆసరాగా వాగులో కర్రలతో, ఇనుప స్తంభాలతో పిల్లర్లు ఏర్పాటు చేశారు. చివరగా పిల్లర్ల మధ్య తీగలు లాగి.. వాటిపై రేకులను పరిచారు. ఈ వారధి కట్టి పుష్కర కాలం దాటిపోయింది. 2006లో నిర్మించిన వంతెన.. ఇన్నేళ్లలో ఎన్ని వరదలు వచ్చినా తట్టుకొని నిలబడింది. ఎందరో రైతులకు పొలం బాటయింది. 'ఈ రాముడే పూనుకోకపోతే.. మా కష్టాలు నేటికీ తీరేవి కావ'ని అంటారు కడు గ్రామ రైతులు.

- దూస సంజీవ్‌కుమార్, ఆదిలాబాద్ డెస్క్

Eenadu epaper

Downloaded from Playstore: Todays NewsPaper Telugu

ఈనాడు సినిమా

భాగ్యనగరంలో 'ఆర్ ఆర్ ఆర్' పోరాటాలు

ఎన్టీఆర్, రామ్‌చరణ్

కథానాయకులు ఎన్టీఆర్, రామ్‌చరణ్ గాయాల నుంచి కోలుకున్నారు. 'ఆర్ ఆర్ ఆర్' కోసం మళ్లీ వరుసగా రంగంలోకి దిగుతున్నారు. అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో, డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన సెట్‌లో రాత్రివేళల్లో పోరాట ఘట్టాల్ని తెరకెక్కిస్తున్నారు. ఎస్.ఎస్.రాజమౌళి సినిమాల్లో ప్రతి పోరాట ఘట్టం చిన్న సైజు యుద్ధంలా ఉంటుంది. అలాంటి సన్నివేశాల్నే ప్రస్తుతం చిత్రీకరిస్తున్నట్టు సమాచారం. ఎన్టీఆర్ ఇప్పటికే రంగంలోకి దిగగా, కుటుంబంతో కలిసి ఇటీవలే విదేశీ పర్యటనని ముగించుకొని వచ్చిన చరణ్ కూడా త్వరలోనే చిత్రబృందంతో కలవనున్నారు. చీలమండ గాయంతో చరణ్, చేతి గాయంతో ఎన్టీఆర్ కొన్నాళ్లపాటు చిత్రీకరణకి దూరమయ్యారు. వాళ్లిద్దరూ కోలుకొని రంగంలోకి దిగడంతో చిత్రీకరణలో వేగం పెరిగే అవకాశం ఉంది. ఇందులో కొమరం భీమ్‌గా ఎన్టీఆర్, అల్లూరి సీతారామ రాజుగా రామ్‌చరణ్ నటిస్తున్న విషయం తెలిసిందే. రూ.300 కోట్ల పైచిలుకు వ్యయంతో రూపొందుతున్న ఈ సినిమా 2020 జులై 30న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

మళ్లీ జంటగా నటిస్తారా?



రవితేజ

శ్రుతిహాసన్

రవితేజ - శ్రుతిహాసన్ జోడీ 'బలుపు' చిత్రంతో ఆకట్టుకుంది. రవితేజ శైలి మాస్ అంశాలకి శ్రుతిహాసన్ అందచందాలు తోడవ్వడంతో ఆ చిత్రం ప్రేక్షకులకి వినోదం పంచింది. విజయవంతమైన జోడీగా పేరు తెచ్చుకున్నారు ఇద్దరూ. ఆ కలయికలో మరో చిత్రం రూపొందనున్నట్టు సమాచారం. 'బలుపు'ను తెరకెక్కించిన గోపీచంద్ మలినేని దర్శకత్వంలో మరో చిత్రం చేయడానికి రవితేజ ఇటీవలే అంగీకారం తెలిపారు. త్వరలోనే ప్రారంభం కానున్న ఆ సినిమాలో నాయికగా శ్రుతిని ఎంపిక చేసుకొనే ఆలోచనలో చిత్రబృందం ఉందట. 'కాటమరాయుడు' తర్వాత శ్రుతి తెలుగులో సినిమా చేయలేదు. కొన్నాళ్లుగా సంగీతంపైనే దృష్టి పెట్టిన ఆమె ఇటీవలే తమిళంలో ఓ చిత్రం కోసం రంగంలోకి దిగింది. తెలుగులోనూ సినిమాలు చేయడానికి ఉత్సాహంగా ఉంది. ప్రస్తుతం రవితేజ 'డిస్కో రాజా' చిత్రంతో బిజీగా గడుపుతున్నారు.

హంతకుడి కోసం వేట

విజయ్ ఆంటోనీ, ఆషిమా

విజయ్ ఆంటోనీ, అర్జున్ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'కిల్లర్'. ఆషిమా కథానాయిక. ఆండ్రూ లూయిస్ దర్శకుడు. టి.నరేష్ కుమార్, టి.శ్రీధర్ నిర్మాతలు. ఈనెల 7న విడుదల అవుతోంది. నిర్మాతలు మాట్లాడుతూ "విజయ్ ఆంటోనీ, అర్జున్ పాత్రలు పోటాపోటీగా ఉంటాయి. ఓ హంతకుడి కోసం పోలీస్ అధికారి సాగించిన వేట ఇది. ఆ హంతకుడు ఎవరు? తను అలా ఎందుకు మారాడు? అనేవి ఆసక్తికరం. ప్రచార చిత్రాలకు మంచి స్పందన వస్తోంది. సైమన్ సంగీతం ప్రధాన ఆకర్షణ" అన్నారు.

సామాజిక చిత్రాలైతే మరింత కష్టపడతా!

కరీనా కపూర్

కరీనా కపూర్ ఏళ్ల తరబడి ప్రేక్షకుల్ని అలరిస్తుందంటే కారణం ఆమె ఎంచుకునే పాత్రలే. మాస్ ప్రేక్షకుల్ని మెప్పించే కమర్షియల్ పాత్రల్లోనే కాదు.. సామాజిక అంశాల నేపథ్యంలో సాగే చిత్రాల్లోనూ ఆమె తనేంటో నిరూపించుకుంది. 'ఉడ్తా పంజాబ్', 'కీ అండ్ క', 'వీరె ది వెడ్డింగ్' చిత్రాల్లో వైవిధ్యమైన నటనతో ప్రేక్షకులకు మరింత దగ్గరైంది కరీనా. ప్రస్తుతం ఆమె నటిస్తున్న 'గుడ్ న్యూస్', 'అంగ్రేజీ మీడియం' కూడా సామాజిక నేపథ్యంతో సాగే చిత్రాలే. ఈ తరహా చిత్రాల కోసం తను మరింత కష్టపడాతనంటోంది కరీనా. "సామాజిక నేపథ్య చిత్రాలు, మనసుని కదిలించే కథాంశాలు ఉన్న చిత్రాల్లో నటించేటప్పుడు మరింత ఏకాగ్రతతో పనిచేస్తాను. అలాంటి చిత్రాల్లో చిన్న పాత్రైనా సరే కష్టపడతాను. బలమైన కథ ఉంటేనే ప్రేక్షకులు ఆదరిస్తున్న రోజులవి. 'గుడ్ న్యూస్' బాగా వచ్చింది. అక్షయ్ కుమార్ ఈ చిత్రానికి మరింత బలం" అంది కరీనా.

దర్శకుడిగా సంతృప్తినిచ్చింది

శ్రీరాఘవ

'7 జీ బృందావన కాలనీ', 'ఆడవారి మాటలకు అర్థాలే వేరులే' తరవాత అంతటి సంతృప్తినిచ్చిన చిత్రమిదే" అన్నారు శ్రీరాఘవ. ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'ఎన్‌జీకే'. సూర్య కథానాయకుడు. రకుల్‌ప్రీత్ సింగ్, సాయి పల్లవి కథానాయికలు. కె.కె.రాధామోహన్ నిర్మాత. ఈ చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో శ్రీరాఘవ మాట్లాడుతూ "కథానాయకుడి పాత్రలోని వైవిధ్యమే ఈ చిత్ర విజయానికి కారణం. సూర్యని తొలి సగం కథానాయకుడిగా, రెండో సగంలో ప్రతినాయకుడిగా చూపించాం. ఆ విధానం అందరికీ నచ్చింది. సమకాలీన రాజకీయాలకు తెర రూపం ఇచ్చాం. వ్యవస్థపై, విధానాలపై, రాజకీయాలపై ఓ సామాన్యుడి పోరాటం ఇది. దర్శకుడిగా నాకు చాలా సంతృప్తినిచ్చింది. రకుల్, సాయి పల్లవిల పాత్రలకూ మంచి ప్రాధాన్యం ఉంది. యువన్ పాటలు విడుదలకు ముందే ప్రేక్షకుల ఆదరణ పొందాయ" న్నారు.

జేడీ చక్రవర్తి

"శృంగారపరమైన సన్నివేశాల వల్లే సినిమాలు ఆడవు. కథాబలం, పాత్రల మధ్య సంఘర్షణ ఉండాల్సిందే. 'ఆర్ఎక్స్ 100', 'అర్జున్‌రెడ్డి' అలాంటి చిత్రాలే" అన్నారు జేడీ చక్రవర్తి. చాలా కాలం తరవాత తెలుగులో ఆయన నటించిన చిత్రం 'హిప్పీ'. ఈవారంలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా జేడీ చక్రవర్తి ఆదివారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు.

డబ్బు కోసం సినిమాలు చేయను

● "ఈ మధ్య తెలుగులో నాకు చాలా అవకాశాలొచ్చాయి. ఏ కథా నన్ను ఉత్సాహపరచలేదు. 'హిప్పీ' మాత్రం ఆకట్టుకుంది. ఇందులో ప్లేబాయ్ తరహా పాత్రలో నటిస్తున్నా. కార్తికేయ చాలా బాగా నటించాడు. దర్శకుడు కృష్ణ 'హిప్పీ'ని మలిచిన తీరు ఆకట్టుకుంటుంది"

● "ప్రేమకూ, ఆకర్షణకూ తేడా తెలియజెప్పే చిత్రమిది. సెన్సార్ వాళ్లు 'ఎ' సర్టిఫికెట్ ఇచ్చారు. ఈ సినిమాలో ఉన్న ముద్దులు చూసే ఆ సర్టిఫికెట్ ఇచ్చారని నేను అనుకోవడం లేదు. సినిమాలో చెప్పాలనుకున్న అంశాన్ని ఎలాంటి మొహమాటం లేకుండా సూటిగా చెప్పారు. సెన్సార్ నిబంధనల గురించి తరచూ చర్చ జరుగుతూనే ఉంది. అధికారులు చట్టంలో ఏముందో అదే చేస్తున్నారు. వాళ్ల తప్పేం లేదు. ముందు నిబంధనలు మార్చాలి. సెన్సార్ వాళ్లు కొత్త పుస్తకం రాసుకుంటే ఈ సమస్యలు తగ్గుతాయి".

● "మా గురువు రాంగోపాల్ వర్మ డబ్బులు సంపాదించడం తప్ప అన్నీ నేర్పారు. డబ్బుల కోసం నేను సినిమాలు చేయను. 'రేపటి షూటింగ్ ఎలా ఉండబోతోంది' అనే ఉత్సాహం కలిగించే సినిమాల్లోనే నటిస్తాను. ఏ నటుడికైనా తన సినీ జీవితంలో గొప్పగా చెప్పుకునేందుకు కనీసం అయిదు సినిమాలైనా ఉండాలట. నా కెరీర్‌లో కూడా అలాంటి అయిదు మంచి చిత్రాలున్నాయి. ఆ తృప్తి చాలు"

● "హాలీవుడ్‌లో కొన్ని పాత్రల చుట్టూ కథ నడుస్తుంది. కానీ తెలుగులో హీరో చుట్టూ కథ తిరుగుతుంది. అందుకే ఇక్కడ గుర్తుండిపోయే పాత్రలు దొరకడం లేదు. తమిళం, కన్నడ భాషల్లో నేను నటిస్తున్న చిత్రాలు విడుదలకు సిద్ధమయ్యాయి. త్వరలోనే వర్మ నిర్మాణంలో నేను హీరోగా నటిస్తాను"

ఆది ఆట

ఆది పినిశెట్టి

ఆది పినిశెట్టి కథానాయకుడిగా తెలుగు, తమిళ భాషల్లో ఓ చిత్రం తెరకెక్కుతోంది. పృథ్వీ ఆదిత్య దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఐబీ కార్తికేయన్ నిర్మాత. ఈనెల 12 నుంచి చిత్రీకరణ ప్రారంభం కాబోతోంది. దర్శకుడు మాట్లాడుతూ "స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో సాగే చిత్రమిది. ఓ యువకుడు అథ్లెట్ కావడానికి ఎలా కష్టపడ్డాడు? ఆ ప్రయాణంలో తనకు ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి? సవాళ్లని ఎలా అధిగమించాడనే విషయాల్ని చూపిస్తున్నాం. కథానాయిక పేరు త్వరలో చెబుతామ"న్నారు.

తెలుగమ్మాయిలే కావాలంటున్నారు

పూజిత

తెలుగు తెరపై మెరుస్తున్న మరో తెలుగమ్మాయి పూజిత పొన్నాడ. 'దర్శకుడు', 'రాజుగాడు', 'రంగస్థలం', 'వేర్ ఈజ్ వెంకటలక్ష్మి' చిత్రాల్లో కీలక పాత్రలు పోషించిన పూజిత '7' చిత్రంతో కథానాయికగా మారింది. 'కల్కి'లోనూ నటిస్తోంది. 'సెవెన్' ఈవారంలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో పూజిత చెప్పిన కబుర్లు..

● "నేనో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. అప్పుడప్పుడూ సరదాగా లఘు చిత్రాల్లో నటించేదాన్ని. అవి చూసిన సుకుమార్ గారు 'దర్శకుడు' చిత్రంలో అవకాశం ఇచ్చారు. అలా యాదృచ్ఛికంగా నటిని అయ్యాను. మా కుటుంబంలో సినిమా రంగానికి సంబంధించినవాళ్లెవ్వరూ లేరు. అందుకే సినిమాల్లోకి వెళ్తానంటే ముందు భయపడి వద్దన్నారు. లఘు చిత్రాల్లో నా నటన చూసి కాస్త కరిగారు. చివరికి వాళ్ల ప్రోత్సాహంతోనే సినిమాల్లోకి వచ్చాను. సినిమాల కోసం ఉద్యోగాన్ని కూడా వదులుకున్నాను"

● '7' ఓ సస్పెన్స్ థ్రిల్లర్. రొమాన్స్ కూడా ఉంటుంది. ఇప్పటి వరకూ ఈ జోనర్‌లో చాలా సినిమాలు వచ్చుండొచ్చు. కానీ '7' మాత్రం ప్రత్యేకంగా నిలిచిపోతుంది. ఏడు పాత్రలు, ఏడు జీవితాల్ని తెరపై చూస్తారు. ఆ పాత్రలన్నీ చివరికి ఎలా కలిశాయన్నది ఆసక్తికరం. ఇలాంటి చిత్రంలో అవకాశం రావడం ఆనందంగా ఉంది. కొన్ని మలుపులకు, ప్రశ్నలకు నా పాత్రే సమాధానం చెబుతుంది"

● "ఈ సినిమాలో రొమాన్స్ ఉంటుంది. కానీ అది హద్దుల్లోనే. నేనైతే ముద్దు సన్నివేశాల్లో నటించలేదు. కథ డిమాండ్ చేస్తే అప్పుడు ఆలోచిస్తా. గ్లామర్ అనేది చూపించే విధానాన్ని బట్టి ఉంటుంది. అందంగా, అందరికీ నచ్చేలా చూపించొచ్చు. తెలుగు సినిమాల్లో ఇప్పుడిప్పుడే తెలుగమ్మాయిలకు డిమాండ్ పెరుగుతోంది. 'నాకు తెలుగు అమ్మాయే కావాలి' అని కొంతమంది దర్శకులు అడుగుతున్నారు. నాకొచ్చిన అవకాశాలన్నీ అలాంటివే. 'కల్కి'లోనూ మంచి పాత్ర చేస్తున్నా. నాకు తమిళం వచ్చు. అక్కడి నుంచి రెండు మూడు అవకాశాలొచ్చాయి. '7' తమిళంలోనూ విడుదలవుతోంది".

కాపాడే సింహం కథ

'లయన్ కింగ్'లో ఓ దృశ్యం

మనుషుల్లాగా మాట్లాడే మృగరాజుని ఎప్పుడైనా చూశారా? వేటాడే సింహం... అందుకు భిన్నంగా అడవిలోని ప్రాణులను కాపాడటం గురించి ఎక్కడైనా విన్నారా? అవన్నీ 'లయన్ కింగ్'లో చూడొచ్చు. ప్రఖ్యాత డిస్నీ సంస్థ నుంచి వస్తున్న చిత్రమిది. కామిక్ పుస్తకాల నుంచి పుట్టిన సింబ అనే సింహం కథే ఈ చిత్రం. టిమోన్ అనే ముంగిస, పుంబా అనే అడవి పంది పాత్రలు కీలకం. త్రీడీ యానిమేటెడ్ సాంకేతికతతో రూపొందించిన ఈ చిత్రాన్ని ఈ నెల 19న విడుదల చేస్తున్నారు. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుందని, తెలుగులోనూ ఈ చిత్రం విడుదలవుతోందని డిస్నీ ఇండియా వర్గాలు తెలిపాయి.

Eenadu epaper

Downloaded from Playstore: Todays NewsPaper Telugu

వసుంధర

యాక్సెసరీలపై పూల సోయగం...!

మందారం, గులాబీ, చామంతి, మల్లె...పేరేదైనా ఆకట్టుకునే అందం పూలదే. అలంకరణలో వీటిదే పై చేయి. అందుకే ప్రింట్లు, ఎంబ్రాయిడరీ, రాళ్లతో చేసిన డిజైన్‌వర్క్... ఇలా రూపేదైనా దుస్తులు, నగలపై పూలు హొయలు పోతుంటాయి. ఇప్పుడీ ట్రెండ్...యాక్సెసరీల్లోనూ కనిపిస్తోంది. వాచీలు, బెల్ట్‌లు, షూలు, హ్యాండ్‌బ్యాగ్‌లు...ఇలా అన్నీ పూల సొగసుతో మురిసిపోతున్నాయి. ఆ డిజైన్లలో ఇవి కొన్ని...

ఆ విషయాలు ఏ వయసులో చెప్పొచ్చు?

మా పాపకు పన్నెండేళ్లు. ఇప్పుడిప్పుడే తన శరీరంలో మార్పులు కనిపిస్తున్నాయి. దాంతో వాటి గురించి రకరకాల ప్రశ్నలు వేస్తోంది. వాటికి ఏం సమాధానాలు చెప్పాలో? ఎలా వివరించాలో అర్థం కావడం లేదు. అసలు ఏ వయసు నుంచి వారికి శారీరక మార్పులు, లైంగిక విజ్ఞానం గురించి చెప్పొచ్చు?

– ఓ సోదరి

పిల్లలు ఈ వయసులో తమ శరీరాన్నే కాదు, స్నేహితుల్లో కనిపించే మార్పులను కూడా గమనిస్తారు. ఇప్పుడు వారికి వాటి గురించి తెలుసుకోవాలనే కుతూహలం ఉంటుంది. అబ్బాయిలు అమ్మాయిల గురించి... అమ్మాయిలు అబ్బాయిల గురించి తెలుసుకోవాలనుకుంటారు. ఇది పదేళ్ల నుంచే మొదలవుతుంది. ఈ వయసులో అమ్మాయిల వ్యక్తిగత రహస్య భాగాల్లో కొద్దిగా రోమాలు కనిపించడం, ఛాతీభాగంలో మార్పులు రావడం సర్వసాధారణం. అలాగే అబ్బాయిల్లో నూనూగు మీసాలు, గొంతు మారడం, ఎత్తు పెరగడం వంటివి కనిపిస్తాయి. ఆ వయసు పిల్లలందరిలోనూ ఇవే మార్పులు ఉంటాయి. వాటిని గమనించినప్పుడు వీరికి తెలియకుండానే ఆ విషయాలపై ఆసక్తి పెరుగుతుంది. ఒక ఈడువారంతా బృందంగా మారి తమలో జరుగుతోన్న మార్పుల గురించి చర్చించుకుంటారు. దీన్నే సెక్సువాలిటీ అంటారు.

ఏం చేయాలంటే...

పిల్లలు ఇలాంటి సందేహాలను మీ ముందు ఉంచినప్పుడు 'నీకెందుకు ఇవన్నీ' అంటూ కోప్పడకండి. మీ పాప ఏదైనా ప్రశ్న వేసినప్పుడు దాన్ని దాటేయకండి. వినన్నట్లు ఉండకండి. మీకు తెలిసిందే చెప్పండి. అయితే శాస్త్రీయంగా, అర్థమయ్యేలా చెప్పాలి. ఉదాహరణకు దోమ లార్వా నుంచి ప్యూపా దశకు ఎలా మారుతుందో తెలుసుకునేలా చేయాలి. అదే పరిణామక్రమం మనుషులకూ ఉంటుందని, వయసు ఎదుగుతోన్న కొద్దీ శరీర భాగాలు కూడా పెరుగుతాయని వారికి అవగాహన కల్పించాలి. పదేళ్ల దాటిన తరువాత శారీరక దృఢత్వంతో పాటు ఆడ, మగలో కొన్ని శారీరక, వ్యక్తిత్వ మార్పులు కూడా వస్తాయని, వాటికి కారణం హార్మోన్లేనని తెలియజెప్పి వాటి ప్రాముఖ్యాన్ని వివరించాలి. అలానే నెలసరి గురించి చెప్పాలి కానీ భయపెట్టకూడదు. అది ఎలా మొదలవుతుందో ఆ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఓపికగా వివరించాలి. శుభ్రత పాటించకపోతే వచ్చే అనారోగ్యాల గురించి తెలియజేయాలి. అలాగే బ్యాడ్ టచ్... గుడ్ టచ్ వంటి వాటిపై అవగాహన కల్పించాలి. అనవసరంగా ఎవరైనా శరీరాన్ని తాకితే ప్రతిఘటించడం నేర్పించాలి అయితే అన్నింటినీ ఒకేసారి కాకుండా ఒక్కొక్కటిగా చెప్పడం మంచిది.

డియర్ వసుంధర

డా. మండాది గౌరీదేవి
పిల్లల మానసిక నిపుణురాలు

- మీ సందేహాలను vasukid@eenadu.net కు పంపించగలరు.

నెలసరిగా భావోద్వేగాలు...

● సాధారణంగా ఎంతో ఉత్సాహంగా పనిచేసే ప్రీతి నెలసరి దగ్గర పడితే చాలు... ఇట్టే అలసిపోతుంది. దానికితోడు వాంతులు... ఆమెను నీరసపడిపోయేలా చేస్తాయి. తనని చూస్తే చాలు పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

● ఎప్పుడూ నవ్వుతూ కనిపించే విజయలో ఒక్కసారిగా మార్పు కనిపిస్తుంది. అకారణంగా కోప్పడుతుంది. చిన్నపనికే విసిగిపోతుంది. ఆ క్రమంలో వాటిని సమన్వయం చేసుకోలేక ఒక్కోసారి ఏడ్చేస్తుంది. ఈ పరిస్థితిని ఆమె కుటుంబ సభ్యులు తాత్కాలికమే అని అర్థం చేసుకోగలుగుతున్నారు. ఎందుకంటే ఆమెకు అది నెలసరి సమయం.

వీళ్లనే కాదు... ముప్ఫైఏళ్ల దాటిన కొందరు మహిళల్లో ఇలాంటి సమస్యలు సర్వసాధారణం. నెలసరికి వారం లేదా పది రోజుల ముందు నుంచే ఈ లక్షణాలు కనిపిస్తాయి.

లక్షణాలు:

● వక్షోజాల్లో వాపు, నొప్పి, మలబద్ధకం లేదా విరేచనాలు, కడుపు ఉబ్బరం, కాళ్ల నొప్పులు, తలనొప్పి, అలసట, వాంతులు, వికారం, నిద్ర బాగా పట్టడం లేదా నిద్రలేమి, ఆహారపుటలవాట్లలో మార్పులు, ఏకాగ్రత లోపించడం, కంగారు, బాధ, ఆందోళన... వంటివి ఎదురవుతాయి. మరికొందరిలో కలయిక పట్ల ఆసక్తి కూడా తగ్గుతుంది. ఇవన్నీ పీఎంఎస్‌లో భాగమే.

ఎందుకీ సమస్యలు...

పీఎంఎస్‌కి పెద్దగా కారణాలు అంటూ ఏవీ లేవు. అండం విడుదల జరిగాక ప్రొజెస్టిరాన్ హార్మోన్ల ఉత్పత్తి పెరుగుతుంది. దాంతో నెలసరికి పది లేదా వారం ముందు నుంచి ఈ లక్షణాలు కనిపిస్తాయి. ఈ సమస్య సాధారణంగా ముప్ఫైలలో కనిపిస్తుంది. ఎప్పుడయితే నెలసరి మొదలవుతుందో... ఇవన్నీ అదుపులోకి వచ్చేస్తాయి. అందరిలో అన్ని లక్షణాలు ఉండవు కానీ... ఎప్పుడో ఒక్కప్పుడు ఇబ్బంది పెడతాయి. కొందరయితే తమను తాము నియంత్రించుకోలేక గట్టిగా అరవడం, పిల్లల్ని కొట్టడం వంటివి చేస్తుంటారు. గర్భం దాల్చినప్పుడు, మెనోపాజ్ దశ మొదలయ్యాక ఈ లక్షణాలు కనిపించవు. ప్రతి నలుగురిలో ఇద్దరికి ఈ లక్షణాలు కనిపిస్తాయని చెబుతున్నాయి అధ్యయనాలు.

ఎలా గుర్తించొచ్చు...

మూడు నెలసరుల తరువాత కూడా పీఎంఎస్ తాలూకు లక్షణాలు కనిపిస్తూ, నెలసరి వచ్చిన నాలుగో రోజు తరువాత అవి ఆగిపోతే... సమస్యను అంచనా వేయాలి. అదనంగా మరో రెండు నెలలు గమనించాక వైద్యుల్ని సంప్రదించాలి. సాధారణంగా పీఎంఎస్ అనేది ఉద్వేగాలపై అధిక ప్రభావం చూపుతుంది కాబట్టి... ఎక్కువగా ఒత్తిడికి గురయ్యేవారు, కుటుంబసభ్యుల్లో మానసిక ఆందోళన సమస్య ఉన్నవారు తేలిగ్గా తీసుకోకుండా వైద్యుల్ని సంప్రదించాలి. లేదంటే అవి మానసిక కుంగుబాటుకి దారితీయొచ్చు. వైద్యులతో ఉన్న లక్షణాలు చర్చిస్తే... పరిస్థితిని బట్టి కొన్ని పరీక్షలు చేసి, పరిష్కారాలు సూచిస్తారు. అవసరాన్ని బట్టి నొప్పి నివారణా మందులు, ఈవినింగ్ ప్రిమ్‌రోజ్ ఆయిల్ వంటివి వాడమంటారు. వీటివల్ల ఫలితం లేనప్పుడు మానసిక నిపుణుల సలహా తీసుకోవాలి. వారు యాంటీడిప్రెసెంట్లు సూచిస్తారు. ఒకవేళ శరీరంలో సెరటోనిన్ తగ్గితే.. అది పెంచడానికి కొన్నిరకాల మందులు ఉంటాయి. వాటిని వాడాల్సి ఉంటుంది.

డాక్టర్ పి.బాలాంబ
గైనకాలజిస్ట్

ఈ మార్పులతో సాంత్వన...

పీఎంఎస్ అదుపులో ఉండాలంటే... జీవనవిధానంలో చేసుకునే మార్పులే కీలకం. ముఖ్యంగా...

● రోజూ కనీసం అరగంట నుంచి ముప్పావుగంటసేపు వ్యాయామం చేయాలి. దానివల్ల మెదడులో ఎండార్ఫిన్లు విడుదల అవుతాయి. ఒత్తిడితో పాటు ఉద్వేగాలు కూడా అదుపులో ఉంటాయి. శరీరం కూడా చురుగ్గా మారుతుంది. ఇందుకోసం నడక, పరుగు, యోగా, ఈత వంటివి ఎంచుకోవచ్చు.

● ఒత్తిడిని అధిగమించేందుకు మార్గాలు వెతుక్కోవాలి. స్నేహితులతో మాట్లాడటం, ఆ సమస్యల్ని ఓ పుస్తకంలో రాయడం.. ధ్యానం, మర్దన వంటివన్నీ ఎంతో మేలుచేస్తాయి.

● నెలసరికి కనీసం రెండు వారాల ముందు కెఫీన్, ఉప్పు, చక్కెర, మసాలాలు ఉన్న పదార్థాలు మానేయాలి. వీలైనంతవరకూ పోషకాహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. పండ్లు, పండ్లరసాలు తీసుకుంటే నీరసం, అలసట వంటివి బాధించవు.

● కనీసం ఎనిమిది గంటలు నిద్రపోయేలా చూసుకోవాలి. అలాగే పీఎంఎస్ లక్షణాలు ఎదురైనప్పుడు సాధ్యమైనంతవరకూ విశ్రాంతి తీసుకోవడం మంచిది.

నోరూరించే కొత్తిమీర పోహా

అమ్మ చేత కమ్మగా

కావాల్సినవి: అటుకులు - రెండుకప్పులు, పసుపు - పావుచెంచా, కొబ్బరి తురుము - పావుకప్పు, పచ్చిమిర్చి - రెండు, కొత్తిమీర తరుగు - ముప్పావుకప్పు, నిమ్మరసం - ఒకటిన్నర చెంచా, చారుపొడి - అరచెంచా, బెల్లం - చిన్న ముక్క, ఆవాలు - అరచెంచా, మినప్పప్పు - చెంచా, దాల్చినచెక్క - చిన్నముక్క, కరివేపాకు - ఒక రెబ్బ, నూనె - రెండు పెద్ద చెంచాలు, ఇంగువ- కొద్దిగా, ఉప్పు - తగినంత.

తయారీ: ముందుగా కొబ్బరితురుము, కొత్తిమీర, పచ్చిమిర్చి, నిమ్మరసం, బెల్లం ముక్క, చారుపొడి, తగినంత ఉప్పు మిక్సీలో తీసుకుని మెత్తగా రుబ్బి పెట్టుకోవాలి. పొయ్యిమీద బాణలి పెట్టి నూనె వేయాలి. అది వేడయ్యాక మినప్పప్పు, ఆవాలు, దాల్చినచెక్క, పసుపు, కరివేపాకు, ఇంగువ వేయాలి. తాలింపు వేగాక కొత్తిమీర, కొబ్బరి మిశ్రమం వేసి వేయించాలి. పచ్చివాసన పోయాక నీళ్లలో ముంచి తీసిన అటుకులు వేసి బాగా కలిపితే చాలు.

అమ్మకోసం కారులో ప్రయాణం!

సృష్టికి ఆధారం అమ్మ... కుటుంబానికి, సమాజ శ్రేయస్సు పాటుపడేది ఆమే. భావితరానికి చక్కటి పౌరులను తయారు చేసేదీ కూడా అమ్మే. అందుకే అటువంటి అమ్మ గురించి తెలుసుకోవాలనుకుంది మహారాష్ట్ర సంగ్లికి చెందిన మాధురి సహస్రబుద్ధి. ఇందుకోసం ఇరవైదేశాల్లో, 23,654 కిలోమీటర్లు కారులో ప్రయాణించింది. ఇప్పుడు మరో యాత్రకు సిద్ధమవుతోంది. ఆ వివరాలేంటంటే...!

ఈశాన్య రాష్ట్రాలు, జమ్ము కశ్మీర్ విద్యార్థులపై గతంలో జరిగిన దాడులకు కారణాలు అన్వేషించాలనుకుంది మాధురి సహస్రబుద్ధి. దానిలో భాగంగా అరుణాచల్‌ప్రదేశ్ మినహా ఈశాన్యంలోని అన్ని రాష్ట్రాలను కారులో చుట్టేసింది. అక్కడ ఎన్నో విషయాలను తెలుసుకుంది. 'నేను ఒకప్పుడు ఉద్యోగరీత్యా 20 ఏళ్లు అస్సోం, అరుణాచల్‌ప్రదేశ్‌లో ఉన్నా. అప్పుడక్కడ హింసాత్మక వాతావరణం ఉండేది. అక్కడున్న కొన్ని ఆచారాలు, పరిస్థితులతో తల్లులు పిల్లలతో సరిగ్గా గడిపేవారు కాదు. అవన్నీ వారిపై ప్రభావం చూపించేవి. కానీ ఇప్పుడక్కడ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ప్రతి తల్లి తన పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంచుతోంది. విలువలు నేర్పిస్తోంది. అవన్నీ గమనించాకే అసలు ఏ ప్రాంతాల్లో అమ్మ ఎలా ఉందో తెలుసుకోవాలనుకున్నా. అందుకే మొదట జమ్ము కశ్మీర్‌కి వెళ్లొచ్చా...' అంటోంది మాధురి.

మదర్స్ ఆన్ వీల్స్ ఇలా...

అక్కడితో ఆమె తన ప్రయాణాన్ని ఆపేయలేదు. కశ్మీర్‌లోనే కాదు...ప్రపంచ వ్యాప్తంగా తల్లుల స్థితిగతులు ఏంటో తెలుసుకోవాలనుకుంది. ఆమె పుణెలో పనిచేసినప్పుడు పరిచయమైన శీతల్ దేశ్‌పాండే, ఊర్మిళ జోషిలతో తన ఆలోచన పంచుకుంది. వారికీ ఈ ఆలోచన నచ్చడంతో ఆమెకు తోడయ్యారు. ఆ తరువాత గ్వాలియర్‌కు చెందిన మాధవిసింగ్ తోమర్ కూడా కలిసింది. అంతా కలసి కారుకు మరమ్మతులు చేయడం కూడా తెలుసుకుని 'మదర్ ఆన్ వీల్స్'గా ఏర్పడ్డారు. గతేడాది నవంబర్‌లో ప్రపంచ సాహస యాత్ర మొదలుపెట్టారు. దీనిని అప్పటి విదేశాంగశాఖ మంత్రి సుష్మా స్వరాజ్ జెండా ఊపి ప్రారంభించారు. భైనా, కజకిస్థాన్, ఇరాన్, జార్జియా, టర్కీ, బల్గేరియా, సెర్బియా, క్రోటియా, జెర్మనీ, బెల్జియం, ఫ్రాన్స్ నుంచి లండన్ వరకు వీరి యాత్ర సాగింది. మొత్తం 20 దేశాల్లో 23,654 కిలోమీటర్లు ప్రయాణించారు.

అన్ని చోట్ల ఒకే సమస్య...

ప్రపంచవ్యాప్తంగా తల్లులందరూ ఒకే రకమైన సమస్యలతో బాధపడుతున్నారని చెబుతోంది మాధురి. 'అమ్మ శ్రమకు విలువ లేదు. ఇంటిల్లిపాదీ అవసరాలు తీర్చినా ఆమె కష్టాన్ని గుర్తించడం లేదు. ఉద్యోగం చేసే అమ్మల పరిస్థితి మరింత దారుణం. రెండు బాధ్యతల్నీ సమన్వయం చేసుకోవడం కత్తిమీద సామే. కనీసం విశ్రాంతి కూడా లేకపోవడంతో చాలామంది తల్లులు మానసిక సమస్యలతో కుంగిపోతున్నారు' అని చెబుతుంది మాధురి.

రోడ్డుపై ప్రయాణమే ఇబ్బంది...

'రోజుల తరబడి ప్రయాణం చేయడం నిజంగా సవాలే. కొన్ని చోట్ల రోడ్డు మార్గం కొండలు, పర్వతాలతో ఉండి, ప్రయాణానికి అనుకూలంగా ఉండదు. మేమందరం శాకాహారులం. ఐరోపాతో పాటు మరికొన్ని చోట్లా సరైన ఆహారం లభించేది కాదు. అలానే కొన్ని దేశాలు సమావేశాలు ఏర్పాటు చేయడానికి ఒప్పుకోలేదు. ఒప్పించి ముందుకు సాగాల్సి వచ్చేది. ఇప్పుడు మరో యాత్ర చేయాలని నిర్ణయించుకున్నాం. సౌత్‌ఈస్ట్ ఆసియా, ఆస్ట్రేలియాలో మా పర్యటన సాగనుంది. మా యాత్రకు హోలిస్టిక్ డెవలప్‌మెంట్ ఇన్ అకాడమిక్ ఫీల్డ్స్(ఎఫ్‌హెచ్‌డీఎఫ్) సంస్థ సహకారం అందించింది. ఇది జమ్ముకశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులు సహృద్భావ వాతావరణంలో జీవించడానికి పాటుపడుతోంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ మాకు ఆర్థిక సహాయాన్ని అందించింది. సాహస యాత్ర చేపట్టడానికి హ్యుందాయ్ సంస్థ ఐ20 కారును సమకూర్చింది...' అని చెబుతుందామె.

తెలుసుకుని వాడండి!

ప్రస్తుతం అమ్మాయిలు తప్పనిసరిగా వాడే సౌందర్య ఉత్పత్తుల్లో డియోడరెంట్‌లు కూడా ఒకటి. అయితే వీటిని సరైన దిశలో వాడకపోతే ఇబ్బందులు తప్పకపోవచ్చు.

■ డియోడరెంట్‌లు కొన్ని గంటలపాటు శరీరం సుగంధ పరిమళాలను వెదజల్లుతాయి. అయితే వీటి తయారీకి రకరకాల రసాయనాలను వాడతారు. దాంతో తరచూ వాడితే సమస్యలే. ముఖ్యంగా బాహుమూలలు రొమ్ము కణజాలానికి దగ్గరగా ఉంటాయి. అక్కడే ఎక్కువగా వీటిని ఉపయోగిస్తాం. దాంతో క్యాన్సర్ వచ్చే ముప్పు ఎక్కువ అంటున్నాయి అధ్యయనాలు.

■ అలంకరణ మొత్తం పూర్తయ్యాక డియోడరెంట్‌ని స్ప్రే చేసుకోవాలి. అప్పుడే ఆ పరిమళాలను మీ శరీరం గ్రహిస్తుంది. డియోడరెంట్‌లలోని రసాయనాల వల్ల చర్మం త్వరగా తేమను కోల్పోతుంది. దాంతో దురద, రాషెస్ లాంటి ఇబ్బందులు ఎదురవుతాయి. అందుకే మాయిశ్చరైజర్ రాసుకున్నాక దీన్ని చల్లుకోండి.

■ శరీర సువాసన కోసం అదేపనిగా డియోడరెంట్‌లు వాడాల్సిన అవసరంలేదు. స్నానం చేసే నీటిలో కాస్త గులాబీ నీరు, చక్రాల్లా కోసిన నిమ్మ, కొన్ని వేపాకులు వేస్తే సమస్య దూరమవుతుంది.

Eenadu epaper

Downloaded from Playstore: Todays NewsPaper Telugu

చదువు

10

ఈనాడు

విజయవాడ

సోమవారం జూన్ 3, 2019

e-mail: edc@eenadu.in

రక్షణ దళాల్లోకి ప్రవేశ ప్రకటనలు

వాయుసేనలో విలువైన ఉద్యోగాలు, నౌకాదళంలో నాణ్యమైన కొలువులు యువతరం కోసం ఎదురుచూస్తున్నాయి. ఎయిర్ ఫోర్స్‌లో ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ విభాగాల్లో పోస్టుల భర్తీకి నిర్వహించే ఉమ్మడి పరీక్ష ఏఎఫ్ క్యాట్ తో పాటు నేవీలో ఇంజినీర్ ఉద్యోగాలకోసం యూనివర్సిటీ ఎంట్రీ స్కీం ప్రకటనలు వెలువడ్డాయి. గ్రాడ్యుయేట్లు వీటికి పోటీపడవచ్చు. పరీక్ష, ఇంటర్వ్యూల్లో చూపిన ప్రతిభ ద్వారా నియామకాలు చేపడతారు. ఎంపికైనవారు నేరుగా ఫ్లయింగ్ ఆఫీసర్, సబ్ లెఫ్టినెంట్ హోదాలను దక్కించుకోవచ్చు. ఏ విభాగంలో ఎంపికైనప్పటికీ శిక్షణ తర్వాత ఉద్యోగంలో చేరిన తొలి నెల నుంచే సుమారు రూ.లక్ష వేతనం అందుకోవచ్చు.



లక్షణమైన కొలువులు!

ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ (టెక్నికల్, నాన్ టెక్నికల్), ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ (ఫ్లయింగ్) ఖాళీల భర్తీకి భారత వైమానిక దళం ఎయిర్ ఫోర్స్ కామన్ ఎంట్రన్స్ టెస్టు (ఏఎఫ్ క్యాట్) నిర్వహిస్తోంది.

ఫ్లయింగ్ బ్రాంచ్: ఈ విభాగంలోని పోస్టులకు 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ పూర్తిచేసుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఇంటర్ / ఫ్లస్ 2 లో మ్యాథ్స్, ఫిజిక్స్ చదివుండడం తప్పనిసరి. జులై 1, 2020 నాటికి 20 నుంచి 24 ఏళ్లలోపు ఉండాలి. ఎత్తు కనీసం 162.5 సెం.మీ. తప్పనిసరి.

గ్రౌండ్ డ్యూటీ – టెక్నికల్ బ్రాంచ్: ఏరోనాటికల్ ఇంజినీర్ (ఎలక్ట్రానిక్స్/ మెకానికల్) పోస్టులకు 60 శాతం మార్కులతో సంబంధిత విభాగాల్లో బీటెక్/ బీఈ పూర్తిచేసినవారు అర్హులు. ఇంటర్/ +2లో ఫిజిక్స్, మ్యాథ్స్‌ల్లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి.

గ్రౌండ్ డ్యూటీ – నాన్ టెక్నికల్ బ్రాంచ్: ఇందులో అడ్మినిస్ట్రేషన్, ఎడ్యుకేషన్ విభాగాలు ఉన్నాయి. కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ పూర్తిచేసినవారు అడ్మినిస్ట్రేషన్ విభాగంలో పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏదైనా డిగ్రీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత తోపాటు ఎంపిక చేసిన పీజీ కోర్సుల్లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించినవారు ఎడ్యుకేషన్ విభాగం పోస్టులకు అర్హులు

వయసు: గ్రౌండ్ డ్యూటీలోని టెక్నికల్, నాన్ టెక్నికల్ అన్ని పోస్టులకూ జులై 1, 2020 నాటికి 20 నుంచి 26 ఏళ్లలోపు వయసువారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ: ఈ విభాగానికి ఎన్‌సీసీ సీనియర్ డివిజన్ సి సర్టిఫికెట్ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీతోపాటు 10+2లో మ్యాథ్స్, ఫిజిక్స్‌ల్లోనూ 60 శాతం ఉండాలి.

మెటీరియాలజీ: 50 శాతం మార్కులతో ఏదైనా పీజీ ఉత్తీర్ణత. అలాగే యూజీలో మ్యాథ్స్, ఫిజిక్స్‌ల్లో 55 శాతం మార్కులు తప్పనిసరి.

ఎలా ఎంపిక చేస్తారు?

పరీక్ష, ఇంటర్వ్యూ, మెడికల్ టెస్టుల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఏ పోస్టుకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ప్రవేశపరీక్ష మాత్రం ఉమ్మడిగా ఉంటుంది. రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు స్టేజ్-1, స్టేజ్-2 పరీక్షలు నిర్వహిస్తారు. ఫ్లయింగ్ బ్రాంచ్‌కు దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూ అనంతరం కంప్యూటరైజ్డ్ పైలట్ సెలక్షన్ సిస్టం పరీక్ష ఉంటుంది. వీటన్నింటిలో అర్హత సాధించినవారికి వైద్యపరీక్షలు నిర్వహించి శిక్షణలోకి తీసుకుంటారు.

పరీక్షను ఆన్‌లైన్లో నిర్వహిస్తారు. ప్రశ్నపత్రం 300 మార్కులకు ఉంటుంది. వంద ప్రశ్నలు వస్తాయి. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు. తప్పు జవాబుకు ఒక మార్కు కొప్పున తగ్గిస్తారు. పరీక్ష వ్యవధి రెండు గంటలు. ఇందులో జనరల్ అవేర్‌నెస్, వెర్బల్ ఎబిలిటీ, రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ, మిలటరీ ఆప్టిట్యూడ్ విభాగాల నుంచి ప్రశ్నలుంటాయి. న్యూమరికల్ ఎబిలిటీ ప్రశ్నలు పదో తరగతి స్థాయిలో ఉంటాయి. మిగిలిన విభాగాల్లోనివి మాత్రం డిగ్రీ స్థాయిలో అడుగుతారు. ఈ పరీక్ష ముగిసిన వెంటనే టెక్నికల్ బ్రాంచి దరఖాస్తుదారులకు ఇంజినీరింగ్ నాలెడ్జ్ టెస్ట్ నిర్వహిస్తారు. వ్యవధి 45 నిమిషాలు. 50 ప్రశ్నలు వస్తాయి. ఐఏఎఫ్ వెబ్‌సైట్లో ప్రాక్టీస్ టెస్టు ఉంటుంది.

రాత పరీక్షలో ఉత్తీర్ణులను స్టేజ్ 1, 2 పరీక్షలకు పిలుస్తారు. వీటిని ఎయిర్‌ఫోర్స్ సెలక్షన్ బోర్డు (ఏఎఫ్ ఎస్ బీ) నిర్వహిస్తుంది. అభ్యర్థులు 1.6 కి.మీ. దూరాన్ని 10 నిమిషాల్లో చేరుకోవాలి. 10 పుష్‌అప్స్, 3 చిన్‌అప్స్ తీయగలగాలి. స్టేజ్ -1 స్క్రీనింగ్ టెస్టు. ఇందులో చిన్న అసైన్‌మెంట్స్, పజిల్స్ లాంటి వాటి ద్వారా అభ్యర్థి మేధా స్థాయిలను తెలుసుకుంటారు. ఇందులో అర్హత సాధించినవారే స్టేజ్ -2కి వెళ్తారు. స్టేజ్ -2లో సైకాలజిస్టు ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం ఇండోర్, అవుట్ డోర్ ఇంటరాక్టివ్ గ్రూపు టెస్టులుంటాయి. అనంతరం వ్యక్తిగత ముఖాముఖి.. ఈ దశలన్నీ విజయవంతంగా పూర్తిచేసుకుంటే వైద్య పరీక్షలు చేపడతారు. అందులోనూ నెగ్గినవారిని శిక్షణకు ఎంపిక చేస్తారు. శిక్షణ అనంతరం ఫ్లయింగ్ ఆఫీసర్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు.

ఖాళీలు: 251. **ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు:** జూన్ 30

ఆన్‌లైన్ పరీక్ష తేదీలు: ఆగస్టు 24, 25. https://afcat.cdac.in

ఇంజినీరింగ్ వారికి నేవీలో అవకాశం

యూనివర్సిటీ ఎంట్రీ స్కీం (యూఈఎస్) పేరుతో నేవీ ఇంజినీరింగ్ విభాగాల్లో ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలయింది. ఇందులో ఐటీ, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ బ్రాంచిల్లో ఉద్యోగాలు ఉంటాయి. సంబంధిత విభాగాల్లో ఇంజినీరింగ్ (బీఈ/ బీటెక్) నాలుగో సంవత్సరం లేదా ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ అయిదో సంవత్సరం కోర్సు చదువుతోన్నవారు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. బీటెక్ విద్యార్థులైతే అయిదో సెమిస్టరు వరకు, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ వాళ్లైతే ఏడో సెమిస్టర్ వరకు 60 శాతం మార్కులు సాధించాలి. అలాగే అభ్యర్థులు ఉద్యోగంలో చేరే సమయానికి బీటెక్ / ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ లో మొత్తం మీద 60 శాతం మార్కులు సాధించడం తప్పనిసరి. పురుషులు మాత్రమే అర్హులు. జులై 2, 1996 - జులై 1, 1999 మధ్య జన్మించి ఉండాలి.

ఎంపిక విధానం..

ఇంజినీరింగ్ మార్కుల ఆధారంగా దరఖాస్తులను షార్ట్ లిస్ట్ చేస్తారు. వీరికి నేవల్ క్యాంపస్ సెలక్షన్ టీం ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది. ఇందులో ఎంపికైనవారికి సర్వీస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్ బీ) డిసెంబరు - ఏప్రిల్ మధ్యలో అయిదు రోజులపాటు రెండు దశల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది.



తొలిరోజు స్టేజ్-1 పరీక్షను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఇంటెలిజెన్స్ టెస్టు, పిక్చర్ పర్సెప్షన్ టెస్టు, గ్రూప్ డిస్కషన్ ఉంటాయి. ఇందులో అర్హత సాధించినవారికి మిగిలిన 4 రోజుల పాటు స్టేజ్-2 ఇంటర్వ్యూలు కొనసాగుతాయి. దీనిలో భాగంగా సైకలాజికల్ పరీక్షలు, గ్రూప్ పరీక్షలు, ముఖాముఖి నిర్వహిస్తారు. ఇందులోనూ అర్హత సాధిస్తే వైద్య పరీక్షలు ఉంటాయి. ఇందులో అర్హులను ఉద్యోగానికి ఎంపికచేస్తారు.

యూఈఎస్ విధానంలో ఎంపికైన అభ్యర్థులకు ఇండియన్ నేవల్ అకాడెమీ - ఎజిమాలలో వచ్చే ఏడాది జూన్ నుంచి 22 వారాలపాటు శిక్షణ కొనసాగుతుంది. అనంతరం సంబంధిత కేంద్రాల్లో ట్రేడ్ శిక్షణ నిర్వహిస్తారు. శిక్షణ సమయంలో స్టైపెండ్ చెల్లిస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్నవారిని సబ్ లెఫ్టినెంట్ హోదాతో ఉద్యోగంలోకి తీసుకుంటారు. ఈ సమయంలో సుమారు రూ.లక్ష పరకు వేతనం అందుకోవచ్చు.

దరఖాస్తులు:జూన్ 7 నుంచి 27లోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఏఐఏఈఎస్ఎల్, ముంబయి

ఎయిర్ ఇండియా సబ్సిడరీ శాఖ అయిన ఎయిర్ ఇండియా ఇంజినీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఐఏఈఎస్ఎల్) ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

➤ యుటిలిటీ హ్యాండ్స్ **మొత్తం ఖాళీలు:** 40

అర్హత: పది ఉత్తీర్ణతతో పాటు లైసెన్స్, సంబంధిత అనుభవం ఉండాలి. **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: ట్రేడ్ టెస్ట్/ ఇంటర్వ్యూ **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్. **చివరితేదీ:** జూన్ 24.

చిరునామా: ఎయిర్ ఇండియా ఇంజినీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్, న్యూ ఇంజినీరింగ్ కాంప్లెక్స్, సహర్ విలే పార్లే (ఈస్ట్), ముంబయి - 400099. **వెబ్‌సైట్:** http://www.airindia.com/

బీఆర్ఓ, న్యూదిల్లీ

భారత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన న్యూదిల్లీలోని బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్ఓ) కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం ఖాళీలు:** 778

పోస్టులు-ఖాళీలు: డీవీఆర్ఎంటీ (ఓజీ)-388, ఎలక్ట్రీషియన్-101, వెహికిల్ మెకానిక్-92, మల్టీ స్కిల్డ్ వర్కర్ (కుక్)-197.

అర్హత: మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణతతో పాటు సంబంధిత పని సర్టిఫికేట్ ఉండాలి. **వయసు:** 18 -27 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: ఫిజికల్ టెస్ట్, ప్రాక్టికల్ టెస్ట్, రాతపరీక్ష, మెడికల్ టెస్ట్. **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్. **దరఖాస్తుకు చివరితేదీ:** ఈ ప్రకటన వెలువడిన తేది నుంచి 45 రోజులు. (జులై 15)

వెబ్‌సైట్: http://www.bro.gov.in/

ఈఐఎల్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీలు

న్యూదిల్లీలోని ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్ (ఈఐఎల్) కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ➤ మేనేజ్‌మెంట్ ట్రైనీలు

మొత్తం ఖాళీలు: 79 **విభాగాలు:** మెకానికల్, సివిల్, కెమికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్. **అర్హత:** ఇంజినీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత.**వయసు:** 25 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: గేట్ -2019 స్కోర్, ఇంటర్వ్యూ. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ:** జూన్ 20. http://www.engineersindia.com/

అప్రెంటిస్‌షిప్

ఎస్ఈసీఎల్‌లో ట్రేడ్ అప్రెంటిస్

బిలాస్‌పూర్ (ఛత్తీస్‌గఢ్)లోని సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ (ఎస్ఈసీఎల్) కింది ట్రేడ్‌లలో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ➤ ట్రేడ్ అప్రెంటిస్ **మొత్తం ఖాళీలు:** 5500

ట్రేడ్‌లు: కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్ ఇంగ్లిష్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, టర్నర్, మెషినిస్టు, తదితరాలు. **అర్హత:** ఎనిమిది/ పది ఉత్తీర్ణతతోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ. **ఎంపిక:** అకడమిక్ మార్కుల ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ:** జులై 23. **వెబ్‌సైట్:** http://www./seclncil.in/

సప్లై చైన్‌లో ఐఐఎం కోర్సు

ఎక్కడో విదేశాల్లో తయారవుతున్న వస్తువులను కూడా మనం వినియోగిస్తున్నాం. ఇదెలా సాధ్యమని అనిపించిందా? వస్తువు తయారవడానికి ముడిసరుకును ఫ్యాక్టరీకి తరలించడం నుంచి వినియోగదారుడికి చేరేవరకు వివిధ దశలుంటాయి. అందుకు అవసరమైన సమన్వయమే 'సప్లై చైన్ మేనేజ్‌మెంట్'. తయారీ, సేవా రంగాల్లో ఇది ముఖ్యపాత్ర పోషిస్తోంది. ఆసక్తి ఉన్నవారికి ఇదొక మంచి కెరియర్‌గానూ ఉపయోగపడుతుంది. ఐఐఎం కోల్‌కతా సప్లై చైన్ మేనేజ్‌మెంట్ ప్రవేశ ప్రకటన వెలువడిన సందర్భంగా ఈ కోర్సు విశేషాలు...

వ్యాపార రంగంలో ఉన్న తీవ్ర పోటీ నేపథ్యంలో లాజిస్టిక్స్, సప్లై చైన్ మేనేజ్‌మెంట్‌ల పాత్ర గణనీయంగా పెరిగింది. వస్తువులను సకాలంలో వినియోగదారుడికి చేరేందుకూ, వారితో మంచి సంబంధాలు పెంచుకోవడానికీ ఇవి తోడ్పడుతున్నాయి. వయసుతో సంబంధం లేకుండా సంబంధిత కోర్సులు చదవడానికి ఎంతోమంది ఆసక్తి చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కోల్‌కతా (ఐఐఎంసీ) అడ్వాన్స్‌డ్ ప్రోగ్రామ్ ఇన్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్ (ఏపీఎస్‌సీఎం)లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఐఐఎంసీ, హుగ్స్ గ్లోబల్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా ఈ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నాయి.

కోల్‌కతాలోని ఐఐఎంకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. వ్యాపారరంగంలో ఆయా విభాగాల్లో విద్యార్థులకు నైపుణ్యాలు మెరుగుపర్చడమే దీని లక్ష్యం. ఇది పోస్ట్‌గ్రాడ్యుయేట్, ఎగ్జిక్యూటివ్ ట్రైనింగ్, రిసెర్చ్ అండ్ కన్సల్టింగ్, డాక్టోరల్ ప్రోగ్రామ్స్‌ను అందిస్తోంది.

హుగ్స్ గ్లోబల్ ఎడ్యుకేషన్ ఉద్యోగులకు ఆన్‌లైన్ క్లాసెస్ ద్వారా సర్టిఫికెట్ కోర్సులు అందిస్తోంది. ఇది దేశంలో ఉన్న ప్రముఖ బిజినెస్ స్కూల్స్ ఐఐటీ అహ్మదాబాద్, ఐఐఎంసీ, ఐఐఎఫ్‌టీ న్యూదిల్లీ, ఎక్స్‌ఎల్ఆర్ఐ జమ్‌షెడ్‌పూర్, ఇన్‌సోఫ్‌లతో సంయుక్తంగా వివిధ మార్కెటింగ్ కోర్సులను ఆన్‌లైన్ ద్వారా అందిస్తోంది.

అడ్వాన్స్‌డ్ ప్రోగ్రామ్ ఇన్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్

వినియోగదారుడికి తను కోరుకుంటున్న దాన్ని త్వరగా చేరవేసేందుకు సప్లై చైన్ వ్యూహం ముఖ్యమైనది. ఈ కోర్సు దానికి అనుగుణంగా కొత్త ఆలోచనలతో కూడిన స్ట్రాటజీ ప్లానింగ్ పరిజ్ఞానాన్ని పెంపొందిస్తుంది. ఈ ప్రోగ్రామ్ ద్వారా ఆపరేషన్స్, అకౌంటింగ్, మార్కెటింగ్ అండ్ ఫైనాన్స్, ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్, ఎకనామిక్స్ తదితర రాల అన్నింటిపై అవగాహన పెంచుకోవచ్చు. ఈ రంగంలో ఎదురయ్యే సమస్యలను బృందంతో కలసి పరిష్కరించే సామర్థ్యాన్ని పొందవచ్చు.

అర్హత- ఎంపిక విధానం: ఏదైనా విభాగంలో 50 శాతం మార్కులతో గ్రాడ్యుయేషన్ (10 + 2+ 3)/ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులు అర్హులు. లాజిస్టిక్, సప్లై సిస్టమ్ అన్ని విభాగాల్లో రెండు సంవత్సరాలు పని అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశపరీక్ష, ప్రొఫైలింగ్ ఆధారంగా ఎంపిక ఉంటుంది.

తరగతులన్నీ ఆన్‌లైన్‌లోనే...

ఈ కోర్సుకు సంబంధించిన ఆన్‌లైన్ క్లాసులు వారంలో ఒక రోజు ఉంటాయి. దీని కాల వ్యవధి ఒక సంవత్సరం. మొత్తం కోర్సు కాలంలో ఐఐఎంసీ క్యాంపస్‌లో పదిరోజులు తరగతులు నిర్వహిస్తారు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరి తేది: జులై 23

మరింత సమాచారం కోసం: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కోల్‌కతా (ఐఐఎంసీ), డైమండ్ హార్బర్ రోడ్, జోకా, కోల్‌కతా - 700104.

వెబ్‌సైట్: https://www.iimcal.ac.in/

అన్ని అంశాలూ నేర్చుకోవచ్చు

అడ్వాన్స్‌డ్ ప్రోగ్రామ్ ఇన్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్ (ఏపీఎస్‌సీఎం) ఎంతో ప్రత్యేకమైనది. సప్లై చైన్‌తో పాటు వ్యాపారానికి సంబంధించిన మార్కెటింగ్, ఫైనాన్స్, స్ట్రాటజీ, ఇంటర్నేషనల్ ట్రేడ్ తదితర అంశాలను నేర్చుకునే అవకాశం కల్పిస్తుంది. దీనిద్వారా వృత్తి, వ్యాపారపరమైన నైపుణ్యం అభివృద్ధి చెందుతుంది. ఈ ప్రోగ్రాం ద్వారా ఎంతోమంది సప్లై చైన్ ప్రొఫెషనల్స్‌గా తమ ఉద్యోగాల్లో ఉన్నత స్థాయికి చేరుకున్నారు.

- ప్రొ.బోధిబ్రత నాగ్, ఐఐఎంసీ అకడమిక్స్ డీన్

Centre For Management Studies, NALSAR University of Law, Hyderabad
Govt. University under UGC | Accredited in 'A+' grade with 3.60/4.00 by NAAC
MBA Admissions open for 2019-21 Batch
MBA programme offered by Top law University of India
ELIGIBILITY A Bachelor's degree with min 50% of marks /equivalent CGPA. Students awaiting results can also apply.
CMS accepts CAT, XAT, GRE, GMAT & CMAT Scores. Candidates without these scores can take NALSAR Management Entrance Test (N-MET) on 15th Jun, 2019. GD & PI follows for all applicants.
Last Date to apply: 12th Jun, 2019
Apply online: https://cms.nalsar.ac.in/apply/
Phone: 040-23498409 / 434 I Mobile: 9640158883
Email: mba@nalsar.ac.in

బీఎస్‌సీ తర్వాత ఎంఏ?

➤ బీఎస్‌సీ (బీజెడ్‌సీ) పూర్తయింది. ఎం.ఎ. (హిస్టరీ) చేయాలనుంది. నాకు అర్హత ఉంటుందా? అంటే కోర్సు పూర్తయ్యాక జేఎల్, డీఎల్, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలకు నేను అర్హుడినవుతానా?

- వి.హరీష్, హైదరాబాద్

చరిత్ర, సంస్కృతి, నాగరికతలపై ఆసక్తి, సూక్ష్మాంశాలపై సైతం పరిశీలనాశక్తి ఉన్నవారికి ఎం.ఎ. హిస్టరీ చక్కని కోర్సు. ఈ పీజీ పూర్తిచేస్తే పరిశోధన రంగంలో రిసర్చ్ అసిస్టెంటుగా, పురాతన వస్తువులు సేకరించే ఆర్కివిస్టుగా ఉద్యోగావకాశాలుంటాయి. అలాగే ప్రభుత్వ మ్యూజియాల్లో, ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు సంబంధించిన శాఖల్లో చేరవచ్చు. డిగ్రీలో 50 శాతం మార్కులతో ఏ బ్రాంచి పూర్తిచేసినవారికైనా ఎం.ఎ. హిస్టరీ చదివే అర్హత ఉన్నట్టే. కానీ సాధారణంగా బీఏ హిస్టరీ చదివినవారికి ప్రవేశాల్లో ప్రాముఖ్యం ఇస్తారు.

మాస్టర్స్ పూర్తయిన తర్వాత మీరు జూనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీ కోసం జరిగే పరీక్షను రాయడానికి అర్హులవుతారు. డిగ్రీ లెక్చరర్ పోస్టుకు మాత్రం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) వారు నిర్వహించే నెట్ లేదా రాష్ట్ర స్థాయి సెట్‌లో అర్హత పొందాల్సివుంటుంది. ఇక ఇతర ప్రభుత్వ ఉద్యోగ అవకాశాల విషయానికొస్తే గ్రాడ్యుయేషన్ ఏదైనప్పటికీ 60 శాతం మార్కులతో పాసైనవారందరూ అర్హులే.

- ప్రొ. బి. రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

Eenadu epaper

Downloaded from Playstore: Todays NewsPaper Telugu

38800–39350 శ్రేణిలో మద్దతు!

సమీక్ష : దేశీయ పరిణామాల అండతో మార్కెట్లు గత వారం స్వల్ప లాభాలతో ముగిశాయి. బలహీన అంతర్జాతీయ సంకేతాలు ఉన్నప్పటికీ.. కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం ఏర్పడటం సెంటిమెంట్‌ను బలోపేతం చేసింది. కంపెనీల త్రైమాసిక ఫలితాలు మిశ్రమంగా నమోదయ్యాయి. స్థిర రూపాయి, కొనుగోళ్ల మద్దతు కలిసొచ్చింది. దేశీయంగా చూస్తే.. ఆర్థిక వ్యవస్థలోకి ప్రభుత్వ బాండ్ల కొనుగోలు రూపంలో రూ.15,000 కోట్లు చొప్పించనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. కార్పొరేట్ ఫలితాల నేపథ్యంలో షేరు ఆధారిత కదలికలు చోటుచేసుకున్నాయి. డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగింపుతో గరిష్ఠ స్థాయి వద్ద లాభాల స్వీకరణ జరిగింది. వాణిజ్య యుద్ధం భయాలు, అంతర్జాతీయ వృద్ధి నెమ్మదించడం, బ్రెగ్జిట్ అనిశ్చితి వంటి పరిణామాలతో ప్రపంచ మార్కెట్లు బలహీనపడ్డాయి. చైనా బలహీన గణాంకాలు, మెక్సికోపై ట్రంప్ కొత్త సుంకాలు ప్రతికూల ప్రభావం చూపాయి. ముడిచమురు ధరలు దిద్దుబాటుకు గురయ్యాయి. మొత్తం మీద ఈ పరిణామాలతో గత వారం సెన్సెక్స్ 0.7 శాతం లాభంతో 39,714 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 0.7 శాతం పెరిగి 11,923 పాయింట్ల దగ్గర స్థిరపడింది. ఐటీ, విద్యుత్, చమురు- గ్యాస్ షేర్లు రాణించగా, వాహన, ఆరోగ్య సంరక్షణ, ఎఫ్‌ఎమ్‌సీజీ స్క్రిప్‌లు డీలాపడ్డాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్‌ఐఐలు) నికరంగా రూ. 2751 కోట్ల విలువైన షేర్లు కొనుగోలు చేయగా, డీఐఐలు, ఫండ్ల అమ్మకాలు రూ. 977 కోట్లుగా నమోదయ్యాయి.

లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 2:3గా నమోదు కావడం.. గరిష్ఠ స్థాయిల వద్ద లాభాల స్వీకరణను సూచిస్తోంది.

ఈవారంపై అంచనా } గత వారం మార్కెట్లు లాభాలు కొనసాగించి.. 40,122 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకాయి. అనంతరం లాభాల స్వీకరణ ఎదురైంది. స్వల్పకాలంలో మార్కెట్‌కు 38,800- 39,350 పాయింట్ల శ్రేణిలో మద్దతు దక్కొచ్చు. ఈ శ్రేణి దిగువకు చేరితే మాత్రం మరింత బలహీనపడొచ్చు. మరోవైపు 40,125 పాయింట ఎగువకు చేరితే.. లాభాల ర్యాలీ మళ్లీ కొనసాగొచ్చు.

ప్రభావిత అంశాలు } అంతర్జాతీయ సంకేతాలు, ఆర్‌బీఐ ద్రవ్యపరపతి విధాన సమీక్ష, ముడిచమురు ధరల కదలికలు మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్నాయి.దేశీయంగా చూస్తే.. జనవరి-మార్చి జీడీపీ గణాంకాలు మార్కెట్లపై ప్రభావం చూపనున్నాయి. నాలుగో త్రైమాసికంలో జీడీపీ 5 ఏళ్ల కనిష్ఠానికి చేరింది. ఆర్‌బీఐ పరపతి విధాన సమీక్ష నిర్ణయాలు కీలకం కానున్నాయి. 3-6 తేదీల్లో ఆర్‌బీఐ పరపతి విధాన కమిటీ భేటీ కానుంది. ఆర్థిక వ్యవస్థ నెమ్మదించడంతో పావు శాతం రేట్ల కోత ఉండే అవకాశం ఉంది. నెలవారీ విక్రయ గణాంకాల ప్రభావం వాహన షేర్లపై ఉండొచ్చు. ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల్లో వర్షపాతం సాధారణంగా నమోదుకావొచ్చని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో రుతుపవనాల కదలికలపై మదుపర్లు దృష్టి పెట్టొచ్చు. ముడిచమురు ధరలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి కదలికలపై మదుపర్లు ఓ కన్నేయొచ్చు. ఎఫ్‌ఐఐ, డీఐఐల పెట్టుబడుల ధోరణి కీలకం కానుంది. అంతర్జాతీయ మార్కెట్లపై అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతలు, మెక్సికోపై ట్రంప్ సుంకాలు ప్రభావం చూపొచ్చు. అమెరికా, చైనా, జపాన్ పీఏంఐ గణాంకాలు కీలకం కానున్నాయి.

తక్షణ మద్దతు స్థాయిలు: 39,353, 38,900, 38,570;
తక్షణ నిరోధ స్థాయిలు: 40,125, 40,750, 41,200

స్వల్పకాలంలో మార్కెట్ బలహీనపడొచ్చు. అంతకంటే ముందు మద్దతు దక్కించుకోవచ్చు.

– సతీశ్ కంతేటి, జెన్ మనీ



కోడిగుడ్లు

2న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)
(100కు రూపాయలలో)

హైదరాబాద్	313	వరంగల్	314
చిల్లరగా (ఒక గుడ్డు)	3.75	విశాఖపట్నం	310
బెంగళూరు	350	చెన్నై	375
3వ తేదీకి...		చిత్తూరు	368
విజయవాడ/గోదావరి	310	నమక్కల్	370

ఆర్‌బీఐ సమీక్షపైనే చూపు

- కీలక రేట్ల కోతపై ఆశతో సూచీలు ముందుకే
- 11,615–12,040 పాయింట్ల మధ్య నిఫ్టీ కదలికలు
- రంజాన్ సందర్భంగా బుధవారం సెలవు
- ఈ వారం నాలుగు రోజులే ట్రేడింగ్
- వాహన షేర్లకు ఒత్తిడి

స్టాక్ మార్కెట్ ఈ వారం

దేశీయ సూచీలు ఈ వారం సానుకూలంగా కదలాడే అవకాశం కనిపిస్తోంది. నేటి నుంచి ప్రారంభం కానున్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలు గురువారం వెలువడనున్నాయి. కీలక రేట్లను పావు శాతం మేర తగ్గించొచ్చన్న అంచనాల వల్ల మదుపర్లు కొనుగోళ్లకు దిగుతారనే అంచనాలున్నాయి. రంజాన్ (ఈదుల్ ఫితర్) పండుగ సందర్భంగా బుధవారం మార్కెట్లకు సెలవు కావడంతో, ఈ వారం మార్కెట్లు నాలుగు రోజులే పని చేయనున్నాయి. నిఫ్టీ 11,615-12,040 పాయింట్ల శ్రేణిలో కదలాడవచ్చని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దేశీయంగా విక్రయాలు తగ్గుముఖం పట్టడం వల్ల, వాహన కంపెనీ షేర్లపై ప్రభావం పడుతుంది. అంతర్జాతీయంగా అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతలకు సంబంధించిన తాజా పరిణామాలను మదుపర్లు గమనించొచ్చు. ఆయా రంగాలు, కంపెనీల షేర్లపై విశ్లేషకుల అంచనాలు ఇలా..

- గ్రామీణ గిరాకీలో మందగమనం వల్ల ఈ వారం **వాహన** షేర్లు నష్టాలు కొనసాగించొచ్చు. మే నెల విక్రయ గణాంకాలూ అధ్వానంగానే ఉండడం ఇందుకు కారణం. వర్షాలు బాగా కురిస్తే గ్రామీణ ఆదాయం మెరుగై.. గిరాకీ పెరుగుతుందన్న అంచనాలున్నాయి.
- అమెరికా-చైనా వాణిజ్య పరిణామాలపై ఆధారపడి **లోహ, గనుల** కంపెనీల షేర్లు కదలాడొచ్చు. వాణిజ్య ఒప్పందంపై ఆశలు నీరుగారుతాయన్న అంచనాలతో గత వారం ఇవి డీలా పడిన సంగతి తెలిసిందే.
- గ్రామీణ గిరాకీ తగ్గుముఖం పట్టడం వల్ల **ఎఫ్‌ఎమ్‌సీజీ** షేర్లు డీలా పడొచ్చు. ఇప్పటికే ప్రధాన కంపెనీల జనవరి-మార్చి విక్రయాలు తగ్గాయి. స్వల్పకాల గిరాకీపై హెచ్‌యూఎల్ ఇంకా జాగ్రత్తపడాలనే చెబుతుండడం గమనార్హం.
- సగటు వినియోగదారు ఆదాయం(ఆర్పు) పుంజుకుంటుందన్న ఆశలతో ఈ వారం **టెలికాం** షేర్లు రాణించే అవకాశం ఉంది. జియో ప్రారంభించనున్న ఫైబర్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను మదుపర్లు నిశితంగా గమనించవచ్చు.
- ఆర్డర్లపై ఎల్ అండ్ టీ, సీమెన్స్ వంటి దిగ్గజాలు సానుకూలంగా ఉండడంతో ఈ వారం **యంత్ర పరికరాల** షేర్లు రాణించే అవకాశం ఉంది. ఈ రంగ కంపెనీలు మార్కెట్ అంచనాల కంటే మిన్నగా త్రైమాసిక ఫలితాలు ప్రకటించడమూ సానుకూలాంశమే.
- రాబోయే వర్షాకాల సీజనులో **సిమెంటు**కు గిరాకీ తగ్గే అవకాశం ఉన్నందున తయారీ కంపెనీలు ధరలు తగ్గించాల్సి వస్తుంది. నిర్మాణ కార్యకలాపాల్లో స్తబ్ధత చోటు చేసుకోవచ్చు.
- ప్రభుత్వ రంగ **చమురు** రిఫైనరీలైన ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లు సానుకూల ధోరణితో కొనసాగొచ్చు. ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియాలు కాస్త ప్రతికూలతలను కనబరచవచ్చు.
- ఫలితాల అనంతరం వృద్ధిపై మదుపర్లు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో **ఔషధ** కంపెనీల షేర్లు బలహీనంగానే కదలాడొచ్చు. అమెరికా మార్కెట్లో ఆయా సంస్థలు వృద్ధిని కనబరచినప్పటికీ.. అక్కడ ధరల్లో కోత వల్ల ప్రతికూలతలు కనిపిస్తున్నాయి.
- **బ్యాంకు** షేర్లు చాలా తక్కువ శ్రేణికి లోబడి కదలాడవచ్చు. ఆర్‌బీఐ పరపతి విధాన సమీక్ష నిర్ణయాలు గురువారం వెల్లడి కానున్నందున మదుపర్లు పెద్ద పొజిషన్లకు దూరంగా ఉండే అవకాశం ఉంది. జీడీపీ మందగమన ప్రభావం పడొచ్చు.

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	70.20	73.40	67.30
సీజీ పవర్	35.45	37.60	33.60
ఎల్ అండ్ టీ	1557.55	1604.70	1511.30
థెర్మాక్స్	1020.00	1039.20	991.70
సీమెన్స్	1271.80	1332.30	1221.80
టెలికాం	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
భారతీ ఎయిర్‌టెల్	348.80	356.50	340.60
ఎమ్‌టీఎన్‌ఎల్	9.65	10.20	9.40
ఆర్‌కామ్	2.00	2.00	1.90
రిలయన్స్ ఇండస్ట్రీస్	1330.15	1352.50	1309.10
టాటా కామ్	541.00	559.00	521.70
వొడాఫోన్ ఐడియా	13.95	14.40	13.20
ఎఫ్‌ఎమ్‌సీజీ	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
బ్రిటానియా ఇండస్ట్రీస్	2921.95	3007.60	2846.80
డాబర్ ఇండియా	395.95	406.40	389.70
గోద్రేజ్ కన్జూమర్	688.05	710.70	648.70
హెచ్‌యూఎల్	1788.50	1823.70	1746.40
ఐటీసీ	278.55	296.60	268.50
వాహన	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
అశోక్ లేలాండ్	88.85	91.90	86.10
బజాజ్ ఆటో	2925.90	3003.40	2876.50
ఐషర్ మోటార్స్	19947.75	20466.90	19540.40
హీరో మోటోకార్ప్	2680.25	2801.00	2604.70
ఎం అండ్ ఎం	647.05	673.60	631.90
మారుతీ సుజుకీ	6869.85	7021.70	6749.10
టాటా మోటార్స్	172.60	181.30	165.60

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్యాంక్ ఆఫ్ బరోడా	133.25	142.00	125.70
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	2425.35	2523.90	2307.50
ఐసీఐసీఐ బ్యాంక్	423.70	438.60	406.80
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	45.40	46.90	43.50
కోటక్ మహీంద్రా బ్యాంక్	1522.15	1587.80	1434.60
ఎస్‌బీఐ	352.50	364.90	338.40
యెస్ బ్యాంక్	147.80	160.60	140.60
ఐటీ	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
హెచ్‌సీఎల్ టెక్	1092.55	1110.00	1071.30
హెక్సావేర్ టెక్	360.40	369.00	352.70
ఇన్ఫోసిస్	737.75	747.70	728.20
ఎల్ & టీ ఇన్ఫోటెక్	1785.05	1865.00	1735.00
మైండ్ ట్రీ	977.90	989.30	969.40
టీసీఎస్	2196.55	2237.30	2131.90
ఔషధ	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
అరబిందో ఫార్మా	672.40	704.00	649.50
బయోకాన్	541.90	551.10	533.80
సిప్లా	558.85	577.70	541.40
డాక్టర్ రెడ్డీస్	2678.35	2725.90	2602.70
లుపిన్	745.55	755.50	732.60
ఫైజర్	3179.55	3216.60	3143.70
సన్‌ఫార్మా	409.85	422.10	400.00
చమురు	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
బీపీసీఎల్	409.35	427.90	396.90
హెచ్‌పీసీఎల్	324.25	338.40	311.50
ఐఓసీఎల్	165.55	171.60	159.90
ఓఎన్‌జీసీ	171.95	178.20	163.40
ఆయిల్ ఇండియా	180.00	185.70	174.20
సిమెంట్	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
ఏసీసీ	1686.00	1741.30	1642.40
అంబుజా సిమెంట్స్	230.60	238.20	224.20
ఇండియా సిమెంట్స్	105.60	114.90	98.60
శ్రీ సిమెంట్	21618.75	22012.10	21170.50
అల్ట్రాటెక్ సిమెంట్	4760.10	4849.40	4615.40

రూ.11,900 కోట్ల సమీకరణ: బీఓబీ

దిల్లీ: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) 2019-20 ఆర్థిక సంవత్సరంలో షేర్ల విక్రయం ద్వారా రూ.11,900 కోట్ల నిధుల్ని సమీకరించాలని ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇందులో ఉద్యోగుల షేర్ల కొనుగోలు పథకం (ఈఎస్‌పీఎస్) కూడా భాగమే. ఈ నిధులతో మూలధనాన్ని పెంచుకుని వ్యాపార విస్తరణ చేయాలని బ్యాంకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈఎస్‌పీఎస్ పథకం కింద రూ.2 ముఖ విలువ కలిగిన 15 కోట్ల షేర్లను ఉద్యోగులకు కేటాయించనున్నారు. గత జనవరిలో ప్రతిపాదించిన 10 కోట్ల షేర్ల విక్రయ పరిమాణాన్ని తాజాగా పెంచడం గమనార్హం. వాటాదార్ల ఆమోదం తీసుకునేందుకు జూన్ 21న వార్షిక సాధారణ సమావేశాన్ని నిర్వహించబోతోంది.

మేలో ఎఫ్‌పీఐల పెట్టుబడులు రూ.9,031 కోట్లు

దిల్లీ: విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు (ఎఫ్‌పీఐలు) దేశీయ కేపిటల్ మార్కెట్లపై ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. వరుసగా నాలుగో నెలలో కూడా వారు నికర కొనుగోలుదారులుగా నిలిచారు. మే నెలలో మన మార్కెట్లలో రూ.9,031 కోట్ల పెట్టుబడులు పెట్టారు. కేంద్రంలో అఖండ విజయం సాధించిన భాజపా నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం స్నేహపూర్వక వ్యాపార విధానాలను కొనసాగిస్తుందన్న అంచనాల వల్లే, పెట్టుబడులు పెట్టేందుకు విదేశీ మదుపర్లు ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది.

జెట్ నుంచి 2,000 మందికి ఉద్యోగాలు

- ఈ ఆర్థిక సంవత్సరంలో సామర్థ్యం 80 శాతం విస్తరణ
- స్పైస్‌జెట్ సీఎండీ అజయ్‌సింగ్

సియోల్: పైలట్లు, క్యాబిన్ సిబ్బంది సహా జెట్ ఎయిర్‌వేస్ నుంచి దాదాపు 2,000 మందికి తమ సంస్థలో అవకాశం కల్పిస్తున్నామని స్పైస్‌జెట్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) అజయ్ సింగ్ వెల్లడించారు. నిధుల కొరతతో ఏప్రిల్ 17న జెట్ ఎయిర్‌వేస్ కార్యకలాపాలు నిలిపేసిన సంగతి విదితమే. ఆ సంస్థ నిర్వహించిన విమానాల్లో 22 స్పైస్‌జెట్ ఆధీనంలోకి చేరాయి. 'విమానాలు, సర్వీసుల విస్తరణకు అనుగుణంగా సిబ్బంది నియామకాలు చేస్తున్నాం. నైపుణ్యం గల సిబ్బంది జెట్ ఎయిర్‌వేస్‌లో అందుబాటులో ఉన్నందున, ఇప్పటికే 1100 మందిని తీసుకున్నాం. ఈ సంఖ్య 2,000కు చేరుతుందని అంచనా వేస్తున్నాం. ప్రస్తుతానికి వెడల్పు తక్కువగా ఉండే (నారో బాడీ) విమానాలపైనే దృష్టి సారించాం. అంతర్జాతీయ విమాన కేంద్రంగా భారత్ మారినప్పుడు దీర్ఘకాలం ప్రయాణించే విమానాలు నిర్వహిస్తాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సంస్థ సీట్ల సామర్థ్యాన్ని 80 శాతం మేర విస్తరిస్తున్నాం. ఇందులో అధికం లీజ్ ద్వారానే ఉంటుంది. అందువల్ల నిధులు భారీగా అవసరం ఉండదు. విమానాల లీజ్ బ్యాక్‌కు తోడు, ఆఫర్ విక్రయాల వల్ల సీట్లు భారీగా ముందుగానే విక్రయించడంతో నగదు లభ్యత బాగుంది. అందువల్ల కొత్తగా నిధులు సమీకరించే యోచనలేదు. ఈ ఏడాది లాభార్జన బాగుంటుందనే ఆశిస్తున్నాం' అని అజయ్ సింగ్ వివరించారు.

ఐఏటీఏ బోర్డులోకి అజయ్‌సింగ్

ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) బోర్డులోకి స్పైస్‌జెట్ సీఎండీ అజయ్ సింగ్ ఎన్నికయ్యారు. 290 విమాన యాన సంస్థలకు సభ్యత్వం ఉన్న ఈ అంతర్జాతీయ గ్రూప్‌లో సంస్థ చేరిన 3 నెలల వ్యవధిలోనే అజయ్‌సింగ్‌కు ఈ పదవి దక్కింది. మూడేళ్లపాటు ఆయన పదవిలో ఉంటారు. గతంలో ఈ బోర్డులో జెట్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడు నరేశ్ గోయల్ దీర్ఘకాలం ఉన్నారు. లుఫ్తాన్సా గ్రూప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కార్‌స్టెన్ ఐఏటీఏ బోర్డుకు ఆధ్వర్యం వహిస్తున్నారు. బోర్డులో ఎయిర్ కెనడా, క్యాంటాస్, ఖతార్ ఎయిర్‌వేస్ సీఈఓలు ఇతర సభ్యులు.

ఈ ఏడాది లాభాలు 28 బి.డాలర్లు: ఐఏటీఏ

అంతర్జాతీయ విమానయాన రంగం ఈ ఏడాది (2019) 28 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.96 లక్షల కోట్ల) లాభాలు ఆర్జించవచ్చని ఐఏటీఏ తాజాగా అంచనా వేసింది. గత ఏడాది వేసిన అంచనాల్లో లాభాలు 35.5 బిలియన్ డాలర్లు (సుమారు రూ.2.48 లక్షల కోట్లు) ఉండొచ్చని పేర్కొన్న సంగతి విదితమే. ఇంధన ధరలు పెరగడం, అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతల వల్ల విమానయాన రంగ వ్యాపారంపై ప్రభావం పడుతోందని తెలిపింది.

భారత్, చైనాల నుంచే సగం మంది

రాబోయే 20 ఏళ్లలో ప్రయాణికుల సంఖ్యలో లభించే వృద్ధిలో సగం మేర భారత్, చైనాల నుంచే ఉంటుందని ఐఏటీఏ పేర్కొంది. భారత్‌లో ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రయాణికుల సంఖ్యలో వృద్ధి తగ్గడం తాత్కాలికమేనని, క్రమేణ పెరుగుతుందని ఐఏటీఏ ముఖ్య ఆర్థికవేత్త బ్రియాన్ పియర్స్ తెలిపారు. ప్రపంచవ్యాప్త ప్రయాణికుల వృద్ధిలో 45 శాతం భారత్, చైనాల నుంచే లభిస్తుందని, అన్ని ఆదాయ వర్గాల నుంచీ గిరాకీ అధికమవుతుందని వివరించారు. జెట్ ఎయిర్‌వేస్ కార్యకలాపాలు నిలిచిన నేపథ్యంలో, ఎయిరిండియాకు గిరాకీ పెరుగుతుందని స్టార్ అలయన్స్ సీఈఓ జెఫ్రీ అంచనా వేశారు.

చైనాలో 70 ఉత్పత్తులు విడుదల చేస్తాం: డాక్టర్ రెడ్డీస్

హైదరాబాద్: భారత ఔషధ దిగుమతులపై చైనాలో నియంత్రణ మార్పులు క్రమబద్ధీకరించిన నేపథ్యంలో రాబోయే కొన్నేళ్లలో 70 ఉత్పత్తుల్ని అక్కడ విడుదల చేసేందుకు డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ సిద్ధమవుతోంది. ఆ దేశంలో ఇప్పుడున్న ప్లాంటుకు దగ్గరలోనే మరో నూతన ప్లాంటు నిర్మాణానికీ సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాలను డాక్టర్ రెడ్డీస్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి (సీఓఓ) ఎరేజ్ ఇజ్రాయెలీ ఇటీవల నిర్వహించిన 'ఎర్నింగ్స్' కాల్ సందర్భంగా వెల్లడించారు. 'చైనా అధికారుల నుంచి అవసరమైన అనుమతులు పొందే పనిలో ప్రస్తుతం ఉన్నాం. కేన్సర్ సంబంధిత (ఆంకాలజీ) ఔషధాలతో పాటు మరిన్ని ఔషధాలను అక్కడ విక్రయించేందుకు సన్నద్ధమవుతున్నాం. చైనాను ఒక ముఖ్యమైన విపణిగా మేము భావిస్తున్నాం. ఔషధ ఉత్పత్తులకు సంబంధించి నియంత్రణ మార్పులు చేయడానికి ఆ దేశం ముందుకొచ్చిన నేపథ్యంలో రాబోయే కొన్నేళ్లలో సుమారు 70 రకాల ఉత్పత్తుల్ని అక్కడ విడుదల చేసేందుకు ప్రణాళిక రచిస్తున్నాము'ని తెలిపారు.

హీరో విక్రయాల్లో 13 శాతం వృద్ధి

దిల్లీ: మేలో హీరో మోటోకార్ప్ మొత్తం 6,52,028 వాహనాలను విక్రయించింది. గత ఏడాది ఇదే నెలలో కంపెనీ విక్రయించిన 5,74,366తో పోలిస్తే ఇవి 13.5 శాతం ఎక్కువ. ఈ ఏడాది ఫిబ్రవరి తర్వాత 6 లక్షలకు మించి విక్రయాలు జరగడం ఇప్పుడే. గత నెలలో కంపెనీ మూడు కొత్త మోటార్‌సైకిళ్ల ఎక్స్‌పల్స్200, ఎక్స్‌పల్స్ 200టీ, ఎక్స్‌ట్రీమ్ 200 ఎస్‌లను విడుదల చేసింది. రెండు స్కూటర్లు మేస్ట్రో ఎడ్జ్ 125, ప్లెజర్+ లను విపణిలోకి ప్రవేశపెట్టింది.

తగ్గిన హ్యుందాయ్ అమ్మకాలు

దిల్లీ: గత నెలలో హ్యుందాయ్ మోటార్ ఇండియా దేశీయ అమ్మకాలు 42,502 వాహనాలుగా నమోదయ్యాయి. గతేడాది మేలో కంపెనీ విక్రయించిన 45,008 వాహనాలతో పోలిస్తే ఇవి 5.6 శాతం తక్కువ. మొత్తం అమ్మకాలు (దేశీయం, ఎగుమతులు కలిపి) మాత్రం 5.5 శాతం పెరిగాయి.

100	స్పైస్‌జెట్ విమానాల సంఖ్య
14,000	సిబ్బంది పరిమాణం
62	సర్వీసులు నడుస్తున్న ప్రాంతాలు
575	రోజువారీ సర్వీసుల సంఖ్య

కమొడిటీస్ ఈ వారం

పసిడి ఆకర్షణీయం!

బంగారం, వెండి

పసిడి ఆగస్టు కాంట్రాక్టు గత వారం రూ.31,732 వద్ద నష్టాలతో ప్రారంభమైంది. అదే తీరు కొనసాగిస్తూ.. గురువారం రూ.31,600 స్థాయికి దిగివచ్చింది. అయితే అంతర్జాతీయ ప్రతికూలతల నేపథ్యంలో సురక్షిత పెట్టుబడులకు మదుపర్లు మొగ్గుచూపడంతో కాంట్రాక్టు మళ్లీ పుంజుకుంది. డాలరు కూడా కలిసిరావడంతో రూ.32,294 వద్ద వారం గరిష్ఠ స్థాయిని చేరింది. చివరకు 1.59% లాభంతో రూ.32,237 వద్ద ముగిసింది. ఈ వారం పసిడి కాంట్రాక్టు రూ.32,474 స్థాయి వరకు ఆకర్షణీయంగా కనిపిస్తోంది. లాంగ్ పొజిషన్లు ఉన్న మదుపర్లు రూ.32,474 వద్ద లాభాలు స్వీకరించడం మంచి వ్యూహమవుతుంది. సెప్టెంబరు వెండి కాంట్రాక్టు గత వారం రూ.36,969 స్థాయి వద్ద ఆరంభమైంది. అంతర్జాతీయంగా ధరల పతనంతో ఆ తర్వాత రూ.36,310 వరకు దిద్దుబాటు గురైంది. మళ్లీ పుంజుకుని రూ.37,159 వరకు వెళ్లినా, ఆఖరుకు 0.12% నష్టంతో రూ.36,932 దగ్గర స్థిరపడింది. లాంగ్ పొజిషన్లను అట్టిపెట్టుకోవడానికి ఇప్పటికీ వెండి మెరుగ్గానే కనిపిస్తోంది.

ప్రాథమిక లోహాలు

రాగి జూన్ కాంట్రాక్టు ఈవారం రూ.411.25 కంటే ఎగువన ట్రేడ్‌కాకుంటే.. ప్రతికూలంగా చలించే అవకాశం ఉంటుంది. రూ.400.65 వరకు షార్ట్ పొజిషన్లను కొనసాగించొచ్చు. సీసం జూన్ కాంట్రాక్టు రూ.146-154 శ్రేణిలో కదలాడొచ్చు. ఈవారం రూ.147 దిగువన ట్రేడయితే మరింత కిందకు తిగివచ్చే అవకాశం ఉంది. రూ.145 స్థాయికి పడిపోవచ్చు. అదే సమయంలో రూ.152.65 దరిదాపులో కొత్తగా షార్ట్ సెల్ పొజిషన్లు తీసుకోవడమూ మంచి వ్యూహమే అవుతుంది. జింక్ జూన్ కాంట్రాక్టు రూ.211 స్థాయి ఎగువన నిలబడకపోతే.. రూ.203.25 స్థాయికి దిగిరావచ్చు. ఆ తర్వాత రూ.201.25కు చేరొచ్చు. రూ.206.25 స్థాయి వద్ద కొనుగోలు చేసి, రూ.209.25 లక్ష్యంగా పెట్టుకోవచ్చు. లాంగ్ పొజిషన్ల నుంచి వైదొలగడం ఉత్తమం. అల్యూమినియం జూన్ కాంట్రాక్టు ఈరోజు రూ.146.15 స్థాయికి పైన నిలదొక్కుకుంటే మరింత పైకి వెళ్లే అవకాశం ఉంది. రూ.147.90; రూ.149.55 వరకు వెళ్లొచ్చు. ఒకవేళ రూ.144.70 దిగువకు వస్తే షార్ట్ సెల్ పొజిషన్ల వైపు మొగ్గు చూపొచ్చు. అయితే రూ.143.55 ఎగువన స్టాప్‌లాస్ పెట్టుకోవాలి. నికెల్ జూన్ కాంట్రాక్టు ఈవారం బలహీనంగా కనిపిస్తోంది. కీలక నిరోధ స్థాయి రూ.907 స్థాయిపై మదుపర్లు దృష్టి పెట్టాలి. రూ.907 ఎగువన ట్రేడ్ కాకుంటే.. రూ.866, ఆ తర్వాత రూ.853 స్థాయిలకు పడిపోవచ్చు.

ఇంధన రంగం

ముడి చమురు జూన్ కాంట్రాక్టు గత రెండు వారాల్లో 15 శాతానికి పైగా దిద్దుబాటుకు లోనయినప్పటికీ.. ఇంకా బలహీనంగానే కనిపిస్తోంది. రూ.3,746 దిగువకు వస్తే మరింత అమ్మకాల ఒత్తిడికి లోనై రూ.3,632; రూ.3,586 స్థాయి వరకు పడిపోవచ్చు. అందువల్ల లాంగ్ పొజిషన్లుంటే రూ.3632 వద్ద స్టాప్‌లాస్ తప్పక పెట్టుకోవాలి. సహజ వాయువు జూన్ కాంట్రాక్టుకు ఈవారం రూ.186.35 స్థాయి వద్ద ఓ కన్నేసి ఉంచాలి. ఎందుకంటే ఈ స్థాయిని అధిగమిస్తే కాంట్రాక్టుకు కొంత కొనుగోళ్ల మద్దతు లభించే అవకాశం ఉంది. ముడి పామోలిన్ నూనె (సీపీఓ) జూన్ కాంట్రాక్టు ఈవారం రూ.513 స్థాయి కోల్పోతే మరింత దిగువకు చేరొచ్చు.

వ్యవసాయ ఉత్పత్తులు

పసుపు జూన్ కాంట్రాక్టు రూ.7,168 ఎగువకు చేరేంత వరకు లాంగ్ పొజిషన్లకు దూరంగా ఉండటం మంచిది. ఈ రోజు రూ.6,926 దిగువకు చేరితే, స్వల్పకాలంలో రూ.6,675 వరకు దిద్దుబాటుకు గురికావొచ్చు. ఈ వారం పెరిగినప్పుడల్లా విక్రయించడం మంచి వ్యూహమవుతుంది. సోయాబీన్ జూన్ కాంట్రాక్టు ఈవారం రూ.3,768కి పైన నిలదొక్కుకోకుంటే బలహీనంగా కదలాడే అవకాశం ఉంటుంది. రూ.3,675 దిగువకు వస్తే రూ.3,661 వరకు దిద్దుబాటు అవుతుందని భావించవచ్చు. జీలకర్ర ఫ్యూచర్ కాంట్రాక్టును రూ.17,282 దిగువన మాత్రమే షార్ట్ సెల్ చేయాలి. అదే సమయంలో రూ.17,580 ఎగువన లాంగ్ పొజిషన్లకు మొగ్గు చూపొచ్చు.

– ఆర్‌ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం పొజిషన్లు ఇలా

కమొడిటీ	ప్రారంభం	ముగింపు	వృద్ధి/(క్షీణత)

Downloaded from Playstore: Todays NewsPaper Telugu

ఎందరు ఆడినా...!

నాలుగు రోజులు గడిచాయి. ఐదు మ్యాచ్‌లు అయిపోయాయి. కానీ ఇప్పటికీ ప్రపంచకప్ జరుగుతున్న భావన కలగట్లేదు అభిమానులకు. కారణం.. ఇంకా టీమ్‌ఇండియా టోర్నీలో అడుగు పెట్టకపోవడమే. భారత జట్టు మైదానంలో అడుగు పెడితే తప్ప ప్రపంచకప్‌కు ఊపొచ్చేలా కనిపించడం లేదు.

సౌథాంప్టన్

ప్రపంచకప్ జరుగుతోంది ఇంగ్లాండ్‌లో. టోర్నీలో ఆ దేశ జట్టే హాట్ ఫేవరెట్. టోర్నీ ఆరంభమైంది దక్షిణాఫ్రికాతో ఇంగ్లాండ్ మ్యాచ్‌తోనే. ఈ మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు ఘన విజయం సాధించింది. ఆ తర్వాతి మూడు రోజుల్లో టోర్నీలోని మిగతా జట్లన్నీ కనీసం ఒక్కో మ్యాచ్ ఆడేశాయి. కానీ భారత్ మాత్రం ఇంకా తన పోరాటాన్ని మొదలు పెట్టలేదు. మిగతా జట్లన్నీ మ్యాచ్‌ల్లో తీరిక లేకుండా ఉంటే.. భారత జట్టు మాత్రం నెట్స్‌లో సాధన చేస్తూ, విహారాలు చేస్తూ సాగిపోతోంది. ప్రపంచకప్ ప్రారంభమైన వారం రోజుల తర్వాత.. ఈనెల 5న దక్షిణాఫ్రికాతో టీమ్‌ఇండియా తన తొలి మ్యాచ్ ఆడనుంది. ఇప్పటికే దక్షిణాఫ్రికా టోర్నీలో రెండు మ్యాచ్‌లు ఆడేసి ఉండటం విశేషం. అప్పటికి ఇంగ్లాండ్, పాకిస్థాన్, శ్రీలంక, అఫ్గానిస్థాన్‌లకు రెండేసి మ్యాచ్‌లు పూర్తవుతాయి. భారత్ ఇంత ఆలస్యంగా తన తొలి మ్యాచ్ ఆడుతుండటం వెనుక బీసీసీఐ ఉంది. మే రెండో వారం వరకు ఐపీఎల్ హడావుడిలోనే ఉంటారని తెలిసి, ప్రపంచకప్ షెడ్యూల్ సిద్ధం చేసేటపుడే భారత్ మ్యాచ్ ఆలస్యంగా పెట్టాలని బీసీసీఐ ఐసీసీని కోరింది. ఏదేమైనా విరామ సమయాన్ని టీమ్‌ఇండియా చక్కగా వినియోగించుకుంటోంది. రెండు నెలల పాటు ఐపీఎల్‌లో తీరిక లేకుండా ఉన్న ఆటగాళ్లు ఇంగ్లాండ్‌లో నేద తీరుతున్నారు. సాధన, సాహస క్రీడలతో ఒత్తిడి, అలసటకు దూరంగా ఉంటున్నారు. గురువారం, శనివారం టీమ్‌ఇండియా నెట్స్‌లో శ్రమించింది. శుక్రవారం జట్టంతా సాహస క్రీడలో పాల్గొని ఉల్లాసంగా గడిపింది. ఆదివారం ఆటగాళ్లంతా జిమ్‌లో కసరత్తులు చేశారు. విరామ సమయం కేదార్ జాదవ్‌కు బాగా కలిసొచ్చింది. ఐపీఎల్ గాయపడిన అతడు కోలుకోడానికి దాదాపుగా నెల రోజుల సమయం లభించినట్లయింది. మొత్తానికి జాదవ్ పూర్తి ఫిట్‌నెస్ సాధించినట్లే కనిపిస్తున్నాడు. శనివారం అతడు నెట్స్‌లో చాలా సేపు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు. మ్యాచ్ ఆలస్యంగా ఉండటం ఆటగాళ్లకు కలిసొచ్చేదే కానీ.. ప్రపంచకప్‌లో ఇంకా భారత్ మైదానంలో అడుగు పెట్టకపోవడం అభిమానులకు కాసింత నిరాశ కలిగించేదే. ఐతే కోహ్లీ నేన ఎప్పుడు ఆట మొదలు పెడితే అప్పట్నుంచి ప్రపంచకప్‌లో జోష్ రావడం ఖాయం!

సింహాలపై పులుల పంజా!

330

బంగ్లాదేశ్ స్కోరు. వన్డేల్లో ఆ జట్టుకిదే అత్యధికం. పాకిస్థాన్‌పై 2015లో చేసిన 329 స్కోరును దాటింది. ప్రపంచకప్‌లో ఆ జట్టు 300కు పైగా స్కోరు చేయడమిది రెండోసారి మాత్రమే. దక్షిణాఫ్రికాపై ఆ జట్టు గత అత్యధిక స్కోరు 278 మాత్రమే.

ప్రపంచకప్‌లో మెరుపుల్లేవని.. మ్యాచ్‌లు హోరాహోరీగా సాగట్లేదని.. సంచలన ఫలితాలు రావట్లేదని చింతిస్తున్న అభిమానులకు.. ఒక్క మ్యాచ్‌తో అన్ని ముచ్చట్లూ తీరిపోయాయి. ఆదివారం దక్షిణాఫ్రికా-బంగ్లాదేశ్ మ్యాచ్‌లో పరుగుల వరద పారింది. బౌండరీల మోత మోగిన ఈ మ్యాచ్‌లో 639 పరుగులు నమోదయ్యాయి. రెండు జట్లూ విజయం కోసం హోరాహోరీగా తలపడ్డాయి. చివరికి దక్షిణాఫ్రికాకు షాకిచ్చి తమ ప్రపంచకప్ చరిత్రలో మరో పెద్ద విజయాన్ని నమోదు చేసింది బంగ్లా. ఈసారి కప్పులో సఫారీలపై ముందు నుంచి పెద్దగా అంచనాల్లేవు కానీ.. వరుసగా రెండో మ్యాచ్ ఓడటం, పైగా బంగ్లాదేశ్ చేతిలో కంగుతినడం ఆ జట్టు అభిమానులకు పెద్ద షాకే.

- దక్షిణాఫ్రికాకు షాకిచ్చిన బంగ్లా
- సమష్టి ప్రదర్శనతో సంచలనం

లండన్

ప్రపంచకప్‌ను బంగ్లాదేశ్ అద్భుత విజయంతో ఆరంభించింది. ఆదివారం దక్షిణాఫ్రికాను 21 పరుగుల తేడాతో ఓడించి మిగతా ప్రత్యర్థులకు హెచ్చరికలు పంపారు బంగ్లా పులులు. ఓవల్ మైదానంలో జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట ముష్ఫికర్ రహీమ్ (78; 80 బంతుల్లో 8×4), షకిబ్ అల్‌హసన్ (75; 84 బంతుల్లో 8×4, 1×6), సౌమ్య సర్కార్ (42; 30 బంతుల్లో 9×4), మహ్మదుల్లా (46 నాటౌట్, 33 బంతుల్లో 3×4, 1×6) సత్తా చాటడంతో బంగ్లా 50 ఓవర్లలో 6 వికెట్లకు 330 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారీ లక్ష్యాన్ని ఛేదించడానికి అవసరమైన పెద్ద ఇన్నింగ్స్ దక్షిణాఫ్రికా జట్టులో ఎవరూ ఆడలేదు. కెప్టెన్ డుప్లెసిస్ (62; 53 బంతుల్లో 5×4, 1×6) పోరాటం సరిపోలేదు. దక్షిణాఫ్రికా నిర్ణిత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 309 పరుగులే చేసింది. ముస్తాఫిజుర్ (3/67), సైఫుద్దీన్ (2/57), మెహదీ హసన్ మిరాజ్ (1/44), షకిబ్ (1/50) ఆ జట్టును కట్టడి చేశారు. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన షకిబ్‌కే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

పోరాడారు కానీ..: లక్ష్యం పెద్దదే అయినా.. దక్షిణాఫ్రికా దాన్ని అందుకోవడానికి గట్టిగానే ప్రయత్నించింది. తొలి ఆరుగురు బ్యాట్స్‌మెన్‌లో ప్రతి ఒక్కరూ చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడారు. ఐతే మంచి ఆరంభాల్ని పెద్ద స్కోర్లుగా మలచలేకపోవడం, మ్యాచ్ దక్షిణాఫ్రికా వైపు మొగ్గేలా కనిపించిన ప్రతిసారీ వికెట్ పడటం ఆ జట్టుకు ప్రతికూలమైంది. ఓపెనర్లు మార్క్‌రమ్ (45), డికాక్ (23) మంచి ఆరంభమే ఇచ్చారు. ఐతే సమన్వయ లోపం కారణంగా డికాక్ రనౌటైపోయాడు. తర్వాత డుప్లెసిస్ మార్‌క్రమ్, మిల్లర్ (38)లతో మంచి భాగస్వామ్యాలు నెలకొల్పడంతో ఒక దశలో దక్షిణాఫ్రికా 147/2తో పటిష్ట స్థితిలో నిలిచింది. కానీ ఊపుమీదున్న డుప్లెసిస్‌ను ఔట్ చేసిన స్పిన్నర్ మిరాజ్.. బంగ్లాను పోటీలోకి తెచ్చాడు. ఐతే భాగస్వామ్యాలు కొనసాగాయి. మిల్లర్ ఔటయ్యాక వాండర్ డసెన్ (41), డుమిని (45) నిలకడగా ఆడటంతో 39 ఓవర్లకు దక్షిణాఫ్రికా 228/4తో లక్ష్యం దిశగా సాగుతున్నట్లు కనిపించింది. ఈ దశలో వాండర్‌డసెన్ ఔటవడంతో డుమినికి అండగా నిలిచేవాళ్లు కరవయ్యారు. డుమిని ఉన్నంతసేపూ దక్షిణాఫ్రికా పోటీలోనే ఉంది. 18 బంతుల్లో 44 పరుగులు చేయాల్సిన స్థితిలో అతడిని ఔట్ చేసిన ముస్తాఫిజుర్ బంగ్లా గెలుపు ఖాయం చేశాడు.

దంచారు పద్ధతిగా: మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్.. ఆద్యంతం ఒక ప్రణాళికతో ఆడి భారీ స్కోరుతో దక్షిణాఫ్రికాకు షాకిచ్చింది. ఆరంభంలో సౌమ్య సర్కార్ చెలరేగి ఆడి స్కోరు స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అతడి ధాటికి ఎంగిడి 4 ఓవర్లలోనే 34 పరుగులు సమర్పించుకున్నాడు. సర్కార్ స్కోరు 42 అయితే అందులో ఫోర్లతో (9) వచ్చిన పరుగులే 36. అతను పెద్ద స్కోరు చేయకపోయినా నష్టం మాత్రం ఎక్కువే చేశాడు. బంగ్లా స్కోరు 10 ఓవర్లకే 73కు చేరుకుంది. స్వల్ప వ్యవధిలో ఓపెనర్లు ఔటైపోయినా.. ఆ జట్టుకు ఇబ్బంది లేకపోయింది. సీనియర్ ఆటగాళ్లు షకిబ్, రహీమ్ చక్కటి సమన్వయంతో, సాధికారికంగా ఆడుతూ జట్టును తిరుగులేని స్థితికి తీసుకెళ్లారు. వీళ్లిద్దరూ మూడో వికెట్‌కు 143 బంతుల్లో 142 పరుగులు జోడించారు. 4 ఓవర్లు వేశాక గాయపడ్డ ఎంగిడి మళ్లీ బౌలింగ్‌కు రాకపోవడం దక్షిణాఫ్రికాను గట్టి దెబ్బే తీసింది. మధ్య ఓవర్లలో మోరిస్, తాహిర్, మార్‌క్రమ్‌లను షకిబ్, రహీమ్ అలవోకగా ఎదుర్కొన్నారు. బంగ్లా రన్‌రేట్ ఎక్కడా 6కు తగ్గ లేదు. ఆ జట్టు 32వ ఓవర్లోనే 200 స్కోరు దాటింది. క్రీజులో బాగా కుదురుకున్న షకిబ్‌తో పాటు ధాటిగా ఆడుతున్న మిథున్ (21)ను తాహిర్ తక్కువ వ్యవధిలో పెవిలియన్ చేర్చి దక్షిణాఫ్రికాను పోటీలోకి తెచ్చాడు. ఐతే మహ్మదుల్లా, మొసాడెక్ హుస్సేన్ (26; 20 బంతుల్లో 4×4) చెలరేగి ఆడటంతో బంగ్లా చివరి 10 ఓవర్లలో 86 పరుగులు సాధించి భారీ స్కోరుతో ఇన్నింగ్స్‌ను ముగించింది.

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తమీమ్ (సి) డికాక్ (బి) పెలుక్వాయో 16; సౌమ్య సర్కార్ (సి) డికాక్ (బి) మోరిస్ 42; షకిబ్ (బి) తాహిర్ 75; ముష్ఫికర్ (సి) వాండర్ డసెన్ (బి) పెలుక్వాయో 78; మిథున్ (బి) తాహిర్ 21; మహ్మదుల్లా నాటౌట్ 46; మొసాడెక్ హుస్సేన్ (సి) పెలుక్వాయో (బి) మోరిస్ 26; మిరాజ్ నాటౌట్ 5; ఎక్స్‌ట్రాలు 21 **మొత్తం:** (50 ఓవర్లలో 6 వికెట్లకు)) **330; వికెట్ల పతనం:** 1-60, 2-75, 3-217, 4-242, 5-250, 6-316; **బౌలింగ్:** ఎంగిడి 4-0-34-0; రబాడ 10-0-57-0; పెలుక్వాయో 10-1-52-2; మోరిస్ 10-0-73-2; మార్‌క్రమ్ 5-0-38-0; తాహిర్ 10-0-57-2; డుమిని 1-0-10-0

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ రనౌట్ 23; మార్‌క్రమ్ (బి) షకిబ్ 45; డుప్లెసిస్ (బి) మిరాజ్ 62; మిల్లర్ (సి) మిరాజ్ (బి) ముస్తాఫిజుర్ 38; వాండర్ డసెన్ (బి) సైఫుద్దీన్ 41; డుమిని (బి) ముస్తాఫిజుర్ 45; పెలుక్వాయో (సి) షకిబ్ (బి) సైఫుద్దీన్ 8; మోరిస్ (సి) సర్కార్ (బి) ముస్తాఫిజుర్ 10; రబాడ నాటౌట్ 13; తాహిర్ నాటౌట్ 10; ఎక్స్‌ట్రాలు 14 **మొత్తం:** (50 ఓవర్లలో 8 వికెట్లకు) **309; వికెట్ల పతనం:** 1-49, 2-102, 3-147, 4-202, 5-228, 6-252, 7-275, 8-287; **బౌలింగ్:** ముస్తాఫిజుర్ 10-0-67-3; మెహదీ హసన్ మిరాజ్ 10-0-44-1; సైఫుద్దీన్ 8-1-57-2; షకిబ్ అల్‌హసన్ 10-0-50-1; మొర్తజా 6-0-49-0; మొసాడెక్ హుస్సేన్ 6-0-38-0

మేం ప్రణాళిక ప్రకారం ఆడలేకపోయాం. ఎంగిడి గాయపడడం ప్రతికూలమైంది. 330 చాలా పెద్ద స్కోరు. ఫీల్డింగ్ ఎంచుకోవాల్సింది కాదు. చివరి నాలుగు ఓవర్లలో 54 పరుగులివ్వడం దెబ్బతీసింది. ఇకపై టోర్నీలో కష్టపడాల్సివుంటుంది. పోరాడతాం. ఇప్పుడు మా సామర్థ్యంలో 50-60 శాతమే ఆడగలుగుతున్నాం.

– డుప్లెసిస్, దక్షిణాఫ్రికా కెప్టెన్

మలుపు అక్కడే..

అప్పటికి 47 ఓవర్లు ముగిశాయి. దక్షిణాఫ్రికా స్కోరు 287/7. గెలవాలంటే ఇంకా 18 బంతుల్లో 44 పరుగులు చేయాలి. బంగ్లాదేశే ముందంజలో ఉన్నా.. డుమిని ఊపు మీదున్న నేపథ్యంలో దక్షిణాఫ్రికా కూడా రేసులోనే ఉంది. మ్యాచ్ ఆసక్తికరంగానే ఉంది. కానీ 48వ ఓవర్ తొలి బంతికే డుమినిని ముస్తాఫిజుర్ బౌల్డ్ చేయడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. దక్షిణాఫ్రికా ఆశలకు తెరపడింది. టెయిలెండర్లు ఏం చేయగలరు పాపం! చేయాల్సిన స్కోరు వాళ్లకు చాలా ఎక్కువే.

ఉన్న బాధలు చాలవని..

వరుసగా రెండు ఓటములు.. పైగా బంగ్లాదేశ్ చేతిలో పరాభవం ఎదురైంది.. ఇలాంటి స్థితిలో దక్షిణాఫ్రికాకు మరో చేదు వార్త. బంగ్లాతో మ్యాచ్‌లో తొడకండరాలు పట్టేయడంతో మధ్యలోనే బౌలింగ్ నుంచి తప్పుకున్న యువ ఫాస్ట్‌బౌలర్ ఎంగిడి.. ప్రపంచకప్‌కు దూరమయ్యే ప్రమాదంలో పడ్డాడు. అతడి గాయం తీవ్రత ఎక్కువే అని.. టోర్నీలో కొనసాగకపోవచ్చని అంటున్నారు. భారత్‌తో తర్వాతి మ్యాచ్‌కైతే అతను అందుబాటులో ఉండడని తేలిపోయింది. సీనియర్ ఫాస్ట్‌బౌలర్ స్టెయిన్ సైతం ఫిట్‌నెస్ సమస్యలతో తొలి రెండు మ్యాచ్‌లకు దూరంగా ఉన్నాడు.

మధ్యాహ్నం 3 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో..

రికార్డుల పిచ్‌పై ఇంగ్లాండ్ × పాకిస్థాన్

ప్రపంచకప్ ఫేవరెట్ ఇంగ్లాండ్ మరో పోరుకు సిద్ధమైంది. తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాను చిత్తుచేసిన ఇంగ్లాండ్.. సోమవారం ట్రెంట్ బ్రిడ్జ్‌లో పాకిస్థాన్‌తో తలపడుతుంది. ఐతే ఈ మ్యాచ్‌లో ప్రత్యేకత.. పిచ్! గతంలో ఇంగ్లాండ్ రెండు సార్లు ఈ వికెట్‌పై అత్యధిక వన్డే స్కోర్లతో ప్రపంచ రికార్డులు నమోదు చేసింది. వన్డేల్లో 500 స్కోరుపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఇంగ్లాండ్ సరికొత్త చరిత్ర సృష్టిస్తుందా అన్నది ఆసక్తికరం.

వేదిక: ట్రెంట్ బ్రిడ్జ్

ర్యాంకుల్లో:
ఇంగ్లాండ్- 1, పాకిస్థాన్- 6

కీలక ఆటగాళ్లు: రాయ్, బెయిర్‌స్టో, బట్లర్, రూట్, స్టోక్స్, ఆర్చర్ (ఇంగ్లాండ్) ఫఖర్ జమాన్, బాబర్ అజాం, ఇమామ్‌ుల్ హక్, ఆమిర్ (పాకిస్థాన్)

ఆ మ్యాచ్‌ల్లో..

2016లో ట్రెంట్‌బ్రిడ్జ్‌లో పాక్‌తో వన్డేలో ఇంగ్లాండ్ 3 వికెట్లకు 444 పరుగులు సాధించింది. పాక్ 42.4 ఓవర్లలో 275 పరుగులకే ఆలౌటైంది. నిరుడు ఆస్ట్రేలియాతో ఇదే మైదానంలో ఇంగ్లాండ్ 6 వికెట్లకు 481 పరుగులతో రికార్డును తిరగరాసింది. బెయిర్‌స్టో (139), హేల్స్ (147) చెలరేగారు. బదులుగా ఆసీస్ 239 పరుగులకే కుప్పకూలింది. ఐతే ఈ వేదికలో తాజాగా వెస్టిండీస్‌తో ప్రపంచకప్ మ్యాచ్‌లో పాకిస్థాన్ 105 పరుగులకే కుప్పకూలడం గమనార్హం.

9 ప్రపంచ కప్‌లో ఇంగ్లాండ్, పాక్ ఆడిన మ్యాచ్‌లు. ఇరుజట్లు చెరో 4 మ్యాచ్‌ల్లో గెలవగా.. ఒకదాంట్లో ఫలితం తేలలేదు

87 ఇంగ్లాండ్, పాక్ ఆడిన వన్డేలు. ఇందులో 53 మ్యాచ్‌ల్లో ఇంగ్లాండ్ నెగ్గగా.. 31 మ్యాచ్‌ల్లో పాక్ పైచేయి సాధించింది. 3 మ్యాచ్‌ల్లో ఫలితం తేలలేదు

1 వన్డేల్లో అత్యంత వేగంగా 250 వికెట్లు, 5 వేల పరుగుల ఘనత పూర్తి చేసిన ఆల్‌రౌండర్‌గా బంగ్లాదేశ్ ఆటగాడు షకిబ్ అల్‌హసన్ రికార్డు సృష్టించాడు. ఆదివారం దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో అతనీ ఘనత అందుకున్నాడు. షకిబ్‌కిది 199వ వన్డే. అబ్దుల్ రజాక్ (258 మ్యాచ్‌లు)ను అతను అధిగమించాడు. అఫ్రిది, కలిస్, జయసూర్య కూడా ఈ క్లబ్‌లో ఉన్నారు.

Eenadu epaper

Downloaded from Playstore: Todays NewsPaper Telugu

చాంపియన్

భారత్ సెమీస్‌కు వెళ్తుందో లేదో

దిల్లీ: భారత జట్టు కచ్చితంగా ప్రపంచకప్ సెమీఫైనల్‌కు చేరుకుంటుందని చెప్పలేమని ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ మార్క్ వా అన్నాడు. "ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ సెమీఫైనల్ చేరడం ఖాయం. భారత్ కూడా వెళ్లొచ్చు కానీ.. కచ్చితంగా వెళ్తుందని చెప్పలేం. భారత జట్టు సన్నాహం సరిగ్గా ఉన్నట్లు లేదు. మిడిల్ ఆర్డర్‌లో అనిశ్చితి ఉంది. కోహ్లి, బుమ్రాపై భారత్ అతిగా ఆధారపడి ఉంది. నాలుగో స్థానం కోసం రేసులో విండీస్, దక్షిణాఫ్రికాల కన్నా న్యూజిలాండ్ కాస్త ముందుంది" అని మార్క్ వా అన్నాడు. ఐతే న్యూజిలాండ్ మాజీ వికెట్‌కీపర్ మెక్‌కలమ్ మాత్రం భారత్ సెమీస్ చేరుకుంటుందని అభిప్రాయపడ్డాడు.

అదొక్కటే ఇంగ్లాండ్ సమస్య

హర్షభోగ్లే

ఇంగ్లాండ్, పాకిస్థాన్‌ల మధ్య ట్రెంట్‌బ్రిడ్జ్‌లో జరిగే మ్యాచ్ రెండు జట్లకు.. "అరే.. ఇది ఇప్పటికే జరిగింది కదా" అనే అనుభూతిని అందించనుంది. ఇటీవల వన్డే సిరీస్‌లో ఇంగ్లాండ్ 4-0తో పాక్‌ను చిత్తుచేసింది. పాకిస్థాన్ మరో ఓటమికి సిద్ధంగా లేదు. ఎందుకంటే గత 12 వన్డేల్లో ఆ జట్టుకు విజయం అన్నదే లేదు. మరోవైపు ఆతిథ్య ఇంగ్లాండ్ పూర్తి విశ్వాసంతో ఉంది. ఆత్మవిశ్వాసం ఉంటే సాధారణ జట్టు కూడా సానుకూల దృక్పథంతో కనిపిస్తుంది. అలాంటిది ఇంగ్లాండ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఆత్మవిశ్వాసం మ్యాచ్‌లు గెలిపిస్తుంది.. అహంకారం మ్యాచ్‌లు చేజారుస్తుంది. ఈ రెండింటి మధ్య

ఉన్న సన్నటి గీతను గుర్తించడమే ఇప్పుడు ఇంగ్లాండ్ సమస్య. అయితే ప్రస్తుతం ఆ జట్టు జోరుమీదుంటే.. పాక్ మాత్రం గందరగోళ పరిస్థితుల్లో ఉంది. ప్రపంచ క్రికెట్ చరిత్రను పరిశీలిస్తే గతంలో పాక్ లాగా ఏ జట్టూ తిరిగి పుంజుకోలేదు. వర్తమానం కంటే గతం ఆధారంగానే పాక్‌పై సానుకూల అభిప్రాయాలున్నాయి. ఆ జట్టు మరోసారి బలంగా నిలబడాలంటే వేస్, బౌన్స్‌ను తట్టుకోవాలి. విండీస్‌తో మ్యాచ్ ప్రదర్శన కంటే భిన్నంగా స్పందించాలి. టాప్ ముగ్గురు బ్యాట్స్‌మన్ షార్ట్‌పిచ్ బంతుల్ని జాగ్రత్తగా ఆడాలి. అభిమానులకు సందేశం పంపించే ముందు ఆటగాళ్లు.. ఒత్తిడిని తట్టుకుంటామని తమకు తాము చెప్పుకోవాలి. విండీస్‌తో మ్యాచ్‌లో ఆడినట్లు ఆడితే ట్రెంట్‌బ్రిడ్జ్‌లో కూడా ఎలాంటి ఉపయోగం ఉండదు.

తిరుగులేని ఫెదరర్, నాదల్

- అలవోకగా క్వార్టర్స్‌లోకి ప్రవేశం
- కొంటా, మార్టిచ్ ముందంజ

ఫ్రెంచ్ ఓపెన్లో స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ దూసుకెళ్తున్నాడు. అతను పెద్దగా కష్టపడకుండానే ఈ టోర్నీ క్వార్టర్స్‌లోకి ప్రవేశించాడు. స్పెయిన్ స్టార్ రఫెల్ నాదల్‌తో పాటు వావ్రింకా (స్విట్జర్లాండ్) తుది నాలుగు జాబితాలో చోటు సంపాదించారు. మహిళల సింగిల్స్‌లో బ్రిటన్ అమ్మాయి జోనా కొంటా, వాండ్రూసోవా (చెక్ రిపబ్లిక్), మార్టిచ్ (క్రొయేషియా) క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించారు.

నాదల్

పారిస్

మూడేళ్ల తర్వాత ఫ్రెంచ్ ఓపెన్లో బరిలో దిగిన రోజర్ ఫెదరర్ అదరగొడుతున్నాడు. అతను ఒక్క సెట్ కోల్పోకుండా క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించాడు. ఆదివారం ఏకపక్షంగా సాగిన సమరంలో ఫెదరర్ 6-2, 6-3, 6-3తో లియానార్డో మేయర్ (అర్జెంటీనా)ను చిత్తు చేశాడు. గంటా 42 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో ఫెదరర్ జోరు ముందు మేయర్ నిలువలేకపోయాడు. పదే పదే నెట్ దగ్గరకు దూసుకొస్తూ షాట్లు ఆడిన రోజర్.. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం లేకుండా చేశాడు. ఈ మ్యాచ్‌లో నాలుగు ఏస్‌లతో పాటు 30 విన్నర్లు కొట్టాడు. ఐదుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేశాడు. ఫ్రెంచ్ ఓపెన్లో క్వార్టర్స్ చేరడం అతనికిది పన్నెండోసారి. మొత్తం మీద రోజర్‌కు గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్‌ఫైనల్ చేరడం ఈ స్విస్ వీరుడికి ఇది 54వ సారి. ట్రైటిల్ ఫేవరెట్ రఫెల్ నాదల్ కూడా క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించాడు. ప్రిక్వార్టర్స్‌లో రెండో సీడ్ నాదల్ 6-2, 6-3, 6-3తో లాండెరో (అర్జెంటీనా)పై విజయం సాధించాడు. ఈ మ్యాచ్‌లో నాదల్ ఆరు ఏస్‌లతో పాటు 40 విన్నర్లు కొట్టాడు. స్విస్ స్టార్ వావ్రింకా అతికష్టం మీద ప్రిక్వార్టర్స్ దాటాడు. అతను 7-6 (8-6),



ఫెదరర్

5-7, 6-4, 3-6, 8-6తో గ్రీకు యువ కెరటం సిట్సిపాస్‌ను ఓడించాడు. ఐదు గంటలకు పైగా హోరాహోరీ జరిగిన ఈ మ్యాచ్‌లో 16 ఏస్‌లు సంధించిన వావ్రింకా.. 62 విన్నర్లు కొట్టాడు. క్వార్టర్స్‌లో అతను సహచర ఆటగాడు ఫెదరర్‌తో పోటీపడనున్నాడు.

దూసుకెళ్తున్న కొంటా, మార్టిచ్: మహిళల సింగిల్స్‌లో బ్రిటన్ టీనేజర్ జోనా కొంటా, క్రొయేషియా భామ పెట్రా మార్టిచ్ క్వార్టర్స్‌లో ప్రవేశించారు. ప్రిక్వార్టర్స్‌లో కొంటా 6-2, 6-4తో వికిచ్ (క్రొయేషియా)ను ఓడించింది. 1983 తర్వాత ఫ్రెంచ్ ఓపెన్లో మహిళల విభాగంలో క్వార్టర్స్ చేరిన ఘనత కొంటాదే. మరో ప్రిక్వార్టర్స్‌లో మార్టిచ్ 5-7, 6-2, 6-4తో కనెపి (ఇస్టోనియా)ను ఓడించింది. వాండ్రూసోవా 6-2, 6-0తో 12వ సీడ్ సెవాస్టోవా (లాత్వియా)కు షాకిచ్చింది. స్టోన్‌స్టేఫెన్స్ (అమెరికా) 6-4, 6-3తో ముగురుజ (స్పెయిన్)పై గెలిచింది.

బోపన్న పరాజయం: పురుషుల డబుల్స్‌లో రోహన్ బోపన్న పోరాటం ముగిసింది. ఆదివారం జరిగిన ప్రిక్వార్టర్స్‌లో బోపన్న-మారిస్ కొపెల్ (రొమేనియా) 6-1, 5-7, 6-7 (8-10)తో లజోవిచ్-తిప్సరవిచ్ (సెర్బియా) చేతిలో ఓడారు. లియాండర్ పేస్ కూడా డబుల్స్‌లో ఓడిన సంగతి తెలిసిందే.

మేం ఆడింది మ్యాచేనా?

లండన్: న్యూజిలాండ్‌తో ప్రపంచకప్‌లో తామాడింది అసలు మ్యాచే కాదని శ్రీలంక ఓపెనర్ కరుణరత్నె అన్నాడు. సమస్యంతా తమ ఆలోచనా ధోరణిలోనే ఉందని అతను పేర్కొన్నాడు. "ప్రతి ఒక్కరూ మంచి మ్యాచ్ చూడాలని స్టేడియానికి వస్తారు. ఎంతో డబ్బులు పెట్టుకుని.. ఎంతో దూరం నుంచి వచ్చిన అభిమానులకు మంచి మ్యాచ్ అనుభవం అందించడం మా బాధ్యత. ఓడిపోవడం ప్రతి జట్టుకు మామూలే. కానీ అసలు పోరాడకపోవడమే సమస్య. అందరూ ఆడి 130 పరుగులే చేస్తే అది అసలు మ్యాచే కాదు. దీనికి కారణం పిచ్ కాదు మా ఆలోచనా ధోరణే. మేం పోరాడి ఓడి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేది. ఈ ఓటమిని జీర్ణించుకోవడం కష్టంగా ఉంది" అని కరుణరత్నె పేర్కొన్నాడు.

కోహ్లి వేలికి గాయం

సౌథాంప్టన్: ప్రపంచకప్‌లో బుధవారం దక్షిణాఫ్రికాతో తన తొలి మ్యాచ్ ఆడబోతున్న టీమ్ ఇండియాను కలవర పెట్టే పరిణామం చోటు చేసుకుంది. నెట్స్‌లో సాధన చేస్తుండగా.. కెప్టెన్ విరాట్ కోహ్లి కుడి చేతి బొటన వేలికి గాయమైంది. బంతి గట్టిగా వేలికి తాకడంతో విరాట్ నొప్పితో బాధ పడ్డాడు. వేలికి ఐస్ పెట్టుకుని మైదానాన్ని వీడాడు. ఐతే గాయాన్ని పరిశీలించిన ఫిజియో ప్యాట్రిక్ ఫర్హత్ ఆందోళన అక్కర్లేదని చెప్పడంతో భారత జట్టు ఊపిరి పీల్చుకుంది. కోహ్లి త్వరగానే కోలుకుంటాడని, మ్యాచ్‌కు కచ్చితంగా అందుబాటులో ఉంటాడని జట్టు వర్గాలు ధ్రువీకరించాయి. ప్రపంచకప్ ముంగిట భారత్‌ను ఇప్పటికే గాయాలు ఇబ్బంది పెడుతున్నాయి. ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ న్యూజిలాండ్‌తో వార్మప్ మ్యాచ్‌లో మోచేతిని గాయపరుచుకున్నాడు. అతను ఆ మ్యాచ్‌కు అర్ధంతరంగా దూరమయ్యాడు. బంగ్లాదేశ్‌తో చివరి వార్మప్ మ్యాచ్‌కూ అతను అందుబాటులో లేడు. మరోవైపు ఐపీఎల్ సందర్భంగా గాయపడ్డ కేదార్ జాదవ్ కోలుకునే ప్రయత్నంలో ఉన్నాడు.

రిచర్డ్స్ ఫోన్‌తో రిటైర్మెంట్ వద్దనుకున్నా

లండన్: తాను 2007లోనే రిటైర్మెంట్ గురించి ఆలోచించానని, విండీస్ క్రికెట్ దిగ్గజం వివ్ రిచర్డ్స్ నుంచి వచ్చిన ఫోన్ కాల్‌తో మనసు మార్చుకున్నానని సచిన్ తెందుల్కర్ చెప్పాడు. 2007 ప్రపంచకప్ తన కెరీర్‌లోనే అత్యంత నిమ్న దశ అని అన్నాడు. "ఆ ప్రపంచకప్ తర్వాత ఇక క్రికెట్ చాలనిపించింది. ఆ దశలో భారత క్రికెట్ చుట్టూ అనారోగ్యకర పరిస్థితులు నెలకొని ఉన్నాయి. మనకు కొన్ని మార్పులు అవసరం అనిపించింది. ఆ మార్పులు జరగకపోతే క్రికెట్ నుంచి వైదొగులుగుదామనుకున్నా. ఆటకు వీడ్కోలు పలకాలని దాదాపు 90 శాతం నిర్ణయించుకున్నా కూడా. కానీ 2011లో భారత్‌లో ప్రపంచకప్ ఫైనల్ జరుగుతుందని నా సోదరుడు చెప్పాడు. 'ఆ అందమైన ట్రోఫీని నీ చేతులతో పట్టుకున్నట్లు ఊహించుకో' అన్నాడు" అని సచిన్ చెప్పాడు. "ఆ తర్వాత నేను నా వ్యవసాయ క్షేత్రానికి వెళ్లా. ఆ సమయంలో సర్ వివ్ నుంచి నాకు ఫోన్ వచ్చింది. 'నీలో ఇంకా చాలా క్రికెట్ ఉంది' అని అతడు చెప్పాడు. మేం 45 నిమిషాలు మాట్లాడుకున్నాం. నా బ్యాటింగ్ హీరో నాకు ఫోన్ చేసినందుకు నాకు చాలా సంతోషం కలిగింది" అని సచిన్ ఓ కార్యక్రమంలో చెప్పాడు.

నెయ్‌మార్‌పై అత్యాచార ఆరోపణలు

రియో డి జనీరో: బ్రెజిల్ ఫుట్‌బాల్ స్టార్ నెయ్‌మార్ గత నెల పారిస్‌లో తనపై అత్యాచారం చేశాడని ఓ గుర్తు తెలియని మహిళ ఆరోపించింది. ఈ మేరకు అతడిపై ఫిర్యాదు అందినట్లు సావో పౌలో పోలీసులు పేర్కొన్నారు. ఐతే తనపై ఆరోపణలను నెయ్‌మార్ ఖండించాడు. ఆ మహిళ అంగీకారంతో ఆమెతో శృంగారంలో పాల్గొన్నానని, తన వద్ద డబ్బులు గుంజడానికే ఆమె తనను తప్పుడు కేసులో ఇరికించడానికి ప్రయత్నిస్తోందని చెప్పాడు. మే 15న అత్యాచారం జరిగినట్లు ఆ మహిళ ఫిర్యాదులో పేర్కొంది. ఐతే ఆ తర్వాత ఆమెతో తాను జరిపిన స్నేహపూర్వక వాట్సాప్ సంభాషణలను నెయ్‌మార్ సోషల్ మీడియాలో వెల్లడించాడు. అత్యాచార ఆరోపణలు చేసిన మహిళ తన కొడుకును బ్లాక్‌మెయిల్ చేస్తోందని నిరూపించడానికి తన వద్ద ఆధారాలు ఉన్నాయని నెయ్‌మార్ తండ్రి సాంతోస్ చెప్పాడు.

పది మొక్కలు నాటాల్సిందే

- పొగాకు క్యూరింగ్‌కు భారీగా వినియోగిస్తున్న వంటచెరకు
- ఆ స్థాయిలో మొక్కలు పెంచడంలో నిర్లక్ష్యం
- నాటితేనే అనుమతుల పునరుద్ధరణ
- పొగాకు బోర్డు స్పష్టీకరణ

ఈనాడు - అమరావతి

పొగాకు క్యూరింగ్‌కు కిలోల కొద్దీ కట్టెలను కాలుస్తుండగా.. మొక్కలను నాటడం మాత్రం అనుకున్నంత వేగంగా జరగడం లేదు. ఒక కిలో పొగాకు క్యూరింగ్ చేయాలంటే అయిదు కిలోల కట్టెలు కాల్చాలి. ఈ లెక్కన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో పొగాకు బోర్డు అనుమతించిన 236 మిలియన్(23.60 కోట్లు) కిలోల పొగాకు క్యూరింగ్‌కు 11,80,000 టన్నుల వంట చెరకు మండిస్తున్నారు. ఏడాదికి ఇంత పెద్ద మొత్తంలో కర్రను కాలుస్తున్నా.. ప్రత్యామ్నాయంగా మొక్కల పెంపకం చేపట్టడం లేదనే అంశంపై బోర్డు దృష్టి సారించింది. బ్యారన్‌కు ఏడాదికి పది మొక్కలు చొప్పున నాటాల్సిందే అనే నిబంధనను ఇక నుంచి

పక్కాగా అమలు చేయాలని నిర్ణయించింది. వేడిగాలుల ఆదాలో భాగంగా బ్యారన్ల ఇన్సులేషన్‌కు కూడా ఆర్థిక సహకారం అందించనుంది.

పొగాకులో క్యూరింగ్ కీలకం

పొగాకు మొక్కల నుంచి ఆకు కత్తిరించాక.. దాన్ని కర్రలకు అల్లి బ్యారన్‌లో ఆరు నుంచి ఏడు రోజుల పాటు క్యూరింగ్(వేడి గాలులు పంపడం ద్వారా పచ్చి ఆకును ఎండబెట్టే ప్రక్రియ) చేస్తారు. బ్యారన్‌లోకి వేడిగాలులు పంపడానికి అక్కడ ఏర్పాటు చేసిన పొయ్యి వెలిగించి నిత్యం రగిలించాలి. దీనికి వంట చెరకు అవసరమవుతుంది. ఒక బ్యారన్‌లో ఏడాదికి ఆరు నుంచి 8 దఫాలుగా క్యూరింగ్ చేయాల్సి వస్తుంది. అంటే ఏడాదిలో 56 రోజుల పాటు పొయ్యి మండుతూనే ఉంటుంది.

- దీనికి వంట చెరకుగా ఆంధ్రప్రదేశ్‌లో అయితే ఖాళీ పొలాలు, రోడ్ల వెంట పెరిగే తుమ్మ కర్ర, మొద్దులను వినియోగిస్తుంటారు. కొందరు యూకలిప్టస్, సుబాబుల్ మొద్దులను ఉపయోగిస్తారు. కర్ణాటకలో కాఫీ గింజల పొట్టుతోపాటు తొలగించిన చెట్ల మొద్దులను వేస్తారు.
- గతంలో బ్రికెట్స్ (పంటకాలం పూర్తయ్యాక ఎండిపోయిన పత్తి, మిర్చి కట్టెలతో తయారు చేసేవి) వినియోగించేవారు. తుమ్మ కర్ర టన్ను రూ.2,500 ఉంటే.. బ్రికెట్స్‌కు అంతకు మించిన వ్యయం అవుతోంది. ఇది గిట్టుబాటు కాకపోవడంతో రైతులు ఉపయోగించడం లేదు.

ఏడాదికి ఎంత వినియోగం

అనుమతించిన పొగాకు ఉత్పత్తి (కిలోల్లో)	
ఆంధ్రప్రదేశ్	13,60,00,000
కర్ణాటక	10,00,00,000
మొత్తం	23,60,00,000
పొగాకు క్యూరింగ్‌కు అవసరమయ్యే కర్ర	11,80,000 టన్నులు

బ్యారన్‌కు ఏడాదికి పది మొక్కలు

పొగాకు క్యూరింగ్‌కు భారీగా వంట చెరకు వినియోగిస్తున్న నేపథ్యంలో పర్యావరణ సమస్య తలెత్తకుండా బ్యారన్‌కు ఏడాదికి పది మొక్కలు నాటాలనే నిబంధన ఉంది. అయినా ఎక్కడా పచ్చదనం కన్పించడం లేదు.

బ్యారన్లు	
ఆంధ్రప్రదేశ్	39,654
కర్ణాటక	55,997
మొత్తం	95,651
మొక్కలు నాటితే	
బ్యారన్‌కు ఏడాదికి 10 మొక్కలేస్తే	9,56,510
పదేళ్లలో వేయాల్సింది	95,65,100
నాటిన వాటిలో 50 శాతం ఎదిగినా	47,82,550

ఫలితంగానే పచ్చదనం తరిగిపోయి వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వానల్లేక పొగాకు దిగుబడులు తగ్గిపోతున్నాయి. రైతులు కూడా ఆర్థికంగా నష్టపోతున్నారు. అందుకే వచ్చే ఏడాది నుంచి మొక్కలు నాటాలనే నిబంధన పక్కాగా అమలు చేయబోతున్నారు.

బ్యారన్ల ఇన్సులేషన్‌కు ఆర్థిక సహకారం

'వచ్చే ఏడాది నుంచి బ్యారన్‌కు పది మొక్కలు నాటాలనే నిబంధన అమలు చేస్తాం. వాటిని ఉచితంగా సరఫరా చేస్తాం. లేదంటే అనుమతులు పునరుద్ధరించం' అని పొగాకు బోర్డు ఛైర్మన్ కె.సునీత తెలిపారు. వంటచెరకు కాల్చడం ద్వారా లోపలకు పంపే వేడిగాలులు వృథా కాకుండా బ్యారన్ల ఇన్సులేషన్‌పై దృష్టి సారించామన్నారు. దీనివల్ల 15 నుంచి 20 శాతం వంటచెరకు ఆదా అవుతుందని చెప్పారు. కర్ణాటకలో రూ.15,000, ఆంధ్రప్రదేశ్‌లో రూ.23వేల నుంచి రూ.27 వేల చొప్పున ఖర్చవుతుందని తెలిపారు. దీనికి అయ్యే వ్యయంలో వ్యాపారులు 50శాతం, బోర్డు 25శాతం భరిస్తాయని.. మిగిలిన 25శాతం రైతులు సమకూర్చుకోవాల్సి ఉంటుందన్నారు.

ఏపీఎంఏ గౌరవాధ్యక్షుడిగా విజయసాయిరెడ్డి

సంఘ ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో నిర్ణయం

సమావేశంలో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్, పక్కన పురుషోత్తం

విజయవాడ, న్యూస్‌టుడే: రాష్ట్ర ఒలింపిక్ సంఘం (ఏపీవోఏ) గౌరవాధ్యక్షుడిగా వైకాపా నేత, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్‌కే పురుషోత్తం తెలిపారు. ఇటీవల తిరుపతిలో జరిగిన ఏపీవోఏ సమావేశంలో వైకాపా ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కృష్ణదాస్ అధ్యక్షతన ఆదివారం విజయవాడలో సంఘం ప్రత్యేక సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులోనే విజయసాయిరెడ్డిని గౌరవాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. రాష్ట్రంలో అవినీతి రహిత క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ధర్మాన కృష్ణదాస్ పేర్కొన్నారు. భారత వాలీబాల్ మాజీ కోచ్ ఎ.రమణరావు సూచనలతో ఒక కమిటీని వేశామని, రాష్ట్రంలో ప్రతి ఏటా అత్యధిక పతకాలు సాధించిన క్రీడా సంఘానికి ఉత్తమ సంఘంగా అవార్డును అందిస్తామని ఆయన చెప్పారు.

యూపీలో పశు సంరక్షణశాలల మూలనిధిపై మార్గదర్శకాలు జారీ

లఖ్‌నవూ: ఉత్తర్ ప్రదేశ్(యూపీ)లో పశు సంరక్షణశాలల ఏర్పాటు, నిర్వహణకు అవసరమైన మూలనిధిని సిద్ధం చేసే దిశగా సీఎం యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ప్రభుత్వం ముందడుగేసింది. అందుకు అవసరమైన నిబంధనలు, మార్గదర్శకాలను అధికారికంగా జారీ చేసింది. మంత్రిమండలి ఆమోదం గత మంగళవారమే లభించిన నేపథ్యంలో 'ఉత్తర్ ప్రదేశ్ గో సంరక్షణ, అభివృద్ధి నిధి నిబంధనలు-2019' పేరుతో తాజా అధికారిక ప్రకటన వెలువరించినట్లు పశు సంవర్ధకశాఖ అధికారులు వెల్లడించారు. వీధుల్లో తిరిగే పశువులను ఈ ఆశ్రయాలకు తరలించి రక్షణ కల్పిస్తారు. గో సంరక్షణకు సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కూడా నిధి దోహదపడే అవకాశముంది. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సహాయం, విరాళాలు తదితర మార్గాల్లో ఈ నిధిని సమకూర్చుకోనున్నారు.

దిల్లీలో ఎన్‌కౌంటర్: ముగ్గురి అరెస్టు

దిల్లీ: ఆగ్నేయ దిల్లీలోని నిజాముద్దీన్ ప్రాంతంలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్ అనంతరం ముగ్గురు అనుమానితులను పోలీసులు అరెస్టుచేశారు. మోటారుసైకిల్ మీద వెళ్తున్న యువకులను పోలీసులు లాలా లాజ్‌పత్‌రాయ్ మార్గ్ వద్ద ఆపగా, ఓ యువకుడు తప్పుకునే ప్రయత్నంలో కాల్పులు జరిపాడు. పోలీసులు అతడి కాళ్లమీద కాల్చి అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన ఇద్దరినీ కొద్దిదూరంలోనే పట్టుకున్నారు. వారిని ఫైజన్ (22), సల్మాన్ (22), షుయైబ్ (21)గా గుర్తించారు. వీరిలో ఫైజన్ పోలీసుల వైపు కాల్పులు జరిపాడు. అతడిని ఎయిమ్స్ ట్రామా సెంటరులో చేర్చారు. ముస్తఫాబాద్‌కు చెందిన అతడిపై గొలుసు దొంగతనాలు, దోపిడీ, ఆయుధాల చట్టం కింద 13 కేసులున్నాయి.

తుది దశకు చేరుకున్న కథువా కేసు విచారణ

జమ్ము: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కథువా హత్యాచారం కేసు విచారణ దాదాపుగా పూర్తికావొచ్చిందని అధికారులు ఆదివారం వెల్లడించారు. పంజాబ్‌లోని పఠాన్‌కోట్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ కోర్టులో నిందితుల తరపు న్యాయవాదులు తమ వాదనలను సోమవారం పూర్తి చేసే అవకాశముందని తెలిపారు. త్వరలోనే తీర్పు వెలువడుతుందని అభిప్రాయపడ్డారు. గత ఏడాది జనవరిలో జమ్మూకశ్మీర్‌లోని కథువాలో 8 ఏళ్ల బాలికను అపహరించిన కొందరు కామాంధులు.. 4 రోజులపాటు సామూహిక అత్యాచారం జరిపి ఆపై హత్య చేయడం కలకలం సృష్టించింది. ఈ కేసు విచారణకు జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో సుప్రీంకోర్టు పఠాన్‌కోట్ కోర్టుకు కేసును బదిలీ చేసింది.

ప్రభుత్వం తప్పు చేస్తే అప్రమత్తం చేస్తాం

- నిర్మాణాత్మక సలహాలిస్తాం
- ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్

కాన్పుర్: ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ప్రభుత్వం చాలా శక్తిమంతమైనదని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ అన్నారు. అలా అని ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేస్తామంటే కుదరదన్నారు. ఒకవేళ ప్రభుత్వం అలాంటి తప్పులు చేస్తే ఆర్ఎస్ఎస్ నిర్మాణాత్మక సలహా లిచ్చి అప్రమత్తం చేస్తుందని వ్యాఖ్యానించారు. కాన్పుర్‌లో జరిగిన ఆర్ఎస్ఎస్ కార్యక్రమంలో మాట్లాడారు. భాజపా నేతృత్వంలోని ఎన్డీయే కూటమి రెండోసారి కేంద్రంలో అధికారం చేపట్టిన మూడు రోజులకే మోహన్ భగవత్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అనంతరం జరిగిన మరో ఆరెస్సెస్ సమావేశంలో మోహన్ భగవత్ మాట్లాడుతూ సంఘ్ కార్యకర్తలు అహంకారంగా ఉండొద్దని హితవు పలికారు. ఎదుటివారికి ఎంత సేవ చేసినా, ఎన్ని మంచి పనులు చేసినా అహంకారం ఉంటే పనికిరామని ఆయన చెప్పినట్లు మోహన్ అగర్వాల్ వెల్లడించారు.

పట్టభద్రులకు శ్రేయస్కరం

- డిగ్రీ విద్యార్థుల కోసం 'శ్రేయస్' పేరుతో ప్రత్యేక పథకం
- ఈ విద్యాసంవత్సరం నుంచి అమలుకు సన్నాహాలు

న్యూస్‌టుడే - విజయవాడ విద్య

ఇప్పటివరకు బీఏ, బీకాం, బీఎస్సీలు సాధారణ డిగ్రీలుగా కనిపిస్తున్నాయి. రానున్న రోజుల్లో ఈ కోర్సులు పూర్తయిన వెంటనే ఉద్యోగాలు వచ్చే అవకాశాలు మెరుగుపడుతున్నాయి. ఇందుకు అవసరమైన నైపుణ్యాలను ఇక నుంచి డిగ్రీ స్థాయిలో 'శ్రేయస్' పథకం ద్వారా విద్యార్థులకు అందించనున్నారు. ఇందుకోసం కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ.. ఉన్నత విద్య యువతకు అప్రెంటిస్, నైపుణ్య పథకాన్ని (ఎస్ హెచ్ఆర్ఈఏఎస్- శ్రేయస్) అమల్లోకి తెచ్చింది. ఈ పథకాన్ని 2018-19లో ప్రారంభించినా ఇటు కళాశాలలకు, విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన లేక తక్కువగానే అభ్యర్థులు నమోదు చేసుకున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఈ పథకాన్ని విస్తృతంగా అమలుచేయాలని కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ నిర్ణయించింది.

శ్రేయస్ అంటే..

వృత్తివిద్యా కోర్సుల మాదిరి సంప్రదాయ డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యాలు అందిస్తారు. కోర్సు పూర్తి కాగానే ఉపాధి అవకాశాలు లభించేలా అకడమిక్ స్థాయిలోనే మార్పు చేస్తారు. ఈ పథకాన్ని కేంద్ర మానవ వనరులు, నైపుణ్యాభివృద్ధి, కార్మిక, ఉపాధి కల్పన శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తాయి. సంప్రదాయ డిగ్రీ కోర్సు విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యాలు అందించేందుకు డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీలలో ప్రొఫెషనల్ కోర్సులు ప్రవేశపెట్టనున్నారు.

అప్రెంటిస్‌షిప్ అవకాశాలు

కోర్సు పూర్తి చేసే సమయానికి విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభించేలా అప్రెంటిస్‌షిప్ అందించడమే శ్రేయస్ లక్ష్యం. ఐటీ, రిటైల్, లాజిస్టిక్స్, పర్యాటకం, వైద్యరంగం, ఎలక్ట్రానిక్స్, మీడియా, లైఫ్‌సైన్సెస్, మేనేజ్‌మెంటు విభాగాల్లో కోర్సులను అందుబాటులోకి తీసుకురానున్నారు. డిగ్రీ కోర్సు సమయంలో ఆరు నెలల నుంచి పది నెలలపాటు అప్రెంటిస్‌షిప్‌ను తప్పనిసరిగా

పూర్తి చేయాలి. శిక్షణ సమయంలో విద్యార్థులకు పరిశ్రమలు నెలకు రూ.6వేల ఉపకారవేతనం అందిస్తాయి. శిక్షణ అనంతరం నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే నైపుణ్య ధ్రువపత్రం లభిస్తుంది.

విద్యాసంస్థలు ఏం చేయాలి?

ఈ పథకాన్ని పటిష్ఠంగా అమలు చేసే విషయంలో విద్యాసంస్థలు కీలకపాత్ర పోషించాల్సి ఉంటుంది. ఉన్నత విద్యాసంస్థలు శ్రేయస్ పోర్టల్‌లో నమోదు కావాలి. విద్యాసంస్థ నుంచి అప్రెంటిస్‌షిప్ కోరుకుంటున్న విద్యార్థుల సంఖ్య వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలి. వీటిని సెక్టార్ స్కిల్ కౌన్సిల్ పరిశీలించి ఆయా పరిశ్రమల్లో ఖాళీల వివరాలను అందిస్తుంది. శ్రేయస్ ద్వారా కళాశాలలు తమ విద్యార్థుల వివరాలను అందించే ప్రక్రియ ఏటా డిసెంబరులో నిర్వహిస్తారు.

Eenadu epaper

Downloaded from Playstore: Todays NewsPaper Telugu

జాతీయ పోలీసు స్మారక స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న అమిత్ షా

అమరవీరులకు అమిత్ షా నివాళులు

దిల్లీ: రాజధానిలోని చాణక్యపురి ప్రాంతంలో ఉన్న జాతీయ పోలీసు స్మారక స్తూపాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదివారం సందర్శించారు. పోలీసు అమరవీరులకు ఆయన నివాళులు అర్పించారు. అక్కడ ఉన్న పోలీసు మ్యూజియంను తిలకించారు. ఆయన వెంట హోంశాఖ కార్యదర్శి రాజీవ్ గౌబా, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ రాజీవ్ జైన్ ఉన్నారు. విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన 34 వేల మంది పోలీసుల సంస్మరణార్థం నిర్మించిన ఈ స్తూపాన్ని గత ఏడాది ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు.

గాంధీజీపై ఐపీఎస్ అధికారి వివాదాస్పద ట్వీట్

ముంబయి: 'ప్రపంచవ్యాప్తంగా మహాత్మా గాంధీ విగ్రహాలను కూల్చేయాలి. కార్యాలయాల్లో చిత్రపటాలను తొలగించాలి. కరెన్సీ నోట్లపై ఆయన ఫొటో తీసేయాలి. గాంధీజీని హత్య చేసిన గాడ్సేకు కృతజ్ఞతలు'' అంటూ ట్వీట్ చేసిన మహారాష్ట్ర ఐపీఎస్ అధికారిణి, బీఎంసీ డిప్యూటీ మున్సిపల్ కమిషనరు నిధిచౌదరి ట్వీట్‌పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గాడ్సేను కీర్తిస్తున్న ఆమెను వెంటనే సస్పెండ్ చేయాలని ఎన్సీపీ నాయకుడు జితేంద్ర అవ్హాడ్, మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌చవాన్ డిమాండు చేశారు. దీనిపై నిధిచౌదరి మాట్లాడుతూ తను వ్యంగ్యంగా ఆ వ్యాఖ్యలు చేశానన్నారు. ఇటీవల గాంధీజీని విమర్శిస్తూ పలువురు సామాజిక మాధ్యమాల్లో ఇష్టం వచ్చినట్లు స్పందిస్తున్నారన్నారు. ఇలాంటివి చూడాల్సిన అగత్యం పట్టకుండా ఆ మహాత్ముడిని చంపిన గాడ్సేకు కృతజ్ఞతలు చెప్పానని వివరణ ఇచ్చారు.

హిందీని బలవంతంగా రుద్దుతారా?

- 'త్రిభాష'పై దక్షిణాది రాష్ట్రాల్లో విమర్శలు
- స్టాలిన్, థరూర్, కుమారస్వామి మండిపాటు

కుమారస్వామి

స్టాలిన్

చెన్నై/దిల్లీ: త్రిభాషా సూత్రం పేరుతో బలవంతంగా తమపై హిందీని రుద్దుతున్నారంటూ పలు దక్షిణాది రాష్ట్రాలు మండిపడుతున్నాయి. మానవవనరుల శాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్‌కు ఇస్రో మాజీ ఛైర్మన్ కస్తూరిరంగన్ సమర్పించిన ముసాయిదా నివేదిక ఈ నిరసనలకు కారణమైంది. 3 నుంచి 8 ఏళ్ల మధ్య వయసు గల పిల్లలు వివిధ భాషలను సులువగా నేర్చుకుంటారని, అందుకే వారికి మూడు భాషలను పరిచయం చేయాలని చెప్పారు. దానివల్ల వారు మాట్లాడటానికి వీలవుతుందని అన్నారు. హిందీయేతర రాష్ట్రాల్లో హిందీని బోధించాలని ఆయన సూచించారు. సరిగా ఇదే ప్రతిపాదన దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాలకు కారణమైంది.

మొదటి నుంచి హిందీని వ్యతిరేకిస్తూ వచ్చిన తమిళనాడులోని ద్రవిడ నాయకులు ఈ ప్రతిపాదనలను వ్యతిరేకించారు. ఇది తేనెతుట్టెపై రాయి వేయడమేనని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ మండిపడ్డారు. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ద్వారా కేంద్రం నిప్పుతో చెలగాటం ఆడుతోందని పార్టీ నాయకుడు టి.శివ విమర్శించారు. తమిళనాడు విద్యాశాఖ మంత్రి కేపే సెంగొట్టియన్, ఎంఎన్ఎం అధ్యక్షుడు కమల్‌హాసన్ తదితరులు కూడా హిందీ బోధన ప్రతిపాదనలపై మండిపడ్డారు. మరోవైపు కేరళకు చెందిన కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ కూడా హిందీ బోధనను వ్యతిరేకించారు. దక్షిణాదిలో చాలా మంది హిందీని ద్వితీయభాషగా నేర్చుకుంటారని, కానీ ఉత్తరాదిలో మాత్రం తమిళం, మళయాళాలను ఎవరూ నేర్చుకోరని ఆయన అన్నారు. త్రిభాషా సూత్రం పేరుతో ఒక భాషను రుద్దడం సరికాదని కర్ణాటక ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి ట్వీట్ చేశారు.

గతంలోనూ నిరసనలు

గతంలో ఒకసారి త్రిభాషా సూత్రం ప్రకారం హిందీని తప్పనిసరిగా బోధించాలన్నప్పుడు కూడా తమిళనాడులో తీవ్రస్థాయిలో నిరసనలు వ్యక్తమయ్యాయి. అప్పటికి 14 ఏళ్ల వయసున్న కరుణానిధి తన హిందీ ఉపాధ్యాయుడి మీద ఒక కరపత్రం విసిరారు. అందులో 'హిందీ ఒళిగ.. తమిళ్ వాళ్ల' అని రాశారు. 'హిందీ డౌన్ డౌన్.. తమిళం వర్ధిల్లాలి' అని దానికి అర్థం. ఆ తర్వాత చాలా కాలం పాటు అది ఒక నినాదంగా నిలిచిపోయింది.

ప్రజాభిప్రాయ సేకరణ తర్వాతే

ప్రజాభిప్రాయ సేకరణ తర్వాతే విద్యా కమిటీ డ్రాఫ్టు నివేదికను అమలు చేయనున్నట్లు కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, ప్రకాశ్ జావడేకర్ తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణ తర్వాతే నివేదికను అమలు చేస్తారని నిర్మలా సీతారామన్ ట్వీట్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తమిళానికి తగిన ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కస్తూరి రంగన్ నివేదికను కేంద్రం ఇంకా పరిగణనలోకి కూడా తీసుకోలేదని జావడేకర్ అన్నారు. ఈలోపే లేనిపోని అనుమానాలు తగవని చెప్పారు.

84 విమానాశ్రయాల్లో బాడీ స్కానర్లు

కేంద్ర ప్రభుత్వం ఆదేశం

దిల్లీ: దేశంలోని 84 విమానాశ్రయాల్లో 2020 మార్చి నాటికి బాడీ స్కానర్లు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతం ఉన్న ద్వారంలాంటి మెటల్ డిటెక్టర్లు, చేతితో వినియోగించే స్కానర్లను ఉపసంహరించాలని తెలిపింది. వీటి ద్వారా ప్రయాణికులు రహస్యంగా తీసుకెళ్తున్న ఆయుధాలు, పేలుడు పదార్థాల ఉనికిని గుర్తించలేకపోతున్నారని, అందువల్ల అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉన్న బాడీ స్కానర్లను ఏర్పాటు చేయాలని సూచించింది. దేశంలో కార్యకలాపాలు జరుగుతున్న విమానాశ్రయాలు 105 ఉండగా, అందులో 28ని అతిసున్నితమైన విమానాశ్రయాలుగా, మరో 56ను సున్నితమైనవిగా గుర్తించారు. తొలుత ఇక్కడ బాడీ స్కానర్లను ఏర్పాటు చేస్తారు. ప్రయాణికులు తాము ధరించిన కోట్లు, దళసరి వస్త్రాలు, బూట్లు, బెల్టులు, లోహ సంబంధమైన ఇతర వస్తువులను తీసివేసి స్కానర్‌లో ప్రవేశించాల్సి ఉంటుంది. స్కాన్ చేసినప్పుడు ప్రయాణికుల శరీర భాగాలు కనిపించవు. ఏవైనా అవాంఛనీయ వస్తువులు తీసుకెళ్తుంటే స్కానర్‌లో పచ్చ లైటు వెలుగుతుంది. శరీరంలోని ఏ భాగంలో దాన్ని దాచిపెట్టారో ఓ నమూనా బొమ్మలో చూపెడుతుంది. దాని ఆధారంగా సంబంధిత అధికారులు తదుపరి తనిఖీలు చేపడుతారు.

మతం బదులు మానవత్వం

డిగ్రీ ప్రవేశాల దరఖాస్తులో వెసులుబాటు

కోల్‌కతా: మతం వివరాలను వెల్లడించడానికి ఇష్టంలేని విద్యార్థుల కోసం పశ్చిమ బెంగాల్‌లోని కళాశాలలు ప్రత్యేక వెసులుబాటును కల్పించాయి. డిగ్రీ కోర్సుల ప్రవేశాల దరఖాస్తు ఫారంలో 'మతం' అని రాయాల్సిన చోట 'మానవత్వం', 'భౌతికవాది', 'లౌకికవాది', 'మతాతీతం' అని పేర్కొంటే సరిపోతుంది. దాదాపు 50 కళాశాలలు ఈ విధానాన్ని అమలు చేస్తున్నాయి. తొలుత ఆన్‌లైన్ ద్వారా సమర్పిస్తున్న దరఖాస్తులకే దీన్ని పరిమితం చేశారు. చాలామంది విద్యార్థులు తమకు మతమంటే నమ్మకం లేదని రాస్తుండడంతో, పై ఐచ్ఛికాలను ఇచ్చామని ఓ అధికారి తెలిపారు. ఈ విధానాన్ని చాలా మంది విద్యార్థులు స్వాగతిస్తున్నారు.

ఐపీఎస్ అధికారినంటూ యువకుడి మోసం

- జైపుర్‌లో గుట్టు రట్టు

జైపుర్: ఐపీఎస్ అధికారిగా చెప్పుకొంటూ మోసాలకు పాల్పడుతున్న 20 ఏళ్ల యువకుడిని రాజస్థాన్‌లో పోలీసులు అరెస్టు చేశారు. అభయ్ మీనా అనే ఈ యువకుడు నిజానికి సామాజిక మాధ్యమాల్లో ఒక సంచలనంగా ఉన్నాడని పోలీసులు తెలిపారు. స్ఫూర్తిదాయక ప్రసంగాలు చేస్తుంటాడని చెప్పారు. 12వ తరగతి తప్పిన అతడు తాను ఐఐటీ, యూపీఎస్‌సీ పరీక్షలను మొదటి ప్రయత్నంలోనే సాధించేందుకు సుదీర్ఘ సమయం పాటు చదివేవాడినంటూ నమ్మబలికేవాడు. దీంతో చిన్నవయసులోనే ఐపీఎస్ అధికారిగా ఎదిగాడంటూ అనేక మంది అతడిని స్ఫూర్తిగా తీసుకున్నారని ఏఎస్పీ కరణ్ శర్మ చెప్పారు. అతడి మాయలో నిజమైన పోలీసు అధికారులూ పడ్డారు. అభయ్ గుర్తింపు కార్డును చూసిన ఒక వ్యక్తికి అనుమానం రావడంతో అతడి గుట్టు రట్టయింది. అందులో క్రైమ్ బ్రాంచ్, క్యాపిటల్ అనే ఆంగ్ల పదాల్లో అక్షర దోషాలు ఉన్నాయి. దీంతో జైపుర్‌లోని జగత్‌పుర లోని అతడి అపార్ట్‌మెంట్‌పై దాడి చేసిన ప్రత్యేక విభాగం పోలీసులు ఆ మోసగాడిని అరెస్టు చేశారు. ఆ సమయంలో పోలీసులను బెదిరించేందుకు అతడు ప్రయత్నించాడు. అంతిమంగా తన నేరాన్ని అంగీకరించాడు. దిల్లీ క్యాడర్ ఐపీఎస్ అధికారినని, అక్కడే ఏసీపీగా పనిచేస్తున్నానని జనాన్ని నమ్మించినట్లు చెప్పాడు.

3 నక్షత్రాల కారు.. 5 నక్షత్రాల హోటల్

అభయ్ తన కారుపై మూడు నక్షత్రాలు కలిగిన ఒక ఫలకాన్ని పెట్టుకునేవాడు. డీజీ లేదా అదనపు డీజీ అధికారి వాహనానికి మాత్రమే మూడు నక్షత్రాలు ఉంటాయి. "ఆ లాంఛనం సీనియర్ ఐపీఎస్ అధికారులకు మాత్రమే ఉంటుంది. అప్పుడు కొత్తగా సర్వీసులోకి ప్రవేశించిన 20 ఏళ్ల యువకుడికి కాదు. అయినా ట్రాఫిక్ పోలీసులు ఆ వాహనాన్ని ఎప్పుడూ తనిఖీ చేయకపోవడం ఆశ్చర్యంగా ఉంది" అని ఓ అధికారి చెప్పారు. అనేక అవార్డు కార్యక్రమాల్లో పాల్గొని, అసలైన పోలీసు అధికారులను కొనియాడాడు. వీరిలో కొందరు ఆయనకు సెల్యూట్ కూడా చేయడం గమనార్హం. అభయ్ ఒక మహిళతో సహజీవనం చేస్తున్నాడు. వారు ఖరీదైన హోటళ్లలో ఉంటారు. విలువైన రెస్టారెంట్లలో విందులు చేసుకునేవారు. బిల్లులు కూడా చెల్లించేవారు కాదు. న్యాయపరమైన కొన్ని కేసుల్లో సాయం చేసే సాకుతో అనేక మంది వద్ద అతడు డబ్బు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉచిత ల్యాప్‌టాప్‌ల పేరిట టోపీ!

- ఐఐటీ పోస్టుగ్రాడ్యుయేట్ అరెస్టు

దిల్లీ: ఉచితంగా ల్యాప్‌టాప్‌లు ఇస్తానంటూ నకిలీ వెబ్‌సైట్ నడుపుతున్న రాకేశ్ జాంగిడ్(23) అనే ఐఐటీ పోస్ట్‌గ్రాడ్యుయేట్‌ను దిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. భాజపా మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా 'ఉచిత ల్యాప్‌టాప్ ప్రభుత్వ పథకం'' పేరిట వీటిని పంపిణీ చేస్తున్నట్లు అతడు ప్రచారం చేశాడు. తన వెబ్‌సైట్‌లో ప్రధాని మోదీ ఫొటోతో పాటు 'భారత్‌లో తయారీ' లోగో ఉంచాడు. ఎంతోమందికి మల్టీమీడియా సందేశాలు పంపించాడు. ఇది వాట్సాప్‌లో వైరల్ అయిపోయింది. రెండు రోజుల్లోనే ఏకంగా 15 లక్షల మంది తమ వ్యక్తిగత వివరాలను ఆ వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. దీనిపై అనుమానం వచ్చిన ఓ వ్యక్తి దిల్లీ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారి విచారణలో రాకేశ్ మోసం బయటపడింది. హైదరాబాద్‌కు చెందిన కంపెనీ ఉద్యోగం ఇస్తానన్నా చేరకుండా మోసం ద్వారా సులువుగా డబ్బు సంపాదించాలని చూశాడని దర్యాప్తులో తేలింది. వెబ్‌సైట్‌లో ప్రజలు నమోదు చేసిన వ్యక్తిగత వివరాలను సైబర్ నేరగాళ్లకు అమ్మి సొమ్ము చేసుకుందామనుకున్నాడు. పైగా తన వెబ్‌సైట్‌ను ఎక్కువ మంది సందర్శిస్తున్నందున గూగుల్ ద్వారా ప్రకటనలు పొంది, డబ్బు సంపాదించాలని రాకేశ్ ఆశపడ్డాడు.

మంచు నీరే ప్రాణాధారం

- ఆసియాలో 22.1 కోట్ల మంది అవసరాలు తీరుస్తున్న హిమానీనదాలు

లండన్: కరవు కాటకాల సమయంలో హిమానీనదాలే ఆసియాలో జీవన రేఖలవుతున్నాయని బ్రిటన్ పరిశోధకులు చేపట్టిన తాజా అధ్యయనం తేల్చింది. ఈ ఖండంలోని ప్రధాన నదులకు అవే భారీగా నీటిని అందిస్తున్నాయని పేర్కొంది. నీటి కొరత తీవ్రంగా ఉన్న సమయంలో 22.1 కోట్ల మంది ప్రాథమిక అవసరాలను తీరుస్తున్నాయని వివరించింది. కరవు ముప్పు ఎక్కువగా ఉండే ఆసియాలో ఆర్థిక, సామాజికపరమైన ప్రభావాన్ని అంచనా వేయడానికి ఈ అధ్యయనం వీలు కలిగిస్తుందని భావిస్తున్నారు. ఆసియాలోని హిమాలయాలు సహా ఎత్తయిన పర్వత ప్రాంతాలను మూడో ధ్రువంగా పేర్కొంటారు. అక్కడ 95 వేల హిమానీనదాలు ఉన్నాయి. వాటిపైన మంచు కరిగినప్పుడు వచ్చే నీటిపై దాదాపు 80 కోట్ల మంది పాక్షికంగా ఆధారపడుతున్నారు. వర్షాలు పడనప్పుడు, నీటి కొరత తీవ్రమైనప్పుడు హిమానీనదాల నీరే దిగువ ప్రాంతాల్లోనివారికి ప్రాణాధారమవుతోందని బ్రిటన్‌లోని బ్రిటిష్ అంటార్కిట్ సర్వే (బీఏఎస్) నిపుణుడు హమీష్ ప్రిట్‌చార్డ్ పేర్కొన్నారు. ఏటా వేసవిలో ఈ మంచు పర్వతాలు 36 క్యూబిక్ కిలోమీటర్ల మేర నీటిని దిగువనున్న నదుల్లోకి విడుదల చేస్తున్నాయని తెలిపారు. అది 1.4 కోట్ల ఒలింపిక్ ఈత కొలనుల్లోని నీటితో సమానమని వివరించారు. అది 22.1 కోట్ల మంది అవసరాలను తీర్చడానికి సరిపోతాయన్నారు. "హిమానీనదాలు మారుమూల ప్రాంతాల్లో, చాలా చిన్న ప్రదేశంలోనే విస్తరించి ఉన్నప్పటికీ అవి సమాజానికి చాలా విలువైన ఆస్తులు. కరవు ఎక్కువ కాలం కొనసాగినప్పటికీ అవి నదుల్లోకి నీటిని అందిస్తున్నాయి" అని పేర్కొన్నారు.

అయితే ఈ నీటి సరఫరా ఒకేరీతిలో ఉండటంలేదు. వాతావరణ మార్పుల వల్ల ఈ ప్రాంతంలోని అనేక హిమానీనదాలు క్షీణించిపోవడమే ఇందుకు కారణం. ఏటా హిమపాతం వల్ల కొత్తగా జమయ్యే నీటితో పోలిస్తే 1.6 రెట్లు అధికంగా నీటిని కోల్పోతున్నాయని నిపుణులు హెచ్చరించారు.

స్విస్ చర్యలు ముమ్మరం

- నల్లధనం కేసుల్లో ప్రభుత్వం నుంచి తాఖీదులు
- పొట్లూరి రాజామోహన రావుకు అందిన నోటీసు

దిల్లీ/బెర్న్: అక్రమ డబ్బును కలిగి ఉన్నారన్న అనుమానాలున్న స్విస్ బ్యాంకు ఖాతాదారుల విషయంలో స్విట్జర్లాండ్ ప్రభుత్వం చర్యలను ముమ్మరం చేసింది. వారి వివరాలను భారత ప్రభుత్వానికి తెలియజేయడానికి ముందు సదరు ఖాతాదారులకు నోటీసులు జారీ చేస్తోంది. తాజాగా పొట్లూరి రాజామోహన రావు అనే వ్యక్తికి నోటీసు అందింది. నల్లధనం దాచుకునేవారికి సురక్షిత ఆవాసంగా స్విట్జర్లాండ్ గుర్తింపు పొందింది సంగతి తెలిసిందే. భారత్ సహా అనేక దేశాల నుంచి వచ్చిన ఒత్తిడికి తలొగ్గిన అక్కడి ప్రభుత్వం తన బ్యాంకుల్లోని గోప్యత నిబంధనలను సడలించింది. తద్వారా ప్రపంచ ఆర్థిక కేంద్రంగా తన హోదాను పునరుద్ధరించుకునేందుకు కృషి చేస్తోంది. ఇందులో భాగంగా స్విస్ బ్యాంకుల్లో ఖాతాలున్న విదేశీయుల సమాచారాన్ని ఆయా దేశాలతో పంచుకునేందుకు కొద్దినెలలుగా చర్యలు మొదలుపెట్టింది. ఆ మేరకు ఖాతాదారులకు చిట్టచివరి అవకాశాన్ని ఇస్తూ నోటీసులు జారీ చేస్తోంది. వారి బ్యాంకింగ్, ఇతర ఆర్థిక వివరాలను ఆయా దేశాల ప్రభుత్వాలతో పంచుకోకూడదనుకుంటే ఆధారాలతో అపీలు దాఖలు చేసుకోవాలని అందులో స్పష్టంచేస్తోంది. కొద్దినెలలుగా ఇలాంటి నోటీసులు పంపుతోంది. గత నెలలో 14 మంది భారతీయులకు తాఖీదులు అందాయి. అయితే వారి పూర్తి వివరాలను బహిర్గతం చేయడంలేదు. పెద్ద సంఖ్యలో భారత ఖాతాదారుల వివరాలను మన ప్రభుత్వం అడిగిన నేపథ్యంలో రానున్న కొన్ని వారాల్లో మరిన్ని నోటీసులు అందే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. తాజాగా పొట్లూరి రాజామోహన రావుకు నోటీసు అందింది. భారత అధికారులు కోరిన విధంగా 'పొలనాపరమైన సాయం' అందించకూడదనుకుంటే 10 రోజుల్లోగా అపీలు దాఖలు చేయాలని స్పష్టంచేసింది. రాజామోహన రావు పుట్టిన రోజును 1951 జులై 15గా స్విస్ ప్రభుత్వం పేర్కొంది. భారత్‌లో ఉంటారని తెలిపింది. అంతకుమించి మరే ఇతర వివరాలను వెల్లడించలేదు. అయితే దక్షిణాదిలో ఆయన టెలికం సహా అనేక వ్యాపారాలను నిర్వహిస్తున్నారని భారత అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే నోటీసుల అందుకున్న ఖాతాదారుల వివరాలను స్విస్ ప్రభుత్వం పూర్తిగా వెల్లడించలేదు. కొన్ని కేసుల్లో పేర్లను పొడి అక్షరాలతో సూచించింది. కృష్ణ భగవాన్ రామ్‌చంద్, కల్పేశ్ హర్షద్ కినారివాలా, రతన్ సింగ్ చౌధురి, కుల్దీప్ సింగ్ ధింగ్రా, అనిల్ భరద్వాజ్ వంటివారికి సంబంధించి మాత్రమే పూర్తి పేర్లు వెలువడ్డాయి.

ఒప్పందం లేకుండానే వచ్చేయండి

- థెరిసా మే వారసుడికి ట్రంప్ ఉచిత సలహా
- నేటి నుంచి బ్రిటన్‌లో అమెరికా అధ్యక్షుడి పర్యటన

లండన్: బ్రెగ్జిట్ విషయంలో ఏం చేయాలో పాలుపోక తల పట్టుకుంటున్న బ్రిటన్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తనదైన ఉచిత సలహా ఇచ్చారు. ఐరోపా సమాఖ్య (ఈయూ)తో ఎలాంటి ఒప్పందం చేసుకోకుండానే బయటకు రావాలన్నారు. ఈ వారం లండన్‌లో పర్యటించనున్న ఆయన బ్రిటన్ ప్రధాని థెరిసా మే వారసుడికి ఈ సలహా ఇచ్చారు. మే వారసుడిగా ఎవరు బాధ్యతలు చేపట్టినా ఈయూతో ఇంతకుముందు చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేయకుండా, నిర్భయంగా తిరస్కరించాలన్నారు. బ్రిటన్ స్థానంలో నేనే కనుక ఉంటే, అంతపెద్ద మొత్తం చెల్లించేవాడిని కాదని ట్రంప్ అంటున్నారు. మే స్థానంలో మాజీ విదేశాంగ మంత్రి బోరిస్ జాన్సన్ గొప్ప ప్రత్యామ్నాయం కాగలరని అభిప్రాయపడ్డారు. సండేటైమ్స్, మరో పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో ట్రంప్ ఈమేరకు వ్యాఖ్యానించారు. క్వీన్ ఎలిజబెత్ 2తో ప్రైవేటు విందుతో ట్రంప్ బ్రిటన్ పర్యటన సోమవారం నుంచి ప్రారంభం కానుంది. నాలుగు దశాబ్దాలుగా ఐరోపా సమాఖ్యలో సభ్యదేశంగా ఉన్నందుకు, బ్రిటన్ తరపున రుణాలకు 50 బిలియన్ డాలర్లు చెల్లించి ఈయూ నుంచి తప్పుకుంటామని గత ఏడాది నవంబరులో బ్రిటన్ ఒప్పందం చేసుకుంది. ఇంత పెద్దమొత్తం చెల్లించడానికి మే సొంత పార్టీ నుంచే వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీనిపై పార్లమెంటులో జరిగిన ఓటింగ్‌లో మూడుసార్లు చుక్కెదురైంది. దీంతో బ్రెగ్జిట్‌ను రెండుసార్లు వాయిదా వేయాల్సి వచ్చింది.

రాజీకి రావాలని అమెరికా ఒత్తిడి: చైనా

బీజింగ్: వాణిజ్య యుద్ధాన్ని ముగించడం కోసం ఓ ఒప్పందానికి వచ్చేలా తమపై అమెరికా తీవ్ర ఒత్తిడి తెస్తోందని చైనా ఆరోపించింది. అయితే నిర్దిష్ట సూత్రాలపై ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టంచేసింది. చర్చల ద్వారానే సమస్య పరిష్కారం కావాలని తేల్చి చెప్పింది. అమెరికాపై విమర్శలను పెంచుతూ చైనా ప్రభుత్వం ఆదివారం ఈ అంశంపై ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేసింది. సుంకాలపై జరుగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు గత ఏడాది నుంచి 11 విడతల్లో సుదీర్ఘంగా జరిగిన చర్చల ప్రక్రియను ఇందులో వివరించింది. అమెరికా విధించిన సుంకాలు ఆ దేశ ఆర్థిక వృద్ధికి ఊతమివ్వకపోగా తీవ్ర నష్టం కలిగించాయని పేర్కొంది. చర్చల సమయంలో కుదిరిన ఒప్పందం నుంచి చైనా వెనక్కి మళ్లిందన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపణలను ఖండించింది.

రోడ్డు ప్రమాదంలో 'క్వీన్ హరీశ్' మృతి

జైపుర్: ప్రపంచ ప్రసిద్ధ జానపద కళాకారుడు 'క్వీన్ హరీశ్' ఆదివారం ఉదయం జోధ్‌పుర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఈయనతో పాటు మరో ముగ్గురూ మృతి చెందారు. మరో ఐదుగురు గాయపడ్డారు. జైసల్మేరు నుంచి అజ్‌మేర్‌కు ఓ కళాప్రదర్శన ఇవ్వడానికి ఎస్‌యూవీలో ప్రయాణిస్తుండగా కపర్ద గ్రామానికి సమీపాన ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వీరి వాహనం స్టేషనరీ ట్రక్కును ఢీకొందని బిలారా ఎస్ఐ సీతారం భోజా తెలిపారు.'జైసల్మేర్‌కు చెందిన హరీశ్‌కుమార్ తన జీవితాన్ని జానపద కళలకు, రాజస్థాన్ సంస్కృతికి అంకితం చేశారు. జైసల్మేరుకు కొత్త గుర్తింపు తీసుకొచ్చారు. ఆయన మృతి జానపద కళలకు తీరని లోటు' అని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ సంతాపం వ్యక్తం చేశారు.

బఫెట్‌తో విందుకు రూ.31 కోట్లు

- బిడ్ గెల్చుకున్న అజ్ఞాత వ్యక్తి

వారెన్ బఫెట్

న్యూయార్క్: అపర కుబేరుడు వారెన్ బఫెట్‌తో ప్రైవేటు విందు చేసేందుకు నిర్వహించిన వేలంలో ఓ అజ్ఞాత వ్యక్తి భారీ స్థాయిలో 45,67,888 డాలర్లు (దాదాపు రూ.31 కోట్లు) చెల్లించేందుకు ముందుకొచ్చారు. 2012, 2016లో సమకూరిన 35,56,789 డాలర్ల రికార్డును ఇది బద్దలు కొట్టింది.

దాతృత్వ కార్యక్రమాలకు నిధులు సమకూర్చేందుకు బఫెట్ ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది 'ఈబే'లో ఐదు రోజుల పాటు ఆన్‌లైన్‌లో వేలం చేశారు. ఆ గడువు శుక్రవారం రాత్రితో ముగిసింది. ఈసారి వచ్చే సొమ్మును శాన్‌ఫ్రాన్సిస్కోలోని 'గ్లైడ్ ఫౌండేషన్' అనే స్వచ్ఛంద సంస్థకు అందిస్తారు. పేదలు, నిరాశ్రయులకు ఈ సంస్థ సేవలు అందిస్తోంది. బఫెట్ ఇప్పటికే 20సార్లు నిర్వహించిన వేలం ద్వారా 3.42 కోట్ల డాలర్లను ఈ సంస్థకు సమకూర్చారు. 2004లో చనిపోయిన మొదటి భార్య సుసాన్ ద్వారా 'గ్లైడ్ ఫౌండేషన్' ఆయనకు పరిచయమైంది. తాజా వేలంపై బఫెట్ ఆనందం వ్యక్తంచేశారని గ్లైడ్ సంస్థ అధ్యక్షురాలు కేరన్ హాన్‌రాహన్ పేర్కొన్నారు. తాను ఆరోగ్యంగా ఉన్నంతకాలం వేలం నిర్వహిస్తుంటానని ఆయన చెప్పినట్లు వివరించారు. ఈ ఏడాది వేలంలో ఐదుగురు బిడ్డర్లు 18 బిడ్లను దాఖలు చేశారు. నిబంధనల ప్రకారం బిడ్ గెల్చుకున్న విజేత, ఆయనకు సంబంధించిన ఏడుగురు మిత్రులు బఫెట్‌తో కలసి మాన్‌హటన్‌లోని స్మిత్ అండ్ వోలెన్‌స్కీ స్టీక్‌హౌస్‌లో విందుకు హాజరుకావొచ్చు. ఆ సందర్భంగా బఫెట్ తదుపరి పెట్టబోయే పెట్టుబడుల మినహా ఏ అంశం పైనైనా చర్చించవచ్చు.

ఆదివారం బెంగళూరులో మోగ్రిప్ సూపర్‌స్కోర్ ఛాంపియన్‌షిప్-2019లో భాగంగా విన్యాసాలు చేస్తున్న ఆస్ట్రేలియా నిపుణుడు

బీఎస్పీ సముల ప్రక్షాళన

లఖ్‌నవూ: సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై తీవ్ర అసంతృప్తితో ఉన్న బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి.. తమ పార్టీని పూర్తిగా ప్రక్షాళన చేస్తున్నారు. ఉత్తరాఖండ్, బిహార్, ఝార్ఖండ్, ఒడిశా, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల పార్టీ ఇన్‌చార్జులను తొలగించడంతో పాటు దిల్లీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల అధ్యక్షులను మార్చారు. బీఎస్పీ దిల్లీ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రసింగ్ స్థానంలో లక్ష్మణ్‌సింగ్‌ను నియమించారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు డీపీ చౌదరి స్థానంలోకి రమాకాంత్ పుత్తల్‌ను పంపారు.

ఝార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్... జవాను మృతి

దుమ్కా: ఝార్ఖండ్‌లోని దుమ్కా జిల్లా పరిధిలోని అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ)కి చెందిన ఓ జవాన్ మృతి చెందారు. మరో నలుగురు గాయపడ్డారు. ఆదివారం తెల్లవారుజామున ఎస్ఎస్‌బీ జవాన్లు, పోలీసులు కలిసి కూంబింగ్ చేస్తుండగా మావోయిస్టులు తారసపడ్డారు. ఎదురుకాల్పుల్లో ఐదుగురు ఎస్ఎస్‌బీ జవాన్లకు గాయాలయ్యాయి. ఇందులో అసోంకు చెందిన నీరజ్ చెత్రీ చనిపోయారు.

నలుగురు పర్వతారోహకులను రక్షించిన అధికారులు

పితోరాగఢ్: ఉత్తరాఖండ్‌లోని పితోరాగఢ్ జిల్లా నందాదేవి తూర్పు శిఖరం బేస్ క్యాంపు వద్ద చిక్కుకుపోయిన నలుగురు బ్రిటన్ పర్వతారోహకులను అధికారులు ఆదివారం రక్షించారు. ఈ శిఖరంపై గత నెల 25 నుంచి కనిపించకుండాపోయిన మార్టిన్ మోరన్ బృంద సభ్యుల కోసం గాలింపు చర్యలు చేపట్టగా.. మరో బృందానికి చెందిన నలుగురు పర్వతారోహకులు తారసపడగా వారిని సురక్షిత స్థావరానికి తరలించారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

Eenadu epaper

TODAYS

NEWS PAPER

TELUGU